www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



2


ఏఐ బేబీ
కృత్రిమ మేధ ఆధారిత ఐవీఎఫ్ విధానంలో తొలి శిశువు.. మెక్సికోలో జననం

శుక్రవారం | 11-4-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 356 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, శుక్ల పక్షం, తిథి: చతుర్దశి తె. 3.22 తదుపరి పౌర్ణమి, నక్షత్రం: ఉత్తర మ.3.10 తదుపరి హస్త, వర్జ్యం: రా.12.36-2.24, దుర్ముహూర్తం: ఉ.8.33-9.23, మ.12.41-1.30, అమృతఘడియలు: ఉ.7.08-8.55, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.26 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



నాడు 2021 సెప్టెంబరు 17న చంద్రబాబు ఇంటి వద్ద నాటి వైసీపీ ఎమ్మెల్యే జోగి రమేశ్ తన అనుచరులతో కలిసి నానా బీభత్సం సృష్టించారు. కట్ చేస్తే.. జోగి రమేశ్‌ను జగన్ మంత్రిని చేశారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి వ్యక్తిత్వాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన వంశీని ఆనాడు వెనకేసుకురావడమే కాకుండా, కూటమి ప్రభుత్వం వంశీని అరెస్టు చేస్తే జైలుకు వెళ్లి మరీ వైసీపీ అధినేత పరామర్శించారు.



నేడు జగన్, ఆయన కుటుంబంపై సోషల్ మీడియాలో చేబ్రోలు కిరణ్ అనే టీడీపీ కార్యకర్త తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అయితే, కిరణ్‌ను 24గంటల్లోపే టీడీపీ సస్పెండ్ చేసింది. ఆ వెంటనే పోలీసులు అరెస్టు చేశారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికే సోషల్ సైకోల పని పట్టడానికి ప్రత్యేక పోలీస్ బృందాల్ని నియమించింది. వైసీపీతోపాటు కూటమి కేడర్‌పైనా ఈ టీమ్‌లు కన్నేసి, అవసరమైతే అరెస్టులూ చేస్తున్నాయి.

ఎంత తేడా!

నాడు తిట్టినా, దాడి చేసినా నజరానాలు
నేడు సొంత పార్టీ వారైనా గీత దాటితే వేటే

జగన్ కుటుంబంపై టీడీపీ కార్యకర్త అసభ్య వ్యాఖ్యలు

24 గంటల్లోనే సస్పెండ్ చేసిన టీడీపీ అధిష్ఠానం

కిరణ్‌పై చర్యలకు సర్కారు ఆదేశం.. వెంటనే అరెస్టు

సోషల్ సైకోలను వదిలేది లేదనే సంకేతం

అసభ్యకర పోస్టులపై తొలి నుంచీ ఉక్కుపాదమే

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

సోషల్ సైకోలు ఏ పార్టీలో ఉన్నా అణచివేయాలన్న సంకల్పాన్ని కూటమి ప్రభుత్వం ఆచరణలో చేసి చూపించింది. తిడితే పదవులు, తీవ్రంగా దూషిస్తే నజరానాలు, అసభ్యకర పోస్టులు సోషల్ మీడియాలో పెడితే ప్రభుత్వంలో చాన్స్ ఇస్తూ జగన్ ఐదేళ్లు అరాచక సంస్కృతిని పెంచి పోషించారు. రాష్ట్రంలోని ఈ వాతావరణాన్ని ప్రక్షాళన చేయడానికి ఇప్పటికే పార్టీ, ప్రభుత్వ స్థాయిలో కూటమి చర్యలు తీసుకొంది. ఇందులోభాగంగానే.. ఇప్పుడు సొంత పార్టీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌పై టీడీపీ వేటు వేసింది. ప్రముఖులపై

మిగతా 14వ పేజీలో...



మాజీ సీఎం జగన్ సతీమణి భారతిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కిరణ్‌ను ఇబ్రహీంపట్నం వద్ద అదుపులోకి తీసుకుంటున్న మంగళగిరి పోలీసులు

పోలీసులపై గోరంట్ల మాధవ్ దౌర్జన్యం

వారి అదుపులోని చేబ్రోలు కిరణ్‌పై దాడి యత్నం



గుంటూరు ఎస్పీ కార్యాలయం వద్ద గోరంట్ల మాధవ్ హల్‌చల్

అడ్డుకోబోయిన పోలీసులపైనా వీరంగం

వాహనాన్ని వెంబడించిన మాజీ ఎంపీ

ఎస్పీ కార్యాలయం వద్ద హల్‌చల్

అరెస్టు చేసిన గుంటూరు పోలీసులు

గుంటూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హిందూపురం మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ గుంటూరులో పోలీసులపై రెచ్చిపోయారు. మాజీ సీఎం జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోలీసుల అదుపులో ఉన్న చేబ్రోలు కిరణ్‌పై దాడి చేయడానికి తీవ్రంగా ప్రయత్నించారు. ఇబ్రహీంపట్నం శివారులో కిరణ్‌ను అరెస్టుచేసి తీసుకొస్తున్న పోలీసులను గుంటూరు ఎస్పీ కార్యాలయం సమీపంలో అడ్డగించబోయారు. ఈ సందర్భంగా

మిగతా 14వ పేజీలో...



ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు బీసీ జనార్దన్, టీజీ భరత్, సుభాష్, అనగాని, లోకేశ్, గొట్టిపాటి, సీఎస్ విజయానంద్

పరి'శ్రమ' ఫలించాలి!

ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలు కావాలి

ఉత్పత్తి ఎప్పుడు ప్రారంభిస్తారో కనుక్కోవాలి

ఇప్పటిదాకా జరిగిన ఒప్పందాల పురోగతి ఏమిటి?

ఎంత మందికి ఉద్యోగాలు వచ్చాయి?

ప్రత్యేక పోర్టల్‌లో వివరాలు పొందుపరచాలి

ఎస్ఐపీబీ భేటీలో చంద్రబాబు ఆదేశం

ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూములు

17 పారిశ్రామిక సంస్థలతో ఒప్పందాలు ఖరారు

వివిధ రంగాల్లో రూ.31,167 కోట్ల పెట్టుబడులు

32,633 మందికి ఉద్యోగాల కల్పన

10 నెలల్లోనే ఐదు ఎస్ఐపీబీ సమావేశాలు

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'ఒప్పందాలు కుదుర్చుకోవడం... పెట్టుబడులు రావడం మాత్రమే కాదు! పరిశ్రమలు ప్రారంభం కావాలి... ఆ ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపించాలి!' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. అనుకున్న సమయానికి పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించడం చాలా అవసరమని తెలిపారు. గురువారం వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం

మిగతా 13వ పేజీలో...

పదేళ్లయినా ఇంకా కోలుకోలేదు!

విభజిత ఆంధ్రకు రెవెన్యూ లోటు గ్రాంటు కావాలి

16వ ఆర్థిక సంఘాన్ని కోరనున్న ఆంధ్ర

బడ్జెట్ ఉన్నంత వరకే పనులు.. బిల్లులూ అంతవరకే

చెల్లింపులపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

తోపుదుర్తిపై కేసు

వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి హెలిప్యాడ్ వద్దకు

అక్కడ పోలీసులతో దురుసు ప్రవర్తన 14

జగన్ పర్యటనలో గాయపడ్డ కానిస్టేబుల్ ఫిర్యాదు

రామగిరి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

నర్సింగ్‌కూ 'సెట్'!

ఏపీలో తొలిసారిగా అమలుకు నిర్ణయం

జూన్‌లో పరీక్ష.. జూలై నాటికి అడ్మిషన్లు 13

ఇక వేసవి సెలవుల్లోనే బదిలీలు

అమల్లోకి వచ్చిన ఉపాధ్యాయ బదిలీల చట్టం 13

ఆన్‌లైన్ రమ్మీలో 1.4 కోట్లు పోయాయ్ 13

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వేసవి తర్వాత వస్తాంలే సార్!

ఇంటర్ విద్యా సంవత్సరం మార్పుపై మిశ్రమ స్పందన

జూన్ 1కు బదులు ఈసారి ఏప్రిల్ 1నే ప్రారంభం

తరగతులకు వచ్చేందుకు విద్యార్థుల అనాసక్తి

రోజూ 30 శాతం మందే హాజరు

కొన్ని కాలేజీల్లో అయితే పది శాతమే

టెన్త్ ఫలితాలు వచ్చాకే ఇంటర్‌లో చేరే ఆలోచన

సెకండియర్ విద్యార్థుల హాజరూ తక్కువే

గ్రూప్ ఎంపికపై అస్పష్టత.. ఠారెత్తిస్తున్న ఎండలు




(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఇంటర్మీడియట్ విద్యా సంవత్సరం మార్పుపై విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ఆశించిన స్పందన కనిపించడం లేదు. విద్యా సంవత్సరాన్ని రెండు నెలలు ముందుకు తీసుకొచ్చినా కాలేజీలకు విద్యార్థులు రావడం లేదు. కొత్తగా ఫస్టియర్‌లో విద్యార్థులు చేరడం సంగతి అటుంచితే, ఫస్టియర్ నుంచి సెకండియర్‌కు ప్రమోట్ అయిన విద్యార్థులు కూడా కాలేజీలకు హాజరు కావడం లేదు. సాధారణంగా ఏటా జూన్ 1న ఇంటర్ విద్యా సంవత్సరం ప్రారంభమవుతుంది. అయితే ఈలోగా ప్రైవేటు కాలేజీలు ఇంటింటి ప్రచారం చేసుకుని విద్యార్థులను చేర్పించుకుంటున్నారని, ఫలితంగా

మిగతా 13వ పేజీలో...

నేడే ఒంటిమిట్ట రాములోరి కల్యాణం



విద్యుద్దీపకాంతుల్లో ఒంటిమిట్ట కోదండరామాలయం 12

విశాఖ విమానాశ్రయం వెలవెల 13

ఎడాపెడా సర్వీసులకు మంగళం

ఏప్రిల్ 1 నుంచి విజయవాడకు విమానాల నిలిపివేత

మే 1 నుంచి మలేసియా, బ్యాంకాక్ సర్వీస్‌లూ బంద్

ఆర్థిక, పారిశ్రామిక రాజధానిగా విశాఖకు పేరు

సర్వీసులు పెంచాల్సింది పోయి తగ్గించడంపై అసంతృప్తి

'ఆడుదాం'లో కోట్లాట!

ఇంజనీరింగ్ అధికారి ఇంటి 'గుట్టు' రట్టు

ఆడుదాం ఆంధ్రా టెండర్లలో కోట్లు కుమ్ముడు

సన్నిహితురాలికి భూమి, 12 కోట్ల నగదు

గత ప్రభుత్వంలో శాప్ అధికారి అవినీతి లీలలు

చివరికి కుటుంబ సభ్యులకు తెలియడంతో రచ్చ

ఆస్తి వెనక్కి ఇవ్వాలని సదరు మహిళతో గొడవ

వ్యవహారం నందిగామ స్టేషన్‌కు.. కేసు నమోదు



(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్రా'లో ఆటల సంగతి ఏమో గానీ.. ఈ కార్యక్రమం పేరిట జరిగిన అవినీతి అంతా ఇంతా కాదు. తాజాగా శాప్‌లో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న కడప జిల్లాకు చెందిన ఓ ఇంజనీరింగ్ అధికారి ఇంటి 'గుట్టు' రట్టు బయటపడింది. గత ప్రభుత్వంలో ఈ కార్యక్రమంలో టెండర్ల ప్రక్రియను నిర్వహించిన ఆయన కాంట్రాక్టర్ల నుంచి కోట్లు కుమ్మేశారు. విజయవాడలో పరిచయమైన ఓ మహిళ ఆయనకు అత్యంత సన్నిహితురాలిగా

మిగతా 14వ పేజీలో...

మంత్రి కొల్లు ఓఎస్‌డీ తొలగింపు

గనుల శాఖపై తీవ్ర విమర్శల నేపథ్యంలో నిర్ణయం

నివేదిక తెప్పించుకున్న సీఎం చంద్రబాబు 13

ఓఎస్‌డీ రాజాబాబును తప్పించాలని ఆదేశం

నియామకానికి ముందే ఆయనపై తీవ్ర ఆరోపణలు

అయినప్పటికీ ఆయనే కావాలని నాడు పట్టుబట్టిన మంత్రి

వక్ఫ్‌లో ఎట్టకేలకు దిద్దుబాటు

భూముల లీజు నోటీసు రద్దు 13

సీఎం ఆదేశాలతో చర్యలు.. సీఈవోపై వేటు?

గ్రామ, వార్డు సచివాలయాల వర్గీకరణ

జనాభా ఆధారంగా ఏ, బీ, సీ కేటగిరీలు

ఉద్యోగులను హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు 12

టెక్స్‌టైల్స్‌లో నవశకం

10 వేల కోట్ల పెట్టుబడి.. 2 లక్షల మందికి ఉపాధే లక్ష్యం

పెట్టుబడిదారులందరికీ రాయితీలు, ప్రోత్సాహకాలు

నూతన టెక్స్‌టైల్ పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం 12



ఢిల్లీలోని ఎయిర్‌పోర్టులో తహవ్వుర్ రాణాతో ఎన్ఐఏ అధికారులు

తిహాడ్‌కు రాణా

ముంబై మారణహోమం సూత్రధారి అమెరికా నుంచి భారత్‌కు తరలింపు

బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో ఎన్ఐఏ కోర్టుకు.. అనంతరం తిహాడ్‌కు

ఎన్ఐఏ ఆఫీసులో విచారించనున్న సైకాలజిస్టులతో కూడిన ప్రత్యేక బృందం

మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: షా

అది మేం మొదలుపెట్టిన పని మోదీ గొప్పతనమేమీ లేదు: చిదంబరం

తహవ్వుర్ రాణా కెనడా పౌరుడు.. మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: అమెరికా కోర్టుల్లో న్యాయ పోరాటాలు.. దౌత్యపరమైన ఒత్తిళ్లు.. 15 ఏళ్ల పాటు జరిగిన విచారణలు.. అన్నీ ముగిసి ముంబై మారణహోమం సూత్రధారి తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకువచ్చే ప్రక్రియ పూర్తయింది. అమెరికాలోని లాస్ ఏంజిలిస్‌లో అక్కడి అధికారుల నుంచి రాణాను అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ అధికారులు అతడిని ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తరలించారు. గురువారం

మిగతా 2వ పేజీలో...

ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్?

కొనడానికి ఇదే సమయమంటూ..

సుంకాల అమలు వాయిదాకు ముందు పోస్ట్

రూ.3,570 కోట్ల మేర పెరిగిన ట్రంప్ సంపద

దీనిపై విచారణ జరపాలని డెమోక్రాట్ల డిమాండ్

బెదిరింపులకు లొంగం.. చర్చలకు సిద్ధం: చైనా

అమెరికాకు వ్యతిరేకంగా కూటమి కట్టే దిశగా..

యూరప్, దక్షిణాసియా నేతలతో సంప్రదింపులు

జిన్‌పింగ్ చాలా తెలివైన నేత అని ట్రంప్ ప్రశంస

తొలుత విధించిన 20 శాతం సుంకాలు కలిపితే

చైనాపై సుంకాలు 145 శాతానికి: వైట్‌హౌస్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: ప్రతీకార సుంకాల అమలును 90 రోజులపాటు వాయిదా వేస్తున్నట్టు ప్రకటించడానికి మూడు గంటల ముందు.. ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమమైన ట్రూత్ సోషల్‌లో ఒక ఏక వాక్య పోస్టు పెట్టారు. "కొనడానికి ఇది గొప్ప సమయం!!! డీజేటీ" అని ఆ పోస్టులో ఆయన రాశారు. ఏం కొనడానికి అది గొప్ప సమయమో ఆయన నిర్దిష్టంగా చెప్పలేదు గానీ.. ఆయన పోస్టులోని 'డీజేటీ' అనే పొడి అక్షరాలను మాత్రం స్టాక్‌మార్కెట్లో ట్రంప్ మీడియా అండ్ టెక్నాలజీ గ్రూప్‌ను ఉద్దేశించి

మిగతా 2వ పేజీలో...

విద్యార్థి వీసా రద్దయితే ఇంటికేనా?

15 రోజుల్లో వెళ్లిపోవాలని నిబంధన

అయోమయంలో భారత విద్యార్థులు

వర్సిటీలు, న్యాయవాదుల మద్దతుతో కొంతమేర ఉపశమనం 11

యూదు వ్యతిరేక పోస్టులు పెడితే..

వీసా రద్దు!

యూఎస్‌సీఐఎస్ ప్రకటన

తిహాడ్‌కు రాణా

(మొదటిపేజీ తరువాయి)

సాయంత్రం ఢిల్లీలోని పాలం ఎయిర్‌బేస్‌లో విమానం ల్యాండ్ అయింది. అక్కడే రాణాను లాంఛనంగా అరెస్టు చేసిన ఎన్‌ఐఏ అధికారులు.. వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం బుల్లెట్ ప్రూఫ్ వాహనంలో పటియాలా హౌస్ ఎన్‌ఐఏ కోర్టుకు తరలించి న్యాయమూర్తి చందర్‌జిత్ సింగ్ ఎదుట హాజరుపర్చారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు తీహాడ్ జైలుకు తరలించారు. ఈ సందర్భంగా రాణాను తరలించే మార్గాల్లో, కోర్టు పరిసరాల్లో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. రాణా వయసు ప్రస్తుతం 64 ఏళ్లు.

166 మందిని బలిగొన్న మారణ హోమం..

కసబ్ సహా పది మంది లష్కరే తాయిబా ఉగ్రవాదులు 2008 నవంబరు 26న పాకిస్థాన్ నుంచి సముద్ర మార్గంలో ముంబైకి చేరుకుని దారుణ మారణహోమానికి పాల్పడిన విషయం తెలిసిందే. 166 మంది ప్రాణాలను బలిగొన్న ఆ ఉగ్రదాడికి పాల్పడినవారిలో కసబ్ ఒక్కడు ప్రాణాలతో పట్టుబడ్డాడు. దీనిపై దర్యాప్తు చేపట్టిన ఎన్‌ఐఏ (జాతీయ దర్యాప్తు సంస్థ).. అమెరికా జాతీయుడు డేవిడ్ హెడ్లీ, పాకిస్థాన్ సంతతికి చెందిన కెనడా పౌరుడు తహవ్వుర్ రాణా కీలక సూత్రధారులుగా తేల్చింది.

పాక్‌లో పుట్టి.. కెనడా పౌరుడిగా మారి..

పాకిస్థాన్‌కు చెందిన రాణా.. ఆ దేశ సైన్యంలో వైద్యుడిగా పనిచేశాడు. అప్పుడే పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలు ఏర్పడ్డాయి. అదే సమయంలో లష్కరేతాయిబా ఉగ్రవాది, అమెరికన్ పౌరుడు డేవిడ్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీతో పరిచయం ఏర్పడింది. 1997లో రాణా కెనడాకు వలసవెళ్లాడు. ఇమిగ్రేషన్‌కు సంబంధించి పలు వ్యాపారాలు చేశాడు. 2001లో కెనడా పౌరసత్వం పొందాడు. ఆ తర్వాత అమెరికాలోని చికాగోకు చేరుకుని ఇమిగ్రేషన్ ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. నిజానికి లష్కరేతాయిబా సంస్థ ఉగ్రదాడులు, ఉగ్రవాదులు వివిధ దేశాలకు ప్రయాణించేందుకు ఈ సంస్థను అడ్డుపెట్టుకున్నారన్న విషయం తర్వాత బయటపడింది. మరోవైపు డేవిడ్ హెడ్లీ లష్కరేతాయిబాలో భారీ ఉగ్రదాడులపై ప్రత్యేకంగా శిక్షణ పొందాడు. ఆ సమయంలో రాణా, హెడ్లీ తరచూ సంప్రదింపుల్లో ఉండేవారు. ఈ క్రమంలోనే భారత్‌లో భారీ దాడులకు ప్లాన్ వేశారు. రాణా సాయంతో హెడ్లీ ముంబైలో 'ఫస్ట్ వరల్డ్ ఇమిగ్రేషన్ సర్వీసెస్' పేరిట ఏజెన్సీని ఏర్పాటు చేశాడు. లష్కరేతాయిబా, ఐఎస్ఐల సూచనల మేరకు.. ముంబైలో తాజ్ హోటల్, ఒబెరాయ్ హోటల్, నారీమన్ పాయింట్ వద్ద రెక్కీ చేసి, మ్యాపులు రూపొందించాడు. అమెరికా మీదుగా పాక్ వెళ్లి వివరాలన్నీ లష్కరేతాయిబా, ఐఎస్ఐ బాసులకు అందజేసి.. ఉగ్రదాడులకు రూపకల్పన చేశారు. ఈ క్రమంలో రాణా, హెడ్లీ 231 సార్లు మాట్లాడుకున్నట్టు ఎన్‌ఐఏ గుర్తించింది. మరోవైపు రాణా కూడా దాడులకు ముందు సెప్టెంబర్ 13 నుంచి 21 వరకు వైద్యురాలైన తన భార్యతో కలిసి భారత్‌లో పర్యటించాడు. తాజ్‌మహల్ వద్ద, ముంబైలో, కేరళలోని కోచిలో రెక్కీ చేసి వెళ్లాడు. తర్వాత ఐదు రోజులకే ముంబైలో ఉగ్రదాడి జరిగింది. కుంభమేళాలో ఉగ్రదాడికి కూడా రాణా ప్రణాళిక వేసినట్టు గుర్తించారు.

చట్టపరంగా... దౌత్యపరంగా..

భారత్ చట్టపరంగా, దౌత్యపరంగా చాకచక్యంగా వ్యవహరించడంతోనే రాణా అప్పగింత సాధ్యమైందని నిపుణులు చెబుతున్నారు. ముంబై పేలుళ్లతోపాటు డెన్మార్క్‌లోని ఓ వార్తాపత్రిక కార్యాలయంపై ఉగ్రదాడికి సంబంధించిన కేసులలో 2009లో రాణాను అమెరికా పోలీసులు అరెస్టు చేశారు. విచారణ జరిపిన అక్కడి కోర్టు ముంబై పేలుళ్ల వ్యవహారంలో నేరుగా సంబంధం లేదని కొట్టివేసింది. కానీ డెన్మార్క్ కేసులో 2013 జనవరిలో అతడికి 14 ఏళ్ల జైలుశిక్ష విధించింది. అప్పటి నుంచి జైల్లో ఉన్న రాణాను ముంబై ఉగ్రదాడి కేసు విచారణ కోసం అప్పగించాలని భారత్ అమెరికాపై ఒత్తిడి తెచ్చింది. దీనిపై అమెరికా కోర్టుల్లో పిటిషన్లు వేసి పోరాడింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో రాణా అప్పగింతకు అమెరికా విదేశాంగశాఖ అనుమతి ఇచ్చింది. అప్పగింత నిర్ణయానికి వ్యతిరేకంగా రాణా అమెరికన్ కోర్టుల్లో వరుసగా పిటిషన్లు వేశాడు. పలుమార్లు గుండెపోటు వచ్చిందని, తీవ్రమైన కిడ్నీల వ్యాధి ఉందని.. తాను పాక్ ఆర్మీ మాజీ అధికారి కావడం, ముస్లిం కావడం వల్ల హింసించే అవకాశం ఉందని అతని తరఫు న్యాయవాదులు వాదించారు. భారత్‌కు అప్పగిస్తే తన ప్రాణాలకు ప్రమాదమని పేర్కొన్నారు. ముంబై పేలుళ్ల కేసులో అమెరికా కోర్టు తనను అప్పటికే విచారించిందని, అదే కేసులో భారత్‌కు అప్పగించడం 'డబుల్ జియోపార్డీ (ఒకే కేసులో రెండు సార్లు విచారించడాన్ని నిరోధించే) చట్టం'ను ఉల్లంఘించడమేనని వాదించారు. అయితే ముంబై మారణహోమానికి అతను సూత్రధారి అని, విచారించాల్సి ఉందని భారత న్యాయ నిపుణులు వాదించారు. ఈ కేసులో 'డబుల్ జియోపార్డీ' వర్తించదని అమెరికా కోర్టులకు వివరించి ఒప్పించారు. రాణా భద్రతకు, న్యాయపరమైన హక్కుల కల్పనకు హామీ ఇస్తున్నట్టు వివరించారు. మరోవైపు దౌత్యపరంగానూ అమెరికాపై ఒత్తిడి తెచ్చి రాణా అప్పగింతకు అంగీకరించేలా చేయడంలో భారత్ సఫలమైందని నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌ఐఏ తరఫున దయాన్ కృష్ణన్, నరేందర్ మన్..

ముంబై ఉగ్రదాడి కేసు చాలా కీలకమైనది కావడంతో ఎన్‌ఐఏ తరఫున కోర్టుల్లో వాదించడానికి సీనియర్ న్యాయవాది నరేందర్ మన్‌ను స్పెషల్ ప్రాసిక్యూటర్‌గా కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఎన్‌ఐఏ తరఫున అమెరికా కోర్టుల్లో వాదించిన సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్‌తో కలిసి నరేందర్ మన్ వాదనలు వినిపించనున్నారు. ఇక తహవ్వుర్ రాణాకు న్యాయ సహాయంలో భాగంగా ఢిల్లీ లీగల్ సర్వీసెస్ అథారిటీ నుంచి పీయూష్ సచ్‌దేవ వాదనలు వినిపించనున్నారు.

అధికారులు, సైకాలజిస్టులతో విచారణ!

లష్కరేతాయిబా ఉగ్రవాద సంస్థలో కఠిన శిక్షణ పొందిన తహవ్వుర్ రాణా నుంచి సమాచారం రాబట్టడం అంత తేలిక కాదని నిఘా వర్గాలు చెబుతున్నాయి. "అమెరికాలో అతడిని ఇప్పటికే తీవ్రస్థాయిలో విచారణ చేశారు. ఎలా తప్పుదోవ పట్టించాలో అతడికి తెలుసు. ఎన్‌ఐఏ అధికారులతోపాటు నిఘా ఏజెంట్లు, నేర ప్రవర్తన-ఉగ్రవాద నిరోధక అంశాలపై ప్రత్యేకంగా శిక్షణ పొందిన సైకాలజిస్టులతో కూడిన బృందం రాణాను విచారించి సమాధానాలు రాబడుతుంది. ఇందుకు కొంత ఎక్కువ సమయమే పట్టొచ్చు.." అని పేర్కొంటున్నాయి. కాగా ఢిల్లీలోని ఎన్‌ఐఏ ప్రధాన కార్యాలయంలో ఉన్న ప్రత్యేకమైన సెల్‌లో రాణాను విచారిస్తారని నిఘా వర్గాలు తెలిపాయి. ఎన్‌ఐఏ డీజీ సదానంద్ దతే, ఐజీ అశీశ్ బాత్రా, డీఐజీ జయరాయ్ సహా 12 మంది అధికారులకు మాత్రమే అందులోకి ప్రవేశించే అనుమతి ఉంటుందని వెల్లడించాయి.



పటియాలా హౌస్‌లోని ఎన్‌ఐఏ కోర్టు ముందు పోలీసు బలగాలు; ఇన్‌సెట్‌లో రాణా

నాటి దాడిలో గాయపడి.. నేడు ఎన్‌ఐఏ చీఫ్‌గా..

ప్రస్తుతం ఎన్‌ఐఏ డైరెక్టర్ జనరల్‌గా ఉన్న సదానంద్ దాతే.. నాడు ముంబై ఉగ్రదాడిలో ప్రాణాలకు తెగించి పోరాడటం విశేషం. అప్పట్లో ముంబై అదనపు పోలీస్ కమిషనర్‌గా ఉన్న సదానంద్ దాతే.. ఉగ్రవాద దాడుల విషయం తెలిసి స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో ఉగ్రవాది కసబ్ విసిరిన గ్రనేడ్ పేలి తీవ్రంగా గాయపడ్డారు. నాడు చూపిన తెగువకు రాష్ట్రపతి పోలీస్ మెడల్ కూడా అందుకున్నారు.

మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమిది: అమిత్ షా

ఉగ్రవాది తహవ్వుర్ రాణాను భారత్‌కు తీసుకురావడం మోదీ ప్రభుత్వ దౌత్యనీతి విజయమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అభివర్ణించారు. గతంలోని యూపీఏ ప్రభుత్వం ఈ పనిచేయలేకపోయిందని పరోక్షంగా విమర్శించారు. "మన గడ్డమీద, మన ప్రజల మీద దాడి చేసినవారిని రప్పించి శిక్షించడం భారత ప్రభుత్వ విధి. కానీ ముంబై ఉగ్రదాడి జరిగినప్పుడున్న ప్రభుత్వం రాణాను రప్పించలేకపోయింది. ఇప్పుడు మోదీ ప్రభుత్వ దౌత్యనీతితో విజయం సాధించింది" అని అమిత్ షా కార్యాలయం ప్రకటించింది. ఇక కాంగ్రెస్ ఓటు బ్యాంకు రాజకీయాలతో ఉగ్రవాదం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా విమర్శించారు. మోదీ ప్రభుత్వం రాణాను రప్పించి నాటి మృతుల కుటుంబాలకు న్యాయం చేసిందని పేర్కొన్నారు.

మేం మొదలుపెట్టిందే పూర్తిచేశారు: చిదంబరం

రాణా అప్పగింత విషయంలో మోదీ ప్రభుత్వం చేసినదేమీ లేదని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. "రాణా అప్పగింతను మోదీ ప్రభుత్వం తమ గొప్పగా చెప్పుకునేందుకు ఆరాటపడుతోంది. కానీ రాణాను రప్పించేందుకు యూపీఏ ప్రభుత్వమే ప్రక్రియ మొదలుపెట్టింది. ఒకటిన్నర దశాబ్దాల పాటు చట్ట, దౌత్య, నిఘా పరమైన పోరాటంతోనే ఇది సాధ్యమైంది" అని పేర్కొన్నారు.

రాణాతో మాకు సంబంధం లేదు: పాకిస్థాన్

ఉగ్రవాది రాణా విషయంలో పాకిస్థాన్ కప్పగంతులు వేస్తోంది. అమెరికా రాణాను భారత్‌కు అప్పగించిన నేపథ్యంలో పాక్ విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. రాణా ప్రస్తుతం తమ దేశ పౌరుడు కాదని, గత 20 ఏళ్లలో ఎప్పుడూ అతను పాకిస్థాన్‌కు చెందిన ఎలాంటి ధ్రువపత్రాలను పునరుద్ధరించుకోలేదని తెలిపింది. రాణా కెనడా పౌరుడని పేర్కొంది. అయితే రాణాకు పాక్ సైన్యం, ఐఎస్ఐలోని కీలక వ్యక్తులతో సంబంధాలున్నాయని.. ఎన్‌ఐఏ విచారణలో కీలకఅంశాలు, రహస్యాలను బయటపెట్టవచ్చనే ఆందోళన పాక్‌లో వ్యక్తమవుతోందని విశ్లేషకులు చెబుతున్నారు.

హెడ్లీని మాత్రం రప్పించలేం!

ముంబై ఉగ్రదాడి సూత్రధారుల్లో ఒకరైన డేవిడ్ హెడ్లీని మాత్రం భారత్‌కు రప్పించలేమని నిఘా వర్గాలు చెబుతున్నాయి. హెడ్లీ అమెరికా పౌరుడు కావడం, అమెరికా దర్యాప్తు సంస్థలకు ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించడంతోపాటు 2010లో అమెరికా దర్యాప్తు అధికారులతో కుదుర్చుకున్న ఒప్పందం దీనికి కారణమని వివరిస్తున్నాయి. "ఉగ్రవాద కేసుల్లో అరెస్టైన హెడ్లీ.. 2010లో అమెరికా అధికారులతో చట్టపరమైన ఒప్పందం కుదుర్చుకున్నాడు. ముంబై దాడులు, లష్కరేతాయిబాతో, పాక్ ఐఎస్ఐతో సంబంధాలు, కార్యకలాపాల సమాచారమంతా వెల్లడించాడు. బదులుగా తనను భారత్, పాకిస్థాన్, డెన్మార్క్ దేశాలకు అప్పగించవద్దని ఒప్పందం చేసుకున్నాడు.." అని నిఘా వర్గాలు తెలిపాయి. అంతేగాకుండా అమెరికా నిఘా, దర్యాప్తు సంస్థలకు హెడ్లీ ఇన్‌ఫార్మర్‌గా వ్యవహరించిన నేపథ్యంలో.. సంబంధిత కీలక సమాచారం బయటపడకుండా ఉండేందుకు కూడా అతడిని ఇతర దేశాలకు అప్పగించే అవకాశం లేదని వెల్లడించాయి.

లోకం తీరు



'డిజిటల్ డేటా' సెక్షన్‌తో ఆర్‌టీఐ చట్టం నాశనం

- 44(3)ని రద్దుచేయాలి: విపక్షాలు
- మెమోరాండంపై రాహుల్, అఖిలేశ్ సహా 120 మంది ఎంపీల సంతకాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: సమాచార హక్కు (ఆర్‌టీఐ) చట్టాన్ని మోదీ ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. డిజిటల్ వ్యక్తిగత డేటా పరిరక్షణ (డీపీడీపీ) చట్టంలోని సెక్షన్ 44 (3).. ఆర్‌టీఐ ఉసురు తీసేలా ఉందని పౌర హక్కుల గ్రూపులు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో.. సదరు సెక్షన్‌ను తక్షణమే రద్దు చేయాలని ఇండీ కూటమి డిమాండ్ చేసింది. ఈ మేరకు ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు సమర్పించేందుకు సంయుక్తంగా మెమోరాండంను ఈ కూటమి పార్టీలు రూపొందించాయి. దానిపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్, సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్, డీఎంకే నేత టీఆర్ బాలు సహా 120 మంది ఎంపీలు సంతకాలు చేశారని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ వెల్లడించారు. గురువారం ఢిల్లీలో ఇండీ కూటమి పార్టీల నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. వ్యక్తుల వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకుండా 44(3) సెక్షన్ నిరోధిస్తోందని.. ఇది ఆర్‌టీఐ చట్టాన్ని తీవ్ర ప్రభావితం చేస్తోందని అన్నారు. 2023 ఆగస్టు 11న రాష్ట్రపతి ఆమోదించిన ఈ చట్టాన్ని కొంతకాలంగా తమ కూటమి అధ్యయనం చేస్తోందని తెలిపారు. ఇటీవలి పార్లమెంటు సమావేశాల్లో పౌర సమాజాలు, హక్కుల గ్రూపులు తమను సంప్రదించాయని.. 8(1)(జే) సెక్షన్‌ను నీరుగారుస్తూ సెక్షన్ 44(3)ని తెచ్చినట్టు తెలిపాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే దానిని రద్దుచేయాలని ఐటీ మంత్రికి మెమోరాండం సమర్పించాలని నిర్ణయించామన్నారు.

ఆహారంలో చిరుధాన్యాలు భాగం కావాలి

- అపోలో హాస్పిటల్స్ జాయింట్ ఎండీ డాక్టర్ సంగీత రెడ్డి
- మిల్లెట్ మార్వెల్స్‌తో కలిసి చిరుధాన్యాల వ్యాపారంలోకి తెనాలి డబుల్ హార్స్
- మార్కెట్‌లోకి 18 రకాల ఉత్పత్తులు విడుదల



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ సంగీత రెడ్డి, మోహన్ శ్యామ్, దిల్ రాజు, భరత్ రెడ్డి తదితరులు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఇప్పుడు చిరు ధాన్యాల(మిల్లెట్స్) ఉద్యమం జరుగుతోందని, ప్రతి ఒక్కరూ రోజూ తినే ఆహారంలో చిరుధాన్యాలను భాగం చేసుకోవాలని అపోలో ఆస్పత్రుల జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి పిలుపునిచ్చారు. చిరుధాన్యాల్లో పోషకాలు అధికంగా ఉంటాయని, జీర్ణ వ్యవస్థపై ప్రభావం చూపుతాయని తెలిపారు. తెనాలి డబుల్ హార్స్ గ్రూప్, మిల్లెట్ మార్వెల్స్ అనే సంస్థతో కలిసి చిరుధాన్యాల వ్యాపారంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో నూడిల్స్, గ్రెయిన్స్, రెడీ టు కుక్, రెడీ టు సర్వ్ అంటూ నాలుగు విభాగాల్లో 18 రకాల ఉత్పత్తులను ఆ సంస్థ విడుదల చేసింది. ఈ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ.. మన పూర్వీకులు చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకునే వారని, ఇప్పుడు అదే అలవాటును మనం కొనసాగించాల్సిన అవసరం ఉందని చెప్పారు. అమెరికా నుంచి తాను తెప్పించిన క్వినోవాను చూసి తన అత్తగారు జొన్నలు, కొర్రలు లాగానే ఉన్నాయన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. చిరు ధాన్యాల స్వీకరణ సంస్కృతిని దేశానికి తిరిగి తీసుకురావడం అత్యవసరం అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 2023ను మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించారని, దానికి ఐదారేళ్ల ముందే డాక్టర్ భరత్ మిల్లెట్ మార్వెల్స్‌ను స్థాపించారని చెప్పారు. చిరు ధాన్యాల్లో ఫైబర్, సూక్ష్మ పోషకాలు అధికంగా ఉంటాయని, చిరుధాన్యాలను తీసుకోవడం అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. సంక్రమణేతర వ్యాధుల సునామీ రాబోతున్న వేళ ఇది తప్పనిసరన్నారు. తన తండ్రి, అపోలో ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ ప్రతాప్ రెడ్డి 92 ఏళ్ల వయస్సులో ఉన్నారని, నిత్యం ఆహారంలో ఏదో ఒక పూట చిరు ధాన్యాలను తీసుకుంటారని చెప్పారు. ప్రతి రోజూ ఒకే తరహా చిరుధాన్యం కాకుండా మారుస్తూ తినడం వల్ల మెరుగైన ఫలితాలు చూడవచ్చని తెలిపారు. ఇక, తెనాలి డబుల్ హార్స్ గ్రూప్ సీఎండీ మోహన్ శ్యామ్ మాట్లాడుతూ.. మిల్లెట్ మార్వెల్స్‌తో కలిసి మిల్లెట్స్ వ్యాపారంలోకి 18 ఉత్పత్తులతో ప్రవేశించామని ప్రకటించారు. ఇందులో ఆరు రకాల నూడిల్స్, ఆరు రకాల గ్రెయిన్స్, రెడీ టు కుక్, రెడీ టు ఈట్ విభాగాలలో ఆరు రకాల ఉత్పత్తులను విడుదల చేశామని తెలిపారు. త్వరలో ఆర్గానిక్ ఉత్పత్తుల రంగంలో అడుగుపెడతామని చెప్పారు. ఈ-కామర్స్‌తో పాటు సూపర్ మార్కెట్‌లు, కిరాణా దుకాణాల్లో ఈ ఉత్పత్తులు రూ.85 ప్రారంభ ధరతో లభిస్తాయని చెప్పారు. మిల్లెట్ మార్వెల్స్ వ్యవస్థాపకులు డాక్టర్ భరత్ రెడ్డి మాట్లాడుతూ మిల్లెట్ మార్వెల్ కల ఈ రోజు నిజమైందని అన్నారు. చిరు ధాన్యాలు ప్రతి ఒక్కరికీ చేరువ కావాలనే లక్ష్యంతో మిల్లెట్ మార్వెల్స్ స్థాపించామని, కానీ దానిని ముందుకు తీసుకెళ్లేందుకు తమ శక్తి సరిపోలేదని చెప్పారు. కానీ దానిని మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు తెనాలి డబుల్ హార్స్ వచ్చిందని అన్నారు. ఈ విభాగంలో మరిన్ని ఆవిష్కరణలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అనంధిత్ రెడ్డి, ఐఐఎంఆర్ డైరెక్టర్ దయాకర్, సినీ నిర్మాత దిల్ రాజు, సినిమాటోగ్రాఫర్ చోటా కె నాయుడు, సన్ రైజర్స్ టీమ్‌కు చెందిన యశ్వంత్, సిద్ధ వైద్య నిష్ణాతురాలు సత్య సింధూర, యాడ్ ఫిలిం మేకర్ యమున కిశోర్, యాంకర్ సుమ, గాయని ఉష, తెనాలి డబుల్ హార్స్ సీఈవో యజుర్వేద్, సీఓఓ పుట్టా శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యను కొనితెచ్చుకుంది!

- ఇది అత్యాచారం కేసు కాదు
- పరస్పర సమ్మతితో జరిగినట్లుంది
- కేసులో నిందితుడికి బెయిల్ ఇస్తూ అలహాబాద్ హైకోర్టు జడ్జి వ్యాఖ్యలు

అలహాబాద్, ఏప్రిల్ 10: అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజయ్‌కుమార్ సింగ్ బెయిలు మంజూరు చేస్తూ.. సంచలన వ్యాఖ్యలు చేశారు. "బాధితురాలు సమస్యను కోరి తెచ్చుకుంది. దానికి ఆమె కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది" అని పేర్కొన్నారు. కేసులో వాస్తవాలను పరిశీలిస్తే.. 'ఇది అత్యాచారం కేసు కాదు. పరస్పర సమ్మతితో జరిగినట్లుగా ఉంది' అని వ్యాఖ్యానించారు. గత ఏడాది సెప్టెంబరులో నమోదైన ఈ కేసులో బాధితురాలు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థిని. ఆమె ఢిల్లీలో పేయింగ్ గెస్ట్‌గా నివసించేది. సెప్టెంబరు 21న ఆమె స్నేహితులతో కలిసి ఓ రెస్టారెంట్‌కు వెళ్లారు. అక్కడ తెల్లవారుజామున 3 గంటల వరకు మద్యం సేవించారు. బాగా మత్తెక్కిపోవడంతో ఆమె స్వయంగా పిటిషనర్ (అత్యాచార నిందితుడు) ఇంటికి వెళ్లి విశ్రాంతి తీసుకోవడానికి అంగీకరించారని జస్టిస్ సింగ్ ఉత్తర్వుల్లో తెలిపారు. "పిటిషనర్ తన ఇంటికి బదులుగా అతని బంధువుల ఫ్లాట్‌కు తీసుకెళ్లి రెండుసార్లు అత్యాచారం చేశాడన్న బాధితురాలి ఆరోపణ అబద్ధం. రికార్డుల్లో ఉన్న సాక్ష్యాలకు విరుద్ధం. బాధితురాలు వెల్లడించిన కేసు వాస్తవాలను పరిగణనలోకి తీసుకుంటే, ఇది అత్యాచారం కేసు కాదు. వారిద్దరి మధ్య ఏకాభిప్రాయంతో కుదిరిన రిలేషన్‌కు సంబంధించిన కేసు కావచ్చు" అని పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుడిగా ఉన్న నిశ్చల్ డిసెంబరు 11 నుంచి జైల్లోనే ఉన్నాడని, అతనికి ఎలాంటి నేర చరిత్ర లేదన్న వాదనలను జస్టిస్ సింగ్ పరిగణనలోకి తీసుకున్నారు. దర్యాప్తుకు సహకరించాలని ఆదేశిస్తూ నిశ్చల్‌కు బెయిల్ మంజూరు చేశారు.

పది రోజుల్లో పెళ్లి.. గుండెపోటుతో టెకీ మృతి

ఎన్టీఆర్ జిల్లా వెల్లుర్తిపాడులో విషాదఛాయలు



పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కాలం కలిసి వచ్చి కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయ్యాడు. ఉద్యోగంలో స్థిరపడ్డాడు. ఇక పెళ్లి తంతే మిగిలింది. లగ్నపత్రిక కూడా రాసుకున్నారు. మరో పది రోజుల్లో పెళ్లి. ఇంతలో ఆ యువకుడు గుండెపోటుతో మరణించడంతో తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం వెల్లుర్తిపాడు గ్రామానికి చెందిన ఎల్లావుల వెంకటేశ్వర్లు-వెంకటేశ్వరమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె. కుమారులిద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా ఉద్యోగం చేస్తున్నారు. చిన్నకుమారుడు ఎల్లావుల బాలాజీ(29) కేపీహెచ్‌బీ అడ్డగుట్ట సమీపంలోని ప్రైవేటు వసతిగృహంలో ఉంటున్నారు. బాలాజీకి జగ్గయ్యపేట మండలం బూదవాడకు చెందిన యువతితో వివాహం నిశ్చయమైంది. ఈనెల 7న లగ్న పత్రిక రాసుకున్నారు. ఈనెల 20న పెళ్లి. కాగా, బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లోని వసతిగృహంలో గుండెపోటుతో బాలాజీ మృతి చెందారు. వసతిగృహంలోని వాష్‌రూమ్‌లో ఆయన కుప్పకూలిపోవడంతో సహచరులు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పెళ్లి పనుల్లో ఉన్న కుటుంబసభ్యులను బాలాజీ మరణ వార్త షాక్‌కు గురిచేసింది.

ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్?

(మొదటిపేజీ తరువాయి)

వాడతారు. సుంకాల అమలు వాయిదా ప్రకటనతో మార్కెట్లు మళ్లీ దూసుకుపోతాయన్న విషయం తెలిసి.. కావాలనే ట్రంప్ ఆ పోస్టు పెట్టారని, దీనివల్ల ట్రంప్ మీడియా షేర్ల విలువ భారీగా పెరిగి 22.67 శాతం మేర లాభాల్లో ముగిసిందని, ఆ గ్రూపులో 53 శాతం వాటా ఉన్న ట్రంప్ వ్యక్తిగత సంపద ఒక్కరోజులోనే 415 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,570 కోట్ల) మేర పెరిగిందని.. డెమొక్రాట్లు మండిపడుతున్నారు. ట్రంప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని... దీనిపై దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ట్రంప్ పోస్టుతో.. ఏదో జరగబోతోందని నమ్మిన ఆయన అభిమానులు, మదుపరులు పెద్దఎత్తున ట్రంప్ మీడియా షేర్లు కొనుగోలు చేశారు. భారీగా లాభపడ్డారు. ఈ క్రమంలోనే.. తన మాట విని షేర్లు కొన్న ఒక సన్నిహితుడికి 2.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.21 కోట్లు), మరొకరికి 900 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.7,743 కోట్లు) వచ్చాయని ట్రంప్ చెబుతున్న వీడియో ఒకటి వైరల్ అయింది. అయితే.. ఆయన ఇన్‌సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడలేదని, అమెరికా ప్రజలకు, మార్కెట్లకు దేశ ఆర్థిక భద్రతపై నమ్మకం కల్పించడం అధ్యక్షుడిగా ఆయన బాధ్యత అని వైట్‌హౌస్ వర్గాలు ఆయన్ను వెనకేసుకొచ్చాయి. అలాగే.. భారత్‌పై విధించిన 26 శాతం అదనపు సుంకాల అమలును జూలై 9 అర్ధరాత్రి 12.01 గంటల దాకా వాయిదా వేస్తూ వైట్‌హౌస్ వర్గాలు కార్యనిర్వాహక ఉత్తర్వు విడుదల చేశాయి. ఫెంటనిల్ అక్రమ రవాణాను నిరసిస్తూ చైనాపై తొలుత విధించిన 20 శాతం సుంకాలను, తాజాగా విధించిన 125 శాతం సుంకాలను కలిపితే ఆ దేశంపై సుంకాల భారం 145 శాతానికి చేరుతుందని వివరణ ఇచ్చాయి.

తలుపులు తెరిచే.. ట్రంప్ సుంకాల బాదుడుపై చైనా గురువారం సూటిగా, ఘాటుగా స్పందించింది. "అమెరికాతో ఘర్షణను మేము కోరుకోం. ఆ దేశం మాతో చర్చలు జరపడానికి సిద్ధమైతే.. అందుకు తలుపులు తెరిచే ఉంచుతాం. అయితే, చర్చలు పరస్పర గౌరవంతో, సమానత్వంతో సాగాలి. అలా కాకుండా ట్రంప్ మాపై ఒత్తిడి తెస్తే మాత్రం దృఢంగా నిలబడతాం" అని చైనా వాణిజ్య శాఖ అధికార ప్రతినిధి హీయాంగ్బియాన్ స్పష్టం చేశారు. ఒత్తిడి తేవడం, బెదిరించడం, బ్లాక్ మెయిల్ చెయ్యడం వంటివి.. చైనాతో వ్యవహరించడానికి సరైన మార్గాలు కావని ఆమె తేల్చిచెప్పారు. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ సైతం.. కవ్వింపు చర్యలకు తాము భయపడబోమని, సుంకాలపై వెనక్కి తగ్గబోమని తేల్చిచెప్పారు. అంతేకాదు.. సుంకాల బాదుడుతో ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్న అమెరికాకు వ్యతిరేకంగా కూటమిని నిర్మించేందుకు.. యూరప్, దక్షిణాసియా దేశాలతో చైనా సంప్రదింపులు జరుపుతోంది. అందులో భాగంగానే.. చైనా ప్రీమియర్ లీ చాంగ్ యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులాకు ఫోన్ చేసి మాట్లాడారు. చైనా వాణిజ్య మంత్రి వాంగ్.. ఈయూ వాణిజ్య, ఆర్థిక భద్రత కమిషనర్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆసియాన్ దేశాల నేతలతోనూ మాట్లాడారు. అయితే, అమెరికాకు వ్యతిరేకంగా చైనాతో చేతులు కలిపేందుకు ఆ దేశాలు ముందుకు రావట్లేదని సమాచారం. భారత్ కూడా చైనా విజ్ఞప్తిని తోసిపుచ్చినట్టు తెలుస్తోంది.



చైనా కూడా రెడీనే..

ప్రతీకార సుంకాల విధింపుతో.. చైనా సహా చాలా దేశాలు తమతో చర్చలకు ముందుకు వచ్చాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు! చైనా కూడా తమతో ఒప్పందానికి తహతహలాడుతోందిగానీ.. ఎప్పుడు చేసుకోవాలనే విషయంలోనే నిర్ణయానికి రాలేకపోతోందని వ్యాఖ్యానించారు. "(చైనా) అధ్యక్షుడు షి జిన్‌పింగ్.. నాకు బాగా తెలుసు. ప్రపంచంలోనే అత్యంత తెలివైన వ్యక్తుల్లో ఆయన ఒకరు" అని పేర్కొన్నారు. కాగా.. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్.. ట్రంప్ సుంకాల ప్రకటనను 'బేరసారాల వ్యూహం'గా పేర్కొన్నారు. ఆ వ్యూహం విజయవంతమైందని, దానివల్లే గడిచిన వారం రోజులుగా తమతో సంప్రదింపులకు 75కు పైగా దేశాలు ముందుకొచ్చాయన్నారు.. సమస్యంతా చైనా వంటి దేశాలతోనేనని.. అవి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అసమతౌల్యాలకు కారణమవుతాయని అసహనం వ్యక్తం చేశారు.జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, ఇండియా తమతో వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవడానికి ముందుకొస్తున్నాయన్నారు.

మేమూ నిలిపివేస్తాం..

సుంకాల అమలును 90రోజులపాటు వాయిదా వేస్తున్నట్టు ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో.. అమెరికాపై 25% సుంకాలను విధిస్తూ తాము తీసుకున్న నిర్ణయాన్ని కూడా 90 రోజులపాటు నిలిపివేస్తున్నట్టు యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. "మేం చర్చలకు కూడా ఒక అవకాశాన్ని ఇద్దామనుకుంటున్నాం" అని యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ ఉర్సులా స్పష్టం చేశారు. యూరప్ దేశాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం తనకు ఆనందం కలిగించిందని ట్రంప్ అన్నారు.

ఏఐ బేబీ

- కృత్రిమ మేధ ఆధారిత ఐవీఎఫ్ విధానంలో తొలి శిశువు.. మెక్సికోలో జననం
- పండంటి మగబిడ్డకు జన్మనిచ్చిన 40 ఏళ్ల మహిళ
- ఐవీఎఫ్ 23 దశలూ మానవ ప్రమేయం లేకుండా నిర్వహణ

న్యూయార్క్, ఏప్రిల్ 10: ప్రపంచంలోనే తొలిసారిగా.. మానవ ప్రమేయం ఏమాత్రం లేకుండా ఏఐ ఆధారిత కృత్రిమ సంతానసాఫల్య విధానంలో ఒక బాలుడు మెక్సికోలోని వాదులహారా నగరంలో జన్మించాడు. న్యూయార్క్, వాదులహారాకు చెందిన వైద్యనిపుణులు సాధించిన ఘనత ఇది. ప్రముఖ ఎంబ్రియాలజిస్టు డాక్టర్ జాక్వెస్ కోహెన్ నేతృత్వంలో.. మెక్సికోలోని 'కన్సీవబుల్ లైఫ్‌సైన్సెస్' అనే బయోటెక్నాలజీ సంస్థ రూపొందించిన ఈ విధానం గురించి 'రీ-ప్రొడక్టివ్ బయోమెడిసిన్ ఆన్‌లైన్' జర్నల్‌లో ప్రచురితమైంది. సహజంగా సంతాన భాగ్యం పొందలేని దంపతులకు వరంలా.. 1990ల్లో 'ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసీఎస్ఐ)' విధానం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. నాటి నుంచి ఇప్పటిదాకా ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల మంది.. ఆ విధానం ద్వారా పిల్లలను పొందారు. మహిళ అండంలోకి మాన్యువల్‌గా వీర్యకణాన్ని ఇంజెక్షన్ ద్వారా పంపే ప్రక్రియ ఇది. ఇందులో మొత్తం 23 దశలు ఉంటాయి. అవన్నీ అత్యంత సంక్లిష్టమైనవి. ఏ దశలో చిన్న తప్పిదం జరిగినా ప్రయత్నం మొత్తం వృథా అయిపోతుంది. అందుకే అత్యంత నిపుణులైన ఎంబ్రియాలజిస్టులను మాత్రమే ఇందుకు నియోగిస్తారు. ఆ 23 దశలనూ మానవ ప్రమేయం లేకుండానే కృత్రిమ మేధ సాయంతో, డిజిటల్ కంట్రోల్ ద్వారా రోబోటిక్స్‌తోనే నిర్వహించే విధానాన్ని కన్సీవబుల్ లైఫ్ సైన్సెస్ నిపుణులు అభివృద్ధి చేశారు. ఇందులో భాగంగా నాణ్యమైన వీర్యకణాన్ని ఏఐ సాయంతో ఎంపిక చేస్తారు. లేజర్ సాయంతో దాన్ని కదలకుండా చేసి.. రిమోట్ డిజిటల్ కంట్రోల్ ద్వారా అండంలోకి చొప్పిస్తారు. మొత్తం 23 దశలనూ మనుషుల కన్నా కచ్చితంగా యంత్రాల ద్వారా నిర్వహించడానికి ఏఐ ఉపకరిస్తోంది. మెక్సికోకు చెందిన 40 ఏళ్ల మహిళ.. దాత అండాలతో ఈ విధానంలో గర్భం దాల్చి పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ కొత్త విధానం.. సంప్రదాయ కృత్రిమ సంతాన సాఫల్య విధానం తీరుతెన్నులనే మార్చేస్తుందని డాక్టర్ కోహెన్ అభిప్రాయపడ్డారు. కాగా.. ఈ ఏఐ ఆధారిత ఐసీఎస్ఐ నిర్వహణకు యంత్రాలకు పడుతున్న సమయం 9 నిమిషాల 56 సెకన్లు. నిపుణులైన ఎంబ్రియాలజిస్టులకు ఇంతకన్నా తక్కువ సమయమే పడుతుందని.. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ మరింత మెరుగుపడితే వేగం కూడా పెరుగుతుందని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

మంతెన ఆశ్రమం సహా.. కృష్ణా ఒడ్డున
అక్రమ కట్టడాల నిరోధంలో విఫలం

- నాటి ఈఈ రవిపై విచారణకు అథారిటీ ఏర్పాటు
- జల వనరుల శాఖ స్పెషల్ సీఎస్ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): కృష్ణానది ఒడ్డున నిబంధనలకు విరుద్ధంగా మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి ఆశ్రమం పేరిట నిర్మించిన భారీ భవంతి సహా మరికొన్ని భవన నిర్మాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారంటూ గతంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేసిన కె.రవిపై ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. నదీ పరీవాహక చట్టాలకు విరుద్ధంగా భవనాలు నిర్మించినా వాటిని ఈఈ అడ్డుకోలేదన్న అభియోగాలపె విచారణకు ఎంక్వయిరీ అథారిటీని నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతేడాది కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు మంతెన సత్యనారాయణరాజు ఆశ్రమం వద్ద ప్రవాహం నిలిచిపోవడంతో వరద రాజధాని గ్రామాల్లోకి వచ్చింది. ఈ విషయం తెలుసుకున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, జి.సాయిప్రసాద్ ఆ ప్రాంతానికి చేరుకుని చర్యలు చేపట్టారు. బ్యాక్ వాటర్ సమస్యను పరిష్కరించారు. మంత్రి వెళితే తప్ప అక్కడ ఆక్రమణలు బయటపడలేదు. ఈ అంశాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంది. కృష్ణా వరద వెనక్కి వచ్చి గ్రామాల్లోకి చేరడంపై వైసీపీ రాజకీయం చేసింది. అమరావతి నివాస యోగ్యం కాదంటూ ప్రచారం చేసింది. ఈ ప్రచారంతో ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని సర్కారు భావించింది. అక్రమ కట్టడాలను అడ్డుకోవడంలో విఫలమైన నాటి ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుపై విచారణకు ఆదేశించింది.

గ్రూప్-1 మెయిన్స్ సమాధాన పత్రాలకు తెల్ల కాగితాలు

గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో సమాధానాలకు రూల్స్ కాగితాలకు బదులుగా తెల్ల కాగితాలు ఇవ్వనున్నట్టు ఏపీపీఎస్సీ తెలిపింది. అభ్యర్థుల వినతుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. బాల్ పాయింట్ పెన్‌తో అండర్‌లైన్ చేయొచ్చని, జెల్, ఇంక్ పెన్నులు అనుమతించబోరని వివరించింది. స్కెచ్ పెన్ వాడితే మాల్ ప్రాక్టీస్‌గా పరిగణిస్తారని, ఆ పేపరు దిద్దబోరని స్పష్టంచేసింది.

మున్సిపాలిటీల ఆదాయం పెంచాలి

అంకితభావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి.. పురపాలికలు స్వయం సమృద్ధి సాధించాలి

- ప్రథమ ప్రాధాన్యతగా వ్యర్థాల నిర్వహణ, తాగునీరు, వీధిలైట్లు, రోడ్ల నిర్మాణం
- పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్ను వసూళ్లు
- పన్నుల సొమ్ము వృథాగా ఖర్చు చేయొద్దు
- అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టిపెట్టండి
- మున్సిపల్ కమిషనర్ల వర్క్‌షాపులో మంత్రి నారాయణ


మునిసిపల్ శాఖ నిర్వహించిన సదస్సులో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారులు, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి ప్రజల అవసరాలు తీర్చి వారి మన్ననలు పొందాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా తగిన సౌకర్యాల్ని కల్పించాలన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణను కూడా నిరంతరం పరిశీలించాలని, వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అన్నారు. గురువారం విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో మున్సిపల్ కమిషనర్ల రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా మంత్రి నారాయణ హాజరయ్యారు. మున్సిపాలిటీలు స్వయం సమృద్ధి సాధించి అవసరమైన నిధులను అవే ఖర్చు పెట్టుకునే విధంగా ఆదాయాన్ని పెంచాలన్నారు. అన్ని మున్సిపాలిటీల్లో పన్ను రాబడి పెరిగేలా పనిచేయాలని సూచించారు. మున్సిపల్‌శాఖపై ప్రజల్లో సంతృప్తి శాతం పెరిగేలా మున్సిపల్ కమిషనర్లు పనితీరు కనబడాలని చెప్పారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణతో పాటు తాగునీరు, వీధిలైట్లు, రోడ్లకు మున్సిపల్ కమిషనర్లు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. 200 రోజుల లోపు వీధి శునకాలకు స్టెరిలైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. పేదలను ఇబ్బంది పెట్టకుండా పన్నుల వసూళ్లు పెరిగేలా కృషి చేయాలని అన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం పన్నుల వసూళ్లు రూ. 500 కోట్లు ఎక్కువగా వసూలు చేసినందుకు మున్సిపల్ సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పన్ను వసూళ్లు కీలకం..

"మున్సిపాలిటీల ఆదాయం వాటికే ఇచ్చేలా నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు. మున్సిపాలిటీల్లో రోజువారీ కార్యకలాపాల నిర్వహణకు పన్నుల వసూళ్లు చాలా కీలకం. పన్నుల ఆదాయంతో అనవసరమైన ఖర్చులు చేయొద్దు. ఆ నిధులను ప్రజలకు కనీస వసతుల కల్పనకు ఖర్చు చేయాలి. మున్సిపాలిటీల్లో ఎస్టాబ్లిష్‌మెంట్, మౌలిక వసతుల కల్పన ఖర్చులను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుంది. నెల్లూరు మున్సిపాలిటీలో 2014-19 మధ్య పన్నుల వసూళ్లలో కొత్త విధానం అమలు చేశాం. దానివల్ల రూ. 1,067 కోట్లు వచ్చింది. రెవెన్యూ ఖర్చులు పోగా రూ. 40 కోట్లు మిగులు ఆదాయం అప్పట్లోనే తీసుకురాగలిగాం. దీన్ని కేపిటల్ ఇన్వెస్ట్‌మెంట్‌గా ఖర్చుపెట్టే వెసులుబాటు ఆ మున్సిపాలిటీకి లభించింది. 2014-19 సంవత్సరాల్లో మున్సిపల్‌శాఖ మంత్రిగా ఒక్క రూపాయి కూడా మున్సిపాలిటీల్లో పన్నులు పెంచలేదు. అనవసరపు ఖర్చులు అరికట్టడం వల్లనే రూ. 700 కోట్ల ఆదాయం మున్సిపాలిటీలకు లభించింది.

అత్యుత్తమ విధానాల అమలు

"రాబోయే కాలంలో యాంత్రీకరణ అవసరం చాలా ఉంటుంది. దేశ విదేశాల్లో ఘన, ద్రవవ్యర్థాలు, రోడ్లు, నీరు, వీధి దీపాల నిర్వహణను పరిశీలించాం. అత్యుత్తమ విధానాలు ఇక్కడ అమలుచేస్తాం. 85 లక్షల టన్నుల వ్యర్థాలను అక్టోబరు 2 లోపు తొలగించాలని సీఎం ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు అందుకు తగ్గట్లు కార్యాచరణ రూపొందించుకోవాలి. అమృత్, ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బ్యాంకు పనులకు సంబంధించి టెండర్లను త్వరలోనే పిలుస్తాం" అని మంత్రి చెప్పారు.

కార్యాచరణ ప్రణాళికతో సిద్ధం కావాలి

సంవత్సర కాలానికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని పనిచేయాలని మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాల్లో వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఆస్తి పన్ను వసూళ్లను 80శాతం వరకు పెంచేలా కృషి చేయాలని చెప్పారు. పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ డైరెక్టర్ పి.సంపత్‌కుమార్ వర్క్‌షాప్‌లో మాట్లాడారు. ఈ వర్క్‌షాపులో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్, మెప్మా ఎండీ తేజ్‌భరత్, టిడ్కో ఎండీ సునీల్‌కుమార్‌రెడ్డి, గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ ఎండీ ఎంకేవీ శ్రీనివాసులు, టౌన్‌ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ మరియన్న పాల్గొన్నారు.

గజల్ శ్రీనివాస్ సంగీతం, గాత్రంతో సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత ఆడియో విడుదల


డాక్టర్ గజల్ శ్రీనివాస్ సంగీతం, గాత్రంతో రూపొందించిన శ్రీమద్ భగవద్గీత ఆడియో క్యాసెట్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖ గజల్స్ గాయకుడు కేశిరాజు శ్రీనివాస్ సంగీతం సమకూర్చి గానం చేసిన సంపూర్ణ శ్రీమద్ భగవద్గీత ఆడియో విడుదల కార్యక్రమం గురువారం పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు లయన్స్ క్లబ్‌లో జరిగింది. 'సేవ్ టెంపుల్స్ భారత్-శ్రీసూర్యనారాయణ స్వామి దేవస్థానం ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆడియోను శ్రీనివాస్ తండ్రి నరసింహారావు విడుదల చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర నాటక అకాడమి చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ హాజరై మాట్లాడుతూ భగవద్గీతను ఎంతో మధురంగా ఆలపించి ప్రజలకు అందించిన గజల్ శ్రీనివాస్ 'భగవద్గీతను కొనండి అనకుండా వినండి' అని చెబుతున్నారన్నారు. గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ తన సంకల్పం వెనుక మిత్రుల బలం ఎంతో ఉందన్నారు. మూడు గిన్నిస్ రికార్డులు సాధించిన గజల్ శ్రీనివాస్ పాలకొల్లు వాసి కావడం ఈ ప్రాంతానికే గర్వ కారణమని మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ అన్నారు.

నేడు ఆగిరిపల్లికి ముఖ్యమంత్రి చంద్రబాబు

ఏలూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుక్రవారం ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తొలుత ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో ఆగిరిపల్లి మండలం వడ్లమాను వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. వడ్లమాను శివారులో కులవృత్తిదారులతో పని ప్రదేశాల్లోనే ముఖాముఖిలో పాల్గొని వారి సమస్యలు తెలుసుకుంటారు. అక్కడ నుంచి ఆగిరిపల్లి హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ప్రజావేదికకు చేరుకుని పీ-4 బహిరంగ సభలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. అనంతరం పార్టీ కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం కడప బయల్దేరి వెళతారు.

ఏపీపీఎస్సీ కార్యదర్శిగా రాజాబాబు బాధ్యతలు



అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శిగా పి.రాజాబాబు గురువారం విజయవాడలోని కమిషన్ కార్యాల యంలో బాధ్యతలు స్వీకరించారు. గృహనిర్మాణ సంస్థ ఎండీగా ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఇటీవల ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బదిలీ చేసింది.

రామానాయుడు స్టూడియో యాజమాన్యానికి నోటీసులు

విశాఖపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్‌రోడ్డులో ఉన్న రామానాయుడు స్టూడియో యాజమాన్యానికి విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఈ నెల ఎనిమిదో తేదీన షోకాజ్ నోటీస్ జారీ చేశారు. నోటీస్ అందుకున్న పది రోజుల్లో వివరణ ఇవ్వాలని స్పష్టంచేశారు. స్టూడియో నిర్మాణం నిమిత్తం సురేశ్ ప్రొడక్షన్స్‌కు ప్రభుత్వం 34.44 ఎకరాలు కేటాయిస్తే, ఇచ్చిన అవసరాలకు భిన్నంగా 15.17 ఎకరాల్లో రెసిడెన్షియల్ లేఅవుట్‌కు రూపకల్పన చేసినట్టు ప్రభుత్వం గుర్తించిందని షోకాజ్ నోటీస్‌లో పేర్కొన్నారు.

విశాఖ ఉక్కులో బలవంతపు రిటైర్‌మెంట్!

మూడు నెలల జీతం ఇచ్చి బయటకు పంపేందుకు యాజమాన్యం సిద్ధం

- తొలుత ఎగ్జిక్యూటివ్‌లకు... ఆ తరువాత నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు
- గతంలో షోకాజ్ నోటీసులు అందుకున్న వారే టార్గెట్

విశాఖపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం స్టీల్ ప్లాంటులో మొదట స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) ప్రకటించిన యాజమాన్యం ఇప్పుడు 'తప్పనిసరి పదవీ విరమణ పథకం (సీఆర్ఎస్)' అమలుకు రంగం సిద్ధం చేసింది. 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న 1200 మందికి ఇటీవల వీఆర్ఎస్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఉద్యోగుల సంఖ్య ఇంకా తగ్గించాలని ఉక్కు మంత్రిత్వ శాఖ ఆదేశించడంతో ఇప్పుడు సీఆర్ఎస్‌కు పదును పెట్టారు. తొలుత దీనిని ఎగ్జిక్యూటివ్ ఉద్యోగులతో ప్రారంభిస్తున్నారు. ఆ తరువాత నాన్ ఎగ్జిక్యూటివ్‌లకు వర్తింపజేస్తారంటున్నారు. రెండేళ్ల సర్వీసు ఉన్న వారిని దీనికి ఎంపిక చేసుకున్నారు. గతంలో ఏ కారణాల వల్లనైనా రెండు షోకాజ్ నోటీసులు అందుకొని ఉంటే... వాటికి ఇప్పుడు సంజాయిషీ కోరుతున్నారు. ఆయా కారణాల వల్ల ఎందుకు సీఆర్ఎస్‌పై మిమ్మల్ని తొలగించకూడదో చెప్పాలని కోరుతూ నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. యాజమాన్యం తమ చర్యలను ప్రశ్నించేవారు ఎవరైనా ఉంటే వారిని ఏదో విధంగా బయటకు పంపాలని ఇలాంటి ఎత్తుగడలు వేస్తోందని ఉద్యోగ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఈ విధంగా సుమారు 100 మందికి సీఆర్ఎస్ ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ విధంగా వెళ్లిపోయే వారికి కేవలం మూడు నెలల జీతం మాత్రమే ఇస్తారు. ఎటువంటి నష్ట పరిహారాలు రావు. గ్రాట్యుటీ, పీఎఫ్ వంటివి అందరితో పాటు వస్తాయి.

రెండో వీఆర్ఎస్‌కు సిద్ధం చేయడమే లక్ష్యం

ప్లాంటులో రెండో విడత వీఆర్ఎస్ ప్రకటన ఇవ్వడానికి కూడా ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొదటి విడతలో చాలా మంది ఆసక్తి చూపకపోవడంతో యాజమాన్యం లక్ష్యం నెరవేరలేదు. దానిని పూర్తి చేయడానికి రెండో విడత వీఆర్ఎస్‌కు ముందు సీఆర్ఎస్ నోటీసులతో ఉద్యోగులను భయపెడుతున్నారు. మూడు నెలల జీతంతో షోకాజ్‌లు అందుకొని వెళ్లడం కంటే గౌరవంగా వీఆర్ఎస్‌తో అన్ని రకాల ప్రయోజనాలు తీసుకోవడమే మంచిదనే నిర్ణయానికి ఉద్యోగులు వచ్చేలా ఒత్తిడి తీసుకువస్తున్నారు. ఈ విషయాలను స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళితే.. ప్లాంటుకు సంబంధించిన ప్రతి అంశంపైనా తాము స్పందించడం సరికాదనే మాటలు వినిపిస్తున్నాయి.


వీవీఐటీ వర్సిటీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న చైర్మన్ విద్యాసాగర్, అధ్యాపకులు, విద్యార్థులు

విశ్వవిద్యాలయంగా వీవీఐటీ కళాశాల

- 40 ఏళ్లుగా విద్యార్థుల భవిష్యత్‌లో భాగస్వామ్యం
- ఈ విద్యాసంవత్సరం నుంచి మేనేజ్‌మెంట్ స్టడీస్

పెదకాకాని, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వీవీఐటీ కళాశాల, వీవీఐటీ విశ్వవిద్యాలయం(వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నో లాజికల్ యూనివర్సిటీ)గా రూపాంతరం చెందిందని విద్యాసంస్థల అధినేత వాసిరెడ్డి విద్యాసాగర్ గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా వీవీఐటీ వర్సిటీ ప్రాంగణంలో గురువారం విశ్వవిద్యాలయం లోగో, బ్రోచర్లను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' ప్రకటనకు తగ్గట్టు కేవలం రెండు నెలల వ్యవధిలో ప్రభుత్వం వీవీఐటీ అభ్యర్థనను పరిశీలించి యూనివర్సిటీ హోదాను కల్పించిందని చెప్పారు. మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 40 సంవత్సరాలు క్రితం ప్రారంభమైన విద్యాసంస్థ యూనివర్సిటీ స్థాయికి ఎదగడం, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తులో భాగం కావడం సంతోషాన్ని అందించిందన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలో అప్పా స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను ప్రారంభించి మేనేజ్‌మెంట్ స్టడీస్(ఎం.బీ.ఏ, బీ.బీ.ఏ) అందించనున్నట్టు తెలిపారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలనే నినాదంతో వీవీఐటీ సంస్థలను ఏర్పాటు చేసినట్టు వెల్లడించారు. తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యార్థులకు క్రమశిక్షణతో, విలువలతో కూడిన ఉత్తమ విద్యను అందించడం తమ లక్ష్యం అని తెలిపారు. అడ్మిషన్స్ డైరెక్టర్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ ఏప్రిల్ 24న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రవేశ పరీక్షలో ఫలితాల ప్రామాణికంగా ప్రవేశాలు, స్కాలర్‌షిప్ అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సూర్యదేవర బదరిప్రసాద్, జాయింట్ సెక్రటరీ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తిపన్ను వడ్డీ రాయితీ మరో నెల పొడిగింపు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పట్టణ స్థానిక సంస్థల్లో 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తిపన్ను బకాయిలపై వడ్డీలో 50 శాతం మాఫీకి గడువును ఈనెల 30 వరకు పొడిగించారు. ఈ మేరకు మున్సిపల్‌శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2024-25కు సంబంధించి ఆస్తి పన్ను బకాయిలు మార్చి 31 లోగా చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ ఇస్తామని మున్సిపల్‌శాఖ మార్చి 25న ఉత్తర్వులు జారీచేసింది. అయితే మార్చి 25, 31 తేదీల మధ్య రంజాన్, ఉగాది పండుగ సెలవుల వల్ల ఆ అవకాశాన్ని ఎక్కువమంది ఉపయోగించుకోలేకపోయారు. దీంతో ఆ అవకాశాన్ని ఈనెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించింది.

హజ్ యాత్రికులకు 15 రోజుల ముందే టీకాలు

- జిల్లా సొసైటీలు ఏర్పాట్లు చేయాలి: రాష్ట్ర హజ్ కమిటీ

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హజ్ యాత్రికులు తమ యాత్రా తేదీకి కనీసం 15 రోజులు ముందుగా టీకాలు వేయించుకునేలా అన్ని జిల్లాల హజ్ సొసైటీలు తగిన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హజ్ కమిటీ కోరింది. రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల ప్రకారం రాష్ట్రానికి చెందిన హజ్ యాత్రికులకు ఎలాంటి అంతరాయమూ లేకుండా టీకాలు వేసే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, రాష్ట్ర ఇమ్యూనైజేషన్ అధికారిని కోరామని వెల్లడించింది.


దేశంలో భిన్నాభిప్రాయాలు ఉండకూడదా?

- వక్ఫ్ బిల్లు ఆమోదం లౌకిక వ్యవస్థకు చీకటి రోజు: సీపీఐ నారాయణ

తిరుపతి ఆటోనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): అడవులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే కుట్రలో భాగమే నక్సలైట్ల ఏరివేత అని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఆరోపించారు. అందులో భాగంగానే గిరిజన ప్రాంతాలపై మోదీ ప్రభుత్వం గురిపెట్టిందన్నారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'నక్సలిజం భావజాలంపై పోరాటం తప్పుకాదు. ఆ సాకుతో మనుషులను కాల్చిచంపడం సరైంది కాదు. 2026 కల్లా నక్సలైట్లను ఏరివేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించడంలో అర్థమేమిటి?' అని నారాయణ ప్రశ్నించారు. దేశంలో ఒకే ఆలోచన ఉండాలా.. భిన్నాభిప్రాయాలు ఉండకూడదా? అని నిలదీశారు. వక్ఫ్ బిల్లు కంటే, ఆ భూములపైనే బీజేపీ నాయకుల దృష్టి ఎక్కువగా ఉందని ఆరోపించారు. వక్ఫ్ భూములనూ కార్పొరేట్లకు అప్పగించడానికే బిల్లు తెచ్చారన్నారు. ఆ బిల్లు పాస్ చేయడమంటే దేశంలో లౌకిక వ్యవస్థకు చీకటి రోజు వచ్చినట్లేనని అభిప్రాయపడ్డారు.

విద్యార్థులను చెప్పుతో కొట్టిన టీచర్

- హోం వర్క్ చేయలేదని అమానుష చర్య
- శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఘటన


తల్లిదండ్రులపైకి చెప్పు ఎత్తిన టీచర్ అనిత

ధర్మవరం, ఏప్రిల్ 10(ఆంధ్ర జ్యోతి): హోంవర్క్ చేయలేదని విద్యార్థులను ఓ ఉపాధ్యాయురాలు చెప్పుతో కొట్టి అమానుషంగా ప్రవర్తించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని జీనియస్ ప్రైవేటు పాఠశాలలో గొట్లూరు గ్రామానికి చెందిన విద్యార్థులు సనద్వైజ్, జశ్విన్, భరత్ రెండో తరగతి చదువుతున్నారు. ఇదే పాఠశాలలో రెండు రోజుల క్రితం అనిత టీచర్‌గా చేరారు. ముగ్గురు విద్యార్థులు హోంవర్క్ చేయలేదని ఆగ్రహంతో దుర్భాషలాడారు. విచక్షణ కోల్పోయి తన చెప్పు తీసుకుని ముగ్గురు విద్యార్థులనూ కొట్టారు. ఇంటికి వెళ్లిన విద్యార్థులు జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేశారు. దీంతో తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి టీచర్‌ను ప్రశ్నించారు. అనుకోకుండా అలా జరిగిందని, కావాలని కొట్టలేదని చెప్పినా తల్లిదండ్రులు శాంతించకపోవడంతో వారిపైనా అనిత చెప్పు ఎత్తారు. దీంతో ఆమెను తల్లిదండ్రులు చితకబాదారు. పాఠశాల కరస్పాండెంట్ ప్రేమ్ కిశోర్‌తో వాగ్వాదానికి దిగారు. అనంతరం తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి పాఠశాల యాజమాన్యం, అనితపై ఫిర్యాదు చేశారు.

వేసవి రద్దీ నేపథ్యంలో 38 ప్రత్యేక రైళ్లు

- నేటి నుంచి చర్లపల్లి-శ్రీకాకుళం, తిరుపతి-మచిలీపట్నం మధ్య వారాంతంలో రాకపోకలు

హైదరాబాద్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వేసవిసెలవుల్లో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా చర్లపల్లి-శ్రీకాకుళం, తిరుపతి- మచిలీపట్నం మధ్య 38 వీక్లీ ప్రత్యేక రైళ్లను నడపడానికి ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. నేటి నుంచి జూన్ 26 వరకు (శుక్ర) చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్ (07025) 12 రైళ్లు, ఈ నెల 12 నుంచి జూన్ 28 వరకు(శని) శ్రీకాకుళం రోడ్-చర్లపల్లి(07026)కి 12 రైళ్లు, ఈ నెల 13 నుంచి మే 25 వరకు(ఆది) తిరుపతి-మచిలీపట్నం(07121) మధ్య 7 రైళ్లు, ఈ నెల 14 నుంచి మే 26 వరకు (సోమ) మచిలీపట్నం-తిరుపతి (07122) మధ్య 7 రైళ్లు నడుస్తాయని వివరించారు.

70 ప్రత్యేక రైళ్లు పొడిగింపు

70 ప్రత్యేక రైళ్లను జూన్ చివరి వారం వరకు పొడిగించారు. ఈ నెల 13 నుంచి జూన్ 30 వరకు తిరుపతి-సాయినగర్-శిరిడీ (07637-38), ఈ నెల 12 నుంచి జూన్ 29 వరకు కాజీపేట-దాదర్ (07197-98), ఈ నెల 16 నుంచి జూన్ 27 వరకు జాల్నా-ఛాప్రా (07651-52) రైళ్లు నడపడానికి ఏర్పాట్లు చేశారు.

ఉమ్మడి పీజీ సెట్ దరఖాస్తులకు ఆహ్వానం

- మే 5వ తేదీ వరకు గడువు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 యూనివర్సిటీల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్వీయూ వీసీ సీహెచ్ అప్పారావు, పీజీ సెట్-2025 కన్వీనర్ వీసీ వేంకటేశ్వర్లు, కో-కన్వీనర్ కె.సురేంద్రబాబు తెలిపారు. తిరుపతిలో గురువా రం వారు మీడియాతో మాట్లాడుతూ.. అన్ని యూనివర్సిటీల్లో పీజీలో ప్రవేశానికి చేపట్టే ఉమ్మడి పీజీసెట్-2025 నిర్వహణ బాధ్యతను ప్రభుత్వం ఎస్వీ యూనివర్సిటీకి అప్పగించిందన్నారు. గత నెల 31న నోటిఫికేషన్ విడుదల చేశామని, ఈ నెల 2 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందన్నారు. దరఖాస్తుకు మే 5వ తేదీ చివరి గడువుగా నిర్ణయించామన్నారు. ఓసీ రూ.850, బీసీ రూ.750, ఎస్సీ, ఎస్టీలకు రూ.650 దరఖాస్తు రుసుం నిర్ణయించామని తెలిపారు. అపరాధ రుసుంతో మే 25వ తేదీ దాకా దరఖాస్తు గడువు ఉంటుందని వెల్లడించారు. జూన్ 9 నుంచి 13వ తేదీ దాకా.. ప్రతి రోజూ మూడు సెషన్స్‌లో ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డికి ఎక్స్ కేటగిరి భద్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డికి ఎక్స్ కేటగిరీ భద్రత కల్పించాలని కేంద్ర హోంశాఖ నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖ డిప్యూటీ సెక్రటరీ సంజయ్‌శర్మ.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. విష్ణువర్ధన్‌రెడ్డికి ఎక్స్ కేటగిరి భద్రత కల్పించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

యుద్ధ విరామం!

కూల్, చిల్ అంటూ తన ప్రజలకు ధైర్యం చెప్పిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొద్దిగంటల్లోనే వెనకడుగు వేశారు. మిగతాదేశాలను మొత్తడానికి మొదలుపెట్టిన తన వాణిజ్య యుద్ధం అమెరికన్‌మార్కెట్‌ను ఛిన్నాభిన్నం చేయడంతో ప్రతీకార సుంకాల అమలును 90రోజులు నిలిపివేశారు. ధిక్కారము సైతునా అంటూ చైనా ఒక్కదానిమీదే తన కక్షసాధింపు కొనసాగిస్తూ, మిగతా వాటిని పదిశాతంతో వదిలేశారు. ఏప్రిల్ ఫూల్స్ డే మర్నాడు, లిబరేషన్ డే పేరిట ప్రపంచదేశాలమీద ప్రతీకార సుంకాలు ప్రయోగించిన ఆయన వారం తిరిగేసరికి వెనకడుగువేశారు. మస్క్ మాటే విన్నారో, తెరవెనుక నుంచి కార్పొరేట్ మాంత్రికుల ఒత్తిళ్ళే పనిచేశాయో తెలియదు కానీ తన యుద్ధానికి విరామం ప్రకటించారు. ట్రంప్ ప్రతీకారాస్త్రాల దెబ్బకు కుప్పకూలిన ప్రపంచ మార్కెట్లు ఇప్పుడు కాస్తంత ఒడ్డునపడుతున్నాయి. లక్షలకోట్ల సంపద ఆవిరైన గాయాలనుంచి క్రమంగా కోలుకుంటున్నాయి.

ట్రంప్ మనసు ఇంతలోనే ఎందుకలా మారిందో తెలియదు. ప్రతీకార సుంకాలు ప్రయోగిస్తున్నప్పుడు ఆయన ఎంత విశ్వాసంతో మాట్లాడారో చూశాం. అమెరికా సమస్త సమస్యలనుంచి, దారిద్ర్యంనుంచి, దాస్యం నుంచి ఎలా విముక్తి కాబోతున్నదో ఆయన అద్భుతంగా చెప్పారు. గ్రేట్ ఎగైన్ కావడం ఎంతో దూరంలో లేదన్నారు. తన, పర తేడాలేకుండా, పేద ధనికభేదం లేకుండా ప్రతీదేశానికీ ఓ రేటు కట్టారు. గతకాలపు కుట్రలతో గాయపడిన దేశాన్ని ఉద్ధరించానన్నారు. దెబ్బకు దేశం పరుగులు పెడుతుందనీ, వెలుగులీనుతుందనీ చెప్పారు. భజనబృందం చప్పట్ల మధ్యన కార్యక్రమాన్ని ముగించిన తరువాత కూడా అపరేషన్ సక్సెస్, పేషంట్ మోర్ ఫిట్ అని ట్వీట్ చేశారు. ట్రంప్ బృందం ఈ సుంకాల శాతాన్ని ఏ ప్రాతిపదికన నిర్ణయించిందన్న సందేహాలు కూడా అప్పట్లో వచ్చాయి. ప్రతీ రేటుకూ ఓ లెక్క ఉందని, అడుగడుగూ ఆచితూచివేస్తున్నదేనని ట్రంప్ బృందం గొప్పగా చెప్పుకుంది. అంత ఆలోచించి, భవిష్యత్తు అంచనాలతో తీసుకున్న నిర్ణయమే అయితే, ఈ విధ్వంసానికి ముందే సిద్ధపడి ఉండాలి. ఈక్విటీలు ఈడ్చుకుపోతాయని, బాండ్లు బద్దలవుతాయని, వాల్‌స్ట్రీట్ కూలుతుందని, అంతిమంగా కొంపకొల్లేరవుతుందన్న అవగాహన ఎంతో ఉండాలి. అంతా సర్దుకుంటుందని, తన నిర్ణయం దేశానికి మేలుచేస్తుందని నమ్మకం ఉన్నపక్షంలో వారంలోనే ఇలా వెనకడుగువేయకూడదు. ఆర్థికమాంద్యం ఆరంభమైందనో, అడుగు దూరంలో ఉన్నదనో, సగం మునిగామనో ఆర్థికసంస్థలు వరుసపెట్టి హెచ్చరికలు చేస్తూంటే, లక్షలాదిమంది అమెరికన్లు హ్యాండ్సాఫ్ అంటూ రోడ్లమీదకు వచ్చేయడంతో ట్రంప్ వెనక్కుతగ్గినట్లు ఉంది. మీకు బెదరను, నిర్ణయాన్ని మార్చను అని అంత ఘాటుగా స్పందించిన ట్రంప్ ఇంతలోనే బెదిరిపోవడం స్పష్టంగా కనిపిస్తోంది. స్వల్పకాలంలోనే అమెరికన్లకు తత్వం బోధపడిందని, తిరుగుబాటు ఆరంభమైందని ఆయనకు అనిపించివుండవచ్చు.

వారంలో సుంకాలు వేయడం, తీయడం ట్రంప్‌కు సులువే. కానీ, దశాబ్దాలుగా నిర్మించుకున్న సరఫరా వ్యవస్థలను కూల్చడానికి పిచ్చోడి చేతిలో చిన్న రాయిచాలు. ఈ పరిణామాలన్నీ ఊహించినవే, మా నిర్ణయాలమీద మాకు నమ్మకం ఉంది, కానీ జనమే భయపడిపోతున్నారు అని ట్రంప్ బృందం సమర్థించుకోవడం విచిత్రం. మిగతా ప్రపంచంతో ఒప్పందాలు చేసుకోవడం, చైనాను ఒంటరిచేయడం లక్ష్యంగా తమ ఎత్తులు సాగుతున్నాయని అమెరికా చెప్పుకుంటోంది. కానీ, ప్రపంచ వాణిజ్యంలో ఈ రెండు అగ్రదేశాల వాటా 40శాతం పైనే ఉన్నందున, అది సృష్టించబోయే విధ్వంసం అంచనాలకు అందనిది. ఏ యుద్ధానికైనా సిద్ధమే, చైనీయులు దేనికీ భయపడరని చైనా ప్రకటించింది. తన భౌగోళికార్థిక ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికీ, విస్తరించడానికీ వాణిజ్య యుద్ధాన్ని వాడుకోవాలని అది అనుకుంటోంది. ఆప్తమిత్రదేశాలు అమెరికాకు దూరమవుతున్న స్థితిలో చైనాకు సన్నిహితమవుతున్నవారి సంఖ్య సహజంగానే హెచ్చుతుంది. ఈ యుద్ధం ఎంతకాలం కొనసాగినా మేము ఎప్పటికీ లొంగం... విజయం సాధించేవరకూ పోరాడతాం అంటూ 1953లో మావో చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు ప్రచారంలో పెడుతూ చైనా తన పోరాటాన్ని ఏ స్థాయికైనా తీసుకుపోవడానికి సిద్ధపడుతోంది. అధ్యక్షుడికి ఉండే విశేషాధికారాలను దుర్వినియోగం చేస్తూ ప్రపంచవాణిజ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్న ట్రంప్ మీద ఇప్పటికైనా నియంత్రణలు ఉండాలి. స్వపక్ష, ప్రతిపక్షాలు, చట్టసభలు, న్యాయస్థానాలు అమెరికా సంక్షేమం దృష్ట్యా రంగంలోకి దిగాలి.

జైహింద్ నినాద స్రష్ట

అధికారిక, అనధికారిక సభలు, సమావేశాలు, కార్యక్రమాలు, ప్రసంగాలు ఏవైనా సరే ముగింపులో మనకు వినిపించే ఏకైక పదం 'జై హింద్'. దీని అర్థం ఏమిటి? దీన్ని ఎవరు సృష్టించారు? ఎలా వాడుకలోకొచ్చింది? ఎవరు ప్రాచుర్యంలోకి తెచ్చారు? దీని పుట్టుపూర్వోత్తరాలు ఏమిటి? అలవోకగా పలికేస్తున్న ఈ పదం గొప్పతనం గురించి నేటి తరంలో ఎంతమందికి తెలుసు? ఇవి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన విషయం.

జై హింద్– అనే పదం దేశభక్తిని చాటుకునే ఓ మహత్తర నినాదం. భారత దేశానికి జయం కలుగుగాక! అని దీని అర్థం. స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఈ పదాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది నేతాజీ సుభాస్ చంద్రబోస్ కాగా, దీని సృష్టికర్త మాత్రం ఆబిద్ హసన్ సఫ్రానీ. బోసు సహచరులైన ముస్లిం సమరయోధుల్లో, ఆజాద్ హింద్ ఫౌజ్ సాయుధ పోరాట వీరుల్లో సఫ్రానీ ప్రముఖుడు. ఈయన తెలంగాణ ముద్దుబిడ్డ. 1911 ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో జన్మించారు. అసలు పేరు జైనుల్ ఆబిదీన్ హసన్. ఐఎఫ్ఎస్ అధికారి. పలు దేశాల్లో భారత రాయబారిగా పని చేశారు. ఉర్దూ, పర్షియన్, అరబిక్, సంస్కృతం, ఫ్రెంచ్, లాటిన్ వంటి అనేక భాషల్లో గొప్ప పండితుడు. అద్భుతమైన కవిత్వం రాశారు. శుభ్ సుఖ్ చైన్ సృష్టికర్త. ఆబిడ్స్‌లోని సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్‌లో చదువుకున్నారు. ఆయన తల్లి ఫఖ్రుల్ హాజియా బేగం. హైదరాబాద్‌లో ఆంక్షలు ఉన్నప్పటికీ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న ధీర వనిత, గొప్ప దేశభక్తురాలు. సరోజినీనాయుడు స్నేహితురాలు. ఆబిద్ హసన్ ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లాలనుకున్నారు. కాని తల్లి ఫఖ్రుల్ హాజియా బ్రిటిషు వ్యతిరేకత ఆయనపై గట్టి ప్రభావం చూపించింది.



శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. చదువు ఆగిపోయింది. తరువాత ఇంజనీరింగ్ విద్య కోసం జర్మనీ వెళ్లాడు. అక్కడే నేతాజీ సుభాస్ చంద్ర బోస్‌ను కలుసుకున్నారు.

స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు కూడగట్టేందుకు బోసు చేస్తున్న ప్రసంగాలు ఆబిద్ హసన్‌ను మరింత ప్రభావితం చేశాయి. దీంతో ఇంజనీరింగ్ చదువును మధ్యలోనే విడిచిపెట్టి, బోస్‌కి వ్యక్తిగత కార్యదర్శిగా, జర్మన్ భాష అనువాదకుడిగా చేరారు. బోస్ పునర్వ్యవస్థీకరించిన ఇండియన్ నేషనల్ ఆర్మీలో ఆబిద్ మేజర్‌గా పనిచేశారు. బోసుకు తోడుగా ఉండి, భవిష్యత్ కార్యక్రమాల రూపకల్పనలో ఆయనకు తోడ్పాటు అందించారు. ఆ కాలంలో ఆసేతు హిమాచలం ఆబాలగోపాలాన్ని ఉర్రూతలూగించిన జైహింద్ నినాద స్రష్ట ఆబిద్ హసన్ సఫ్రానీయే కావడం తెలంగాణ వాసులకు గర్వకారణం. అనతికాలంలోనే ఈ నినాదం స్వాతంత్ర్య సమరయోధుల అధికారిక నినాదంగా మారిపోయింది. ఇప్పటికీ రాజకీయ నాయకులు, దేశభక్తులు తరచూ ఈ నినాదాన్ని ఉపయోగిస్తూ ఉంటారు. అనుపమానమైన దేశభక్తికి తార్కాణంగా చేసే నినాదంగా నేటికీ ప్రజల హృదయాల్లో బలంగా ముద్రించుకుపోయిందీ నినాదం.

బ్రిటన్‌తో జర్మనీ యుద్ధం చేస్తున్న సమయంలో ఇండియన్ నేషనల్ ఆర్మీలో భిన్న వర్గాలకు చెందిన ప్రజలు ఉండేవారు. అందులో కొంతమంది 'నమస్కార్' అని సంబోధిస్తే, మరికొంత మంది 'రామ్ రామ్' అంటూ పలకరించుకునేవారు. 'సత్ శ్రీ అకాల్', 'అస్సలాము అలైకుం' అంటూ అభివాదం చేసుకునేవారు కూడా ఉండేవారు. సెక్యులర్ భావాలు కలిగిన బోస్‌కు ఇన్ని రకాల అభివాదాలు ఉండటం సబబుగా అనిపించలేదు. అందరికీ ఆమోదయోగ్యమైన ఓ అభివాద నినాదాన్ని రూపొందించాలని ఆయన తన సన్నిహితులకు చెప్పారు. ఆబిద్ హసన్ ముందుగా 'హలో' అని ప్రతిపాదించారు. కాని బోస్‌కు అది నచ్చలేదు. తరువాత 'జై హిందుస్తాన్', 'జై హింద్' అని ప్రతిపాదించారు ఆబిద్. జై హిందుస్తాన్ కాస్త పెద్దగా ఉండడం వల్ల 'జై హింద్'కే బోసు జై కొట్టారు. ఈ నినాదం బోస్‌కు ఎంతగానో నచ్చింది. వెంటనే ఆయన దాన్ని ఆమోదించి, ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. అప్పటి నుంచి 'జై హింద్' అనే పదం దేశభక్తిని చాటుకునే ఒక మహత్తర నినాదంగా మారిపోయింది. 1984 ఏప్రిల్ 5న ఆబిద్ హసన్ సఫ్రానీ హైదరాబాద్‌లో కన్ను మూశారు.

• యండి. ఉస్మాన్ ఖాన్
జర్నలిస్ట్

(నేడు ఆబిద్ హసన్ సఫ్రానీ జయంతి)

అధికారమే భావజాల బాంధవ్యం!



రాజకీయ కసరత్తులకు పురస్కారాలు ఉన్న పక్షంలో స్వర్ణ పతకాన్ని అందుకునేందుకు నితీశ్ కుమార్ నిస్సందేహంగా అందరికంటే ముందంజలో ఉంటారు; మొదటి మూడు స్థానాల్లో ఏదో ఒక దానిలో ఉండేందుకు చంద్రబాబు నాయుడు పోటీ పడతారు. నరేంద్ర మోదీకి నిన్న, మొన్న గట్టి ప్రత్యర్థులుగా ఉన్న ఈ నాయక ద్వయం నేడు ఆయన నమ్మకమైన మిత్రులుగా మారిపోయారు. ఇదొక సమూల మార్పు. పార్లమెంటులో వక్ఫ్ బిల్లు ఆమోదం పొందేందుకు జనతాదళ్ (యునైటెడ్), తెలుగుదేశం పార్టీలు సంపూర్ణ మద్దతునివ్వడమే అందుకొక తిరుగులేని నిదర్శనం. గత పది నెలల్లో పరిస్థితులు ఎంతగా మారిపోయాయి! జూన్ 2024 నాటి పరిస్థితులను గుర్తు చేసుకోండి. సార్వత్రిక ఎన్నికలు ముగిసాయి. నరేంద్ర మోదీకి మెజారిటీ లభించలేదు. నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు బీజేపీకి అవసరమైన సంఖ్యాధిక్యతను సమకూర్చేందుకు సమ్మతించారు–షరతులతోనే సుమా! మరి వారే ఇప్పుడు నరేంద్ర మోదీ ఆధిపత్యాన్ని ఎటువంటి మినహాయింపులు లేకుండా అంగీకరిస్తున్నారు.

అధికార రాజకీయాలలో మనుగడను కాపాడుకునేందుకు సైద్ధాంతిక నిబద్ధతలకు ఎంత సులువుగా తిలోదకాలు ఇవ్వడం జరుగుతుందనేదానికి నితీశ్ కుమార్ రాజకీయమే ఒక తిరుగులేని ఉదాహరణ. నరేంద్ర మోదీ 2013లో భారతీయ జనతా పార్టీ ప్రధాన మంత్రి అభ్యర్థిగా జాతీయ రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు ఆయనపై మొట్టమొదట తిరుగుబాటు చేసింది బిహార్ ముఖ్యమంత్రే కాదూ? మోదీ ఉన్నతిని ప్రతిఘటించిన నితీశ్ కుమార్ ఎన్డీఏ నుంచి వైదొలిగారు. ఒక 'మతతత్వ' శక్తికి వ్యతిరేకంగా, దానిని సమర్థంగా అడ్డుకోగల ఒక లౌకికశక్తిగా తనను తాను ఆయన నిలుపుకున్నారు. అయితే 2002 గుజరాత్ మారణ కాండ నాటి నుంచి రగులుతున్న సైద్ధాంతిక ఘర్షణతో పాటు, పెరుగుతున్న వైయక్తిక పోటీ కారణంగానే ఆనాడు ఎన్డీఏ నుంచి నితీశ్ నిష్క్రమించారని చెప్పక తప్పదు. 2013లో 'సద్భావన యాత్ర' సందర్భంగా టోపీ పెట్టుకునేందుకు మోదీ నిరాకరించడంపై నితీశ్ ఇలా ప్రతిస్పందించారు: 'దేశాన్ని పరిపాలించేందుకు ప్రతి ఒక్కరినీ మీతో కలుపుకోవాలి.. అందుకు కొన్ని సందర్భాలలో టోపీ ధరించాల్సి ఉంటుంది... మరికొన్ని సమయాలలో నుదుట తిలకం పెట్టుకోవాల్సి ఉంటుంది.' నితీశ్ అలా తన 'మృదు' రాజకీయ లౌకికవాదాన్ని నిర్వచించారు. మోదీ బ్రాండ్ హిందూత్వ, తన లౌకికవాదం మధ్య వ్యత్యాసాన్ని ఆయన ఆ విధంగా చాటి చెప్పారు.

నితీశ్, మోదీ నాయకత్వ శైలులు పరస్పర విరుద్ధమైనవి. పన్నెండు సంవత్సరాల అనంతరం, ఈ పరస్పర విరుద్ధాల ఘర్షణలో విజేతగా మోదీ వెలుగొందుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం బీజేపీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిని నిర్మించి, దాని నాయకుడుగా ప్రధానమంత్రి నాయకత్వాన్ని సవాల్ చేసిన నితీశ్ కుమార్ ఇప్పుడు మోదీ దర్బార్‌లో ఒక సామంతుడుగా ఉన్నారు! క్షీణిస్తున్న ఆరోగ్యంతో నిస్సహాయుడైపోయిన నితీశ్ మోదీ మహాశక్తిని కనీసమాత్రంగానైనా ఎదుర్కోలేకపోతున్నారు. అందుకే మోదీకి పూర్తి మద్దతుదారుగా మారిపోయారు. అయితే ముస్లింల సంక్షేమం పట్ల తమ నాయకుడి నిబద్ధతలో ఎటువంటి మార్పులేదని నితీశ్ అనుయాయులు వాదిస్తున్నారు. అయితే ఇవన్నీ పసలేని మాటలే. జనతాదళ్(యు) రాజకీయ వ్యూహాలు, ఎత్తుగడల్లో ఆ సంక్షేమ సంకల్పాలకు అంతకంతకూ ప్రాధాన్యం తగ్గిపోతోంది.

> **నితీశ్, చంద్రబాబు రాజకీయ ఎంపికలు సమకాలీన రాజకీయాలకు ఆధారంగా ఉన్న లౌకిక–మతతత్వ విభజనపై ఒక ఇబ్బందికరమైన ప్రశ్నార్థకాన్ని ఉంచుతున్నాయి. దృఢ విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించడం కాకుండా స్వప్రయోజనాలు సాధించుకోవడమే ప్రధానమైపోయిన మన రాజకీయ వ్యవస్థలో నిబిడీకృతంగా ఉన్న కాపట్యాలనూ అవి బహిర్గతం చేస్తున్నాయి.**

ఇది వాస్తవం. భారతీయ జనతా పార్టీకి నితీశ్ కుమార్ ఒక ఆవశ్యక మిత్రుడు. ఒక ఉపయోగకరమైన రాజకీయ చిహ్నం. వచ్చే నవంబర్‌లో బిహార్ అసెంబ్లీ ఎన్నికలలో తమ బలాన్ని పెంపొందించుకునేందుకు నితీశ్ మద్దతు అవసరం చాలా ఉంది.

చంద్రబాబు నాయుడి రాజకీయ పరిణామం భిన్నమైనది. అదొక క్లిష్టమైన అధ్యయన అంశం. బీజేపీకి చెప్పుకోదగిన ప్రజాబలం లేని రాష్ట్రానికి చంద్రబాబు ముఖ్యమంత్రి. పరిపాలనా ప్రజ్ఞ ఉన్న నాయకుడు. రాజకీయ అనుభవమూ అపారంగా ఉన్న నేత. బీజేపీపై ఏ మాత్రం ఆధారపడవలసిన అవసరం లేకుండానే ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో కొనసాగగల సామర్థ్యం చంద్రబాబుకు ఉన్నది. మరి ఇదే నాయకుడు 2019లో నరేంద్ర మోదీపై ధ్వజమెత్తారు. మోదీ నాయకత్వాన్ని వ్యతిరేకించారు. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రిని ఒక 'ఉగ్రవాది' అని కూడా ఆ చంద్రబాబు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు మొదటి నుంచీ కేంద్రంతో 'ఒప్పందాల ఆధారిత'మైనవిగానే ఉన్నాయి. 1990ల నాటి సంకీర్ణ రాజకీయాల యుగంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వానికి, వాజపేయి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి ప్రధాన మద్దతుదారు, ఆ ప్రభుత్వాలను నిలబెట్టిందీ చంద్రబాబే. ఇప్పుడు అవశేష ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా కూడా కేంద్రంతో ఇప్పుడూ గతంలో వలే ఒక 'ఒప్పందం' కుదుర్చుకున్నారు. ఆర్థిక వనరులు కొరవడిన ఆంధ్రప్రదేశ్‌కు గరిష్ఠ స్థాయిలో ఆర్థిక సహాయమందించాలన్నదే చంద్రబాబు షరతు. ఆ ఆర్థిక తోడ్పాటు కోసమే వివాదాస్పద చట్టం విషయంలోనూ ఆయన కేంద్ర ప్రభుత్వానికి గట్టి దన్నుగా నిలిచారు.

నితీశ్, నాయుడు ఇరువురూ ఒక విధంగా రాజకీయ మనుగడను ఒక కళగా రూపొందించారు, సాధన చేస్తున్నారు. సమయానుకూలంగా, రాజకీయ అవసరాలకు తగ్గట్టు అభిప్రాయాలు మార్చుకుని పట్టువిడుపులతో వ్యవహరించడం వల్ల అధికారంలో సుదీర్ఘకాలం కొనసాగడం సుసాధ్యమవుతుందనేది ఇరువురి అనుభవ పాఠం. అయితే నితీశ్, నాయుడి రాజకీయ ఎంపికలు సమకాలీన రాజకీయాలకు ఆధారంగా ఉన్న లౌకిక–మతతత్వ విభజనపై ఒక ఇబ్బందికరమైన ప్రశ్నార్థకాన్ని ఉంచుతున్నాయి. దృఢ విశ్వాసాలకు అనుగుణంగా వ్యవహరించడం కాకుండా స్వప్రయోజనాలు సాధించుకోవడమే ప్రధానమైపోయిన మన రాజకీయ వ్యవస్థలో నిబిడీకృతంగా ఉన్న కాపట్యాలను అవి బహిర్గతం చేస్తున్నాయి. నిర్వివాదమైన ఒక రాజకీయ సత్యాన్ని ఆ ఇరువురి దృక్పథాలు పునరుద్ఘాటిస్తున్నాయి: 'నిర్దిష్ట అంశాలపై మీ వైఖరి ఏమిటి అనే దానిపై మీ అధికార భవితవ్యం అనేది ఆధారపడి ఉన్నది'. ఈ రాజకీయ ప్రక్రియలో లౌకిక రాజ్యాంగ విలువలు క్రమంగా నిరర్థకమైపోయాయి. ఇండియా కూటమితో ఉన్నప్పుడు 'లౌకికవాది' అయిన నితీశ్ కుమార్ బీజేపీతో చేతులు కలిపిన తరువాత మతతత్వవాది ఎలా అయ్యారు? చంద్రబాబుకూ ఈ ప్రశ్న వర్తిస్తుంది.

ఈ నేపథ్యంలో మనకు మిగిలింది అవకాశవాద 'లౌకిక' రాజకీయాలే. సూక్ష్మ తేడాలతో అందరూ ఈ సంకుచిత రాజకీయాలనే అనుసరిస్తున్నారు. అయినా రాజకీయాలలో మత ప్రమేయాన్ని వ్యతిరేకిస్తుంటారు. స్వీయ ప్రయోజనాలకు మతతత్వవాదులతో రాజీ పడేందుకు వెనుకాడరు. అధికార లబ్ధే కదా అందరి పరమ ధ్యేయం! మత ప్రమేయం లేని, మతతత్వ రాజకీయాలను సమయానుకూలంగా సమరీతిలో ఆచరించడాన్ని ఒక కళగా తీర్చిదిద్దడంలో కాంగ్రెస్ పరిపూర్ణత సాధించింది. షాబానో కేసు సందర్భంలో ఇస్లామిక్ ఛాందసవాదుల ఒత్తిళ్లకు లొంగిపోయి, వారు అభిలషించిన విధంగా నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ ఆ తరువాత హిందూత్వ వాదులను సానుకూలం చేసుకునేందుకు బాబ్రీ మసీదు గేట్లు తెరిపించింది. పర్యవసానంగా జరిగిందేమిటో మనకు తెలిసిన చరిత్రే. ఇక సోషలిస్టులు, విస్తృత జనతా పరివార్‌కు కాంగ్రెస్ వ్యతిరేకతే ఊపిరి. ఆ



▪ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

జాతీయ రాజకీయ పక్షాన్ని అంత తీవ్రంగా వ్యతిరేకించే ఈ సోషలిస్టులు లౌకిక రాజకీయాలకు నిష్ఠగా నిబద్ధమయ్యారా? కాంగ్రెస్ అధికారంలో లేకుండా చేయడమే వారి లక్ష్యం. అందుకు బీజేపీతో జట్టు కట్టేందుకు సోషలిస్టులు, ఇతర జనతా పరివార్ ఎప్పుడూ వెనుకాడలేదు. ఇక ముందూ వెనుకాడబోరని నిశ్చితంగా చెప్పవచ్చు. ప్రాంతీయ పార్టీలు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే మొదలైనవి గతంలో బీజేపీ నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాలలో భాగస్వాములుగా ఉన్నాయి. ఎందుకు? కేంద్రంలో అధికారం చెలాయించేందుకే సుమా! వామపక్షాలు మాత్రమే మతోన్మాద రాజకీయాలను స్థిరవైఖరితో వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. అయితే అవి ఇప్పుడు ఇంచుమించు దేశవ్యాప్తంగా రాజకీయ ప్రాధాన్యాన్ని కోల్పోయాయి ప్రజాదరణ కోల్పోతున్నాయి. జాతీయ పాలకపక్షాన్ని, దాని ఆధిపత్య కథనాలను ఎంతమాత్రం సవాల్ చేయగల పరిస్థితిలో లేవు.

ఈ శోచనీయ పరిస్థితుల్లో, అవును, ఈ శోచనీయ పరిస్థితుల్లో నరేంద్ర మోదీ నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ ఒక అజేయశక్తిగా ఆవిర్భవించింది. లోక్‌సభలో ఒక్క ముస్లిం ఎంపీ కూడా లేని బీజేపీ ఇప్పుడు ఇస్లామిక్ మతాచరణలను 'సంస్కరించే' కర్తవ్య పాలనకు పూనుకున్నది. ఇతర మతాలు అన్నిటినీ నిరాదరించే, తరచు వాటి పట్ల విద్వేషాన్ని వెళ్లగక్కే హిందూత్వ మెజారిటేరియన్ ప్రపంచ దృక్పథాన్ని సంఘటితం చేస్తూనే 'పేద' ముస్లింల ప్రయోజనాల పరిరక్షణ గురించి ఆరాట పడుతోంది. బీజేపీ సర్వాధికారాన్ని సమర్థంగా ఎదుర్కోగలవారు బలహీనపడ్డారు. లేదా తమ ప్రత్యర్థితో పూర్తిగా రాజీపడ్డారు. ఏ విధంగాను ప్రతిఘటించలేకపోతున్నారు. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన మత స్వేచ్ఛకు తీవ్ర నష్టం వాటిల్లే విధంగా రూపొందించిన కొత్త వక్ఫ్ చట్టంలో కీలక సవరణలు తెచ్చేందుకు తమ నాయకులు చొరవ తీసుకున్నారని నితీశ్ కుమార్, చంద్రబాబు నాయుడు మద్దతుదారులు వాదిస్తున్నారు. అవునా? భారత లౌకిక ప్రజాస్వామ్య దర్పణం పూర్తిగా పగిలిపోయింది. నితీశ్, నాయుడు ఇరువురూ చెల్లాచెదురుగా పడిపోయిన గాజు ముక్కలలో అప్పుడప్పుడూ తమను తాము క్షణకాలం పాటు చూసుకోవలసిన అవసరమున్నది. విరూపమైన ప్రతిబింబాలు వారికొక వాస్తవాన్ని గుర్తుచేస్తాయి. సకల మతాల సమానత్వాన్ని సూత్రబద్ధంగా సమర్థించిన తామిరువురూ మత వివక్షా రాజకీయాలు రాజ్యమేలేందుకు ఎంతగా దోహదం చేస్తోందీ పగిలిన లౌకిక ప్రజాస్వామ్య అద్దం ముక్కలు వారికి స్పష్టంగా ఎరుకపరుస్తాయి.

తాజా కలం: 2013లో నితీశ్ కుమార్ ఎన్డీఏ నుంచి నిష్క్రమించినప్పుడు ఆయనను తొట్ట తొలుత ఇంటర్వ్యూ చేసిన అవకాశం నాకు లభించింది. ఎన్డీఏ నుంచి ఎందుకు వైదొలిగారు అన్న ప్రశ్నకు ఆయన వెన్వెంటనే ఇలా ప్రతిస్పందించారు: "ఒక 'నియంత'తో కలిసి పని చేయలేను." మరి ఇప్పుడు తన దయనీయ పరిస్థితి గురించి నితీశ్ ఎటువంటి వివరణ ఇస్తారో?!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

సమాఖ్య స్ఫూర్తికి పట్టం కట్టిన తీర్పు

తమిళనాడు గవర్నర్ ఆ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయాల్ని చట్టవ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చారిత్రాత్మకం. ఆయన తొక్కిపెట్టిన పది బిల్లులను ఆమోదించినట్టుగానే భావిస్తూ తీర్పునివ్వడం సరైన చర్య. ముందు ముందు అలా తొక్కిపెట్టే అవకాశాల్ని తగ్గిస్తూ గవర్నర్ విధులకు అవసరమైన పరిమితుల్ని విధించడం కూడా మంచిదే. గవర్నర్ స్థానానికి పెద్దరికం కట్టబెడుతూ, రాజ్యాంగం అస్పష్టంగా వదిలివేసిన లక్ష్మణ రేఖల్ని నేడు న్యాయస్థానం దిద్ది, బాగా కనబడేట్టు చేయాల్సి రావడం రాజకీయాల పుణ్యమే. కొంతమంది అత్యుత్సాహపు గవర్నర్లు పరిమితుల్ని దాటి కేంద్రం పట్ల విధేయతను చాటుకుంటారు. తమిళనాడు గవర్నర్ చేసింది ఇదే. సుప్రీం ఆ తప్పుని ఎత్తి చూపింది. ఇది రాజ్యాంగ వ్యవస్థల బాధ్యతల్ని గుర్తుచేసే మంచి తీర్పు.

– డి.వి.జి. శంకరరావు, మాజీ ఎంపీ

పంచాయతీ కార్యదర్శుల పనిభారం పట్టించుకోరేం!

పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన విధి నిర్వహణ బాధ్యతలను పంచాయతీరాజ్ – గ్రామీణ అభివృద్ధి శాఖ 18.5.2007లో నిర్దేశించింది. గ్రామ సచివాలయ ఏర్పాటు తదుపరి ప్రభుత్వ ఉత్తర్వులు నెంబరు 149, 30.9.2019 ద్వారా గ్రామ సచివాలయ కార్యదర్శుల బాధ్యతలను నిర్దేశించింది. సదరు జాబ్ చార్ట్ ప్రకారం ప్రతి కార్యదర్శి 27 అంశాలకు సంబంధించిన విధులు నిర్వహించాలి. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు రాష్ట్రంలో 70శాతం గ్రామీణ ప్రజలు అందరికీ నేరుగా సేవలు అందిస్తూ మోయలేని పని భారాన్ని మోస్తున్నప్పటికి కొంతమంది ఉన్నతాధికారులు అసలు పంచాయితీ కార్యదర్శులకు ఏమి పని ఉంది అని అవహేళన చేస్తూ మాట్లాడడం బాధాకరం.

గ్రామపంచాయతీ కార్యదర్శులు నిర్వహించే విధుల్లో కొన్ని మాత్రమే: రోజువారీ పారిశుద్ధ్య నిర్వహణ పనులు; రక్షిత మంచినీటి సరఫరా పనులు; రోడ్లు డ్రైన్‌ల నిర్వహణ; వీధి దీపాల నిర్వహణ; స్మశాన వాటికల నిర్వహణ; జనన మరణ వివాహ రిజిస్ట్రార్; ఆర్టీఐ అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్; గ్రామ సచివాలయం డిడిఓ; గ్రామ సచివాలయం కన్వీనర్; గ్రామ పంచాయితీ అభివృద్ధి ప్రణాళిక ఫెసిలిటేటర్; పంచాయితీ ఆస్తుల కస్టోడియన్ ఆఫీసర్; ఆక్రమణలు అడ్డగింపు, ఆక్రమణలు తొలగింపు; అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లు నియంత్రించడం; నిబంధనలకు లోబడి భవన నిర్మాణ అనుమతులు జారీ చేయడం; హైకోర్టు, లోకాయుక్త కేసులు నిమిత్తం కౌంటర్లు సమర్పించడం; గ్రామ పంచాయితీ సమావేశాలు నిర్వహించడం; కార్యాచరణ కమిటీలు ఏర్పాటు; చట్టపరమైన గ్రామ సభలు నిర్వహించడం; లబ్ధిదారులను గుర్తించడం; సంక్షేమ పథకాలు అమలుపరచడం; గ్రామ పంచాయితీ తీర్మానాలు అమలుపరచడం; మహిళ, బాల, వృద్ధుల ప్రత్యేక గ్రామ సభలు; ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రభుత్వ సమావేశాలు నిర్వహించడం... ఇవేగాక ఇంకా ఎన్నో లెక్కకు మిక్కిలి బాధ్యతలను భరిస్తున్నారు. అదనంగా గ్రామ సచివాలయం పనులు సైతం పంచాయితీ కార్యదర్శిపై మోపుతున్నారు. వారు అవీ చేస్తున్నారు. ముఖ్యంగా మహిళా కార్యదర్శులు ఇటు ఉద్యోగ ధర్మం, వ్యక్తిగత ఆరోగ్యం, కుటుంబ బాధ్యతలను బ్యాలెన్స్ చేస్తూ తీవ్ర పని ఒత్తిడికి గురి అవుతున్నారు.

ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామ సచివాలయం పనుల నుంచి పంచాయితీ కార్యదర్శులను తప్పించాలి. వారిని మాతృశాఖ అయిన పంచాయితీరాజ్ శాఖ పనులకే పరిమితం చేయాలి. ఒకవేళ ప్రభుత్వం వారు ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శులు నిర్వహించే అన్ని విధులు వారి చేతే చేయించాలనుకుంటే అధిక సిబ్బందిని మంజూరు చేయాలి. అంతేగాక పంచాయతీ కార్యదర్శులకు అదనంగా 20శాతం బేసిక్ పే మంజూరు చేయాలి. పదోన్నతుల విషయంలో ఇప్పుడున్న విధానం ప్రకారం గ్రేట్ ఫోర్ పంచాయతీ కార్యదర్శి తన జీవితకాలంలో పంచాయతీ సెక్రెటరీ గ్రేడ్-1 హోదా దాటి పదోన్నతి పొందే అవకాశం కనుచూపు మేరలో కనిపించదు. కావున పంచాయతీల సెక్రటరీ కేటగిరీలో నేడున్న గ్రేడ్లను రద్దుచేయాలి. అందుకుగాను ప్రభుత్వం వారు ప్రతి ఏడు సంవత్సరాల సర్వీస్ చేసిన గ్రేడ్-4 కార్యదర్శి నుంచి పై గ్రేడులలో ఉన్న కార్యదర్శులకు ఆటోమేటిక్ పదోన్నతి, వేతనం స్థిరీకరణ జరపాలి. మొదటి రెండు గ్రేడులలోని పంచాయతీలలో పనిభారం ఎక్కువ కాబట్టి సదరు పంచాయతీలలో అదనపు పంచాయతీ కార్యదర్శి పోస్టులు మంజూరు చేయాలి. గౌరవ ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పంచాయతీ కార్యదర్శుల ఇబ్బందులను అర్థం చేసుకొని తగు న్యాయం చేస్తారని ఆశిస్తున్నాం.

– టి.యం.బి. బుచ్చిరాజు
ఏపీ పంచాయతీరాజ్ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్

సామాజిక విప్లవ ప్రవక్త

'దేశమనే దేహానికి శూద్రులే ప్రాణం.. వారే రక్తనాళాలు' ఈ మాటలు అనేక సందర్భాలలో నాకు గుర్తుకు వస్తూ ఉంటాయి. ఈ మాటలు అన్నది ఎవరో కాదు.. మహాత్మా జ్యోతిబా ఫూలే. ప్రజాస్వామ్యం పరిణతి చెంది.. పరిఢవిల్లుతున్న వర్తమాన సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలను ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవచ్చు. కుల వ్యవస్థ ప్రాతిపాదిక సమాజ గమనం ఉన్న సమయంలో.. అంటరానితనం కొన్ని కోట్ల మంది జీవితాల్లో అతి సామాన్యమైన విషయంగా ఉన్నప్పుడు, ఒక వ్యక్తి అణగారిన జీవితాల గురించి ఈ తరహా వ్యాఖ్యలు చేయటం.. దానివల్ల ఎదురయిన కష్టనష్టాలను ఓర్చుకొని ముందుకు సాగటం అంత సులభం కాదు. అందుకే ఈనాటికీ మనకు జ్యోతిబా ఫూలే ఆరాధ్యుడయ్యాడు. కొన్ని కోట్ల మంది గుండెల్లో నిలిచి ఉన్నాడు. 'మహాత్మా' అనే బిరుదు మన దేశంలో ఇద్దరికి మాత్రమే ఉంది. ఒకటి మనకు స్వాతంత్ర్యాన్ని తేవటంలో కీలక భూమిక పోషించిన గాంధీకి. రెండోది మన సమాజానికి పునాదిరాళ్లుగా నిలిచిన నిమ్న వర్గాల ఉన్నతి కోసం పాటుపడిన ఫూలేకి.

19వ శతాబ్దంలో దళితుల పరిస్థితి కడు దీనంగా ఉండేది. జీవితాలు చాలా దుర్భరంగా ఉండేవి. అడుగడుగునా అవమానాలు ఎదురవుతూ ఉండేవి. ఇలాంటి సామాజిక నేపథ్యంలో ఫూలే 1827, ఏప్రిల్ 11న ప్రస్తుత మహారాష్ట్రలోని సతారా జిల్లాలో జన్మించారు. చిన్నతనంలోనే తల్లిని కోల్పోవటం ఆయన జీవితంలో ఒక విషాదం. ఆ రోజుల్లో పాఠశాల విద్య అతి కొద్ది మందికి మాత్రమే అందుబాటులో ఉండేది. అణగారిన వర్గాల కోసం కొన్ని ప్రాంతాల్లో క్రైస్తవ మిషనరీలు పాఠశాలలను ప్రారంభించాయి. ఫూలే అలాంటి ఒక పాఠశాలలో విద్యను అభ్యసించాడు. ఆ సమయంలో ఒక రోజు తన స్నేహితుడి పెళ్లికి వెళ్లాడు. ఆ స్నేహితుడు బ్రాహ్మణుడు. పెళ్లి ఊరేగింపులో స్నేహితుడి కుటుంబ సభ్యులు కొందరు ఫూలేను తీవ్రంగా అవమానించారు. అది ఫూలే జీవితాన్ని మలుపు తిప్పింది. సమాజంలోని శూద్రులు, అతి శూద్రులకు ప్రతి రోజు ఎదురవుతున్న కుల వివక్షపై స్పష్టత రావటానికి ఈ వ్యక్తిగత అనుభవం ఆయనకు ఒక పునాది. 1840లో 13వ ఏట ఫూలేకు సావిత్రి బాయితో వివాహం జరిగింది. ఈ వివాహం ఆయన జీవితాన్ని మరో మలుపు తిప్పింది. శూద్ర, అతిశూద్రుల పరిస్థితులు బాగుపడాలంటే విద్యను ఒక ఆయుధంగా మలుచుకోవాలని ఫూలే భావించాడు. విద్య వల్ల సామాజిక పరిస్థితుల పట్ల అవగాహన కలగటమే కాకుండా.. కలిసి చేయాల్సిన పోరాటానికి నేపథ్యం ఏర్పడుతుందనేది ఆయన భావన. ఈ దిశగా ఆయన 1848లో అంటరాని బాలికల కోసం ఒక పాఠశాలను స్థాపించాడు. ఆ సమయంలో అది ఒక విప్లవం. ఈ పాఠశాల విజయం సాధించటంతో రెండో పాఠశాలను కూడా మొదలుపెట్టాడు. పగటిపూట పనికి వెళ్లే బాలికలు చదువుకోవటం కుదరదు కాబట్టి 1855లో రాత్రి బడులు ప్రారంభించాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు మదింపు చేసుకుంటూ దానికి తగినట్లు వ్యూహాలను రచించటంలో ఫూలే విజయం సాధించాడు.

> **జ్యోతిబా ఫూలే ఆలోచనలు ఈ రోజుకు అణగారిన వర్గాలలో స్ఫూర్తిని రగిలిస్తున్నాయి. వర్తమాన సమాజంలో జ్యోతిబా ఫూలే ఆలోచనలకు చాలా ప్రాధాన్యం ఉంది. చాలాకాలంగా వెనకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూసే అలవాటు ప్రబలంగా ఉంది. ఈ దృష్టి కోణాన్ని మార్చుకొని వారికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చేయాలి.**



అణగారిన వర్గాల అభివృద్ధిలో స్త్రీ పురుషుల వివక్ష కూడా కారణమని ఆయన భావించాడు. మహిళలకు సాధికారత లభిస్తే వారు మంచి విలువలు కలిగిన సమాజానికి ఆలంబనగా నిలుస్తారని నమ్మాడు. 19వ శతాబ్దంలో మన దేశంలో బాల్య వివాహాలు ఎక్కువగా ఉండేవి. భార్యాభర్తల మధ్య వయస్సు వ్యత్యాసం ఎక్కువ ఉండటం వల్ల భర్తలు త్వరగా మరణించేవారు. మహిళలు వితంతువులుగా మారేవారు. వీరి పట్ల సమాజంలో చాలా చులకన భావం ఉండేది. వీరికి రెండో వివాహం చేయటానికి ఫూలే పూనుకున్నాడు. వితంతు పునర్వివాహాల వల్ల అనేక మంది మహిళల జీవితాలు బాగుపడ్డాయి. అలాంటి మరో సున్నితమైన సమస్య వితంతువులు గర్భిణులు కావటం. చాలా మంది వితంతువులు గర్భస్రావం చేయించుకోవటానికి ప్రయత్నించేవారు. వీరిలో చాలా మంది మరణించేవారు కూడా! ఫూలే వీరికి అండగా నిలవటంతో పాటు వితంతు గర్భస్రావ వ్యతిరేక కేంద్రాన్ని స్థాపించాడు. ఈ సమస్యపై పోరాడిన తొలి వ్యక్తి ఫూలే.

మానవ ప్రస్థానంలో 'సత్యం.. సమానత్వం' అనేవి రెండు ప్రాథమిక సూత్రాలని.. అణగారిన ప్రజలు అభివృద్ధి చెందటానికి ఇవే ప్రాతిపదికలని భావించి 'సత్యశోధక్ సమాజ్' అనే సంస్థను ఫూలే ప్రారంభించాడు. వర్ణ వ్యవస్థలో అనేక అవమానాలకు గురయినవారు, అగ్రకులాల ఆధిపత్యం వల్ల బానిసలుగా మారినవారు, బానిసత్వమే తమ జీవనమనే అమాయక భావనలలో ఉన్నవారిలో చైతన్యాన్ని తీసుకురావటమే ఈ సంస్థ ఉద్దేశం. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా ఫూలే రాసిన 'గులాంగిరి'లోని భావనలు కొన్ని కోట్ల మందిలో ఆలోచనలు రేకెత్తించాయి. వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడేలా చేశాయి. తన జీవితం మొత్తం నిమ్న కులాల ఆత్మగౌరవం కోసం పోరాడిన ఫూలే 1890, నవంబర్ 28న కన్నుమూశారు. ఫూలే మరణించి 130 ఏళ్లు దాటినా ఆయన ఆలోచనలు ఈ రోజుకు అణగారిన వర్గాలలో స్ఫూర్తిని రగిలిస్తున్నాయి. కోట్లాది ప్రజలు ఆయనను మహాత్ముడిగా కొలుస్తున్నారు.

వర్తమాన సమాజంలో జ్యోతిబా ఫూలే ఆలోచనలకు చాలా ప్రాధాన్యం ఉంది. చాలాకాలంగా వెనకబడిన వర్గాలను కేవలం ఓటు బ్యాంకులుగా చూసే అలవాటు ప్రబలంగా ఉంది. ఈ దృష్టి కోణాన్ని మార్చుకొని వారికి కూడా ప్రభుత్వ ఫలాలు అందేలా చేయాలి. నిరుపేద బీసీలకు మోడల్ స్కూల్స్ ప్రారంభించటం, ఉన్నత విద్యా సంస్థల్లో చదువుకొనేలా స్కాలర్‌షిప్‌లు ఇవ్వటం, సంప్రదాయ వృత్తులలో ఉన్నవారికి అత్యాధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించి వారి ఉత్పత్తులు అంతర్జాతీయ స్థాయికి చేరేలా చేయటం, బ్యాంకుల నుంచి రుణాలు అందించటం... మొదలైన కార్యక్రమాలు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా అందిస్తున్నాం. ఇవన్నీ వెనకబడిన వర్గాల వారికి ఉపకరమవుతాయి. వీటితో పాటు సమానత్వం అనేది అన్ని వర్గాల వారిలో ఒక కుటుంబ విలువగా మార్చేందుకు కృషి చేయాలి. సత్యశోధక్ సమాజ్ వంటి సంస్థలు దీనికి మరింత చేయూత నివ్వాలి. అప్పుడే ఫూలే కలలు కన్న సత్యం, సమానత్వం సాధించగలుగుతాం.



▪ **పొన్నం ప్రభాకర్**
తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

(నేడు జ్యోతిబా ఫూలే జయంతి)



అందంగా..

వెలిగిపోతున్న భవానీ ఐల్యాండ్







- వరదల అనంతరం కొత్తరూపు
- ఐదడుగుల మేర పేరుకున్న ఇసుక
- 90 శాతం పూర్తయిన తొలగింపు పనులు
- త్వరలోనే పూర్తిస్థాయిలో అందుబాటులోకి..





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : భవానీ ద్వీపానికి ఎట్టకేలకు విముక్తి కలిగింది. భారీ వరదలకు ఇసుక మేటలతో నిండిపోయిన ద్వీపం పునరుద్ధరణ పనులు తుదిదశకు చేరుకున్నాయి. ఐదడుగుల ఎత్తున భవానీ ద్వీపాన్ని కప్పేసిన ఇసుకను వందలాది ట్రాక్టర్ల ద్వారా తొలగించారు. దీంతో భవానీద్వీపం కొత్తరూపాన్ని సంతరించుకుంటోంది. ఇసుక మేటల తొలగింపుతో పాత్‌వేలు బయట పడ్డాయి. జంగిల్ ఏరియాలోని

మిగతా 6లో..



కేసరపల్లి నుంచి గన్నవరానికి..

మెట్రో కోచ్ డిపో స్థలం మార్పు

గన్నవరంలో ప్రభుత్వ భూముల గుర్తింపు

రూ.100 కోట్ల వరకు ఖర్చు ఆదా

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రో కోచ్ డిపోకు అవసరమైన భూములను గన్నవరంలో తీసుకోవాలని ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు భావిస్తున్నారు. ముందుగా కేసరపల్లిలో తీసుకోవాలని నిర్ణయించినా, కేసరపల్లిలో ప్రైవేట్ భూముల ధరలు గరిష్ఠంగా ఉండటం వల్ల గన్నవరంలో ప్రభుత్వ భూములు గుర్తించారు. మెట్రో కోచ్ డిపోకు దాదాపు 60 నుంచి 70 ఎకరాలు అవసరం. కేసరపల్లి దగ్గర భూముల విలువ దాదాపు రూ.100 కోట్లు ఉంటుంది. తాజాగా ఏపీఎంఆర్‌సీ అధికారులు గన్నవరంలో చూసిన భూముల కారణంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి అదనపు ఖర్చు పడదు. రూ.100 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదా అవుతుంది. విజయవాడ మెట్రోకు ప్రధానమైన మొదటి కారిడార్ గన్నవరం బస్టాండ్ నుంచి ప్రారంభమవుతుంది. కేసరపల్లిలో కోచ్ డిపో ఏర్పాటు చేస్తే ఇక్కడి నుంచి మళ్లీ గన్నవరం బస్టాండ్ వరకు వెళ్లి తిరిగి వెనక్కి రావాల్సి ఉంటుంది. అదే గన్నవరం అవతల భూములను తీసుకుంటే నేరుగా గన్నవరం బస్టాండ్ నుంచే మెట్రో కోచ్‌లు బయల్దేరే అవకాశముంటుంది. విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు కోసం మొత్తం 82 ఎకరాల భూములు అవసరం అవుతుండగా, 85 శాతానికి పైగా భూములు ఒక్క కోచ్ డిపోకే కావాలి. ఇవన్నీ ప్రభుత్వ భూములే కావడంతో చాలావరకు ప్రభుత్వంపై ఖర్చు తగ్గినట్టే.

ఐస్‌క్రీమ్‌లో సైనైడ్ కలిపి తిని..

తండ్రీ తనయుల బలవన్మరణం

అప్పుల బాధలు తట్టుకోలేకే..

- ఐస్‌క్రీమ్‌లో సైనైడ్ కలిపి కుమారుడికి తినిపించిన తండ్రి
- తాను కూడా తిని ఆత్మహత్య
- యనమలకుదురులో విషాదం





మృతులు తక్షిల్, సాయిప్రకాశ్‌రెడ్డి (ఫైల్)

పెనమలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : కన్నబిడ్డకు గోరుముద్దలు తినిపించాల్సిన ఆ తండ్రి గుండెల్లో బాధను తొక్కిపెట్టి, సైనైడ్ కలిపిన ఐస్‌క్రీమ్‌ను తినిపించి తానూ తిన్నాడు. తన కష్టాలు తనయుడికి కలగకూడదనుకున్నాడో ఏమో తన వెంటే తనయుడ్ని కూడా తీసుకెళ్లిపోయాడు. హృదయవిదారకమైన ఈ విషాద సంఘటన యనమలకుదురులో జరిగింది. వివరాల్లోకి వెళితే.. వన్‌టౌన్‌లో బంగారం పనులు చేసే సాయిప్రకాశ్ రెడ్డి భార్య, పిల్లలతో యనమలకుదురు వినోద్ పబ్లిక్ స్కూల్ రోడ్డులో ఉంటున్నాడు. భార్య లక్ష్మీభవాని గాంధీనగర్‌లోని ఓ మెడికల్ షాపులో పనిచేస్తోంది. వారికి 11 ఏళ్ల పాప, ఏడేళ్ల బాబు తక్షిల్ సంతానం. కరోనా సమయంలో సరిగ్గా వ్యాపారం, పనులు లేక రూ.10 లక్షల వరకు అప్పు య్యాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక కొద్దిరోజులుగా మనస్తాపానికి గురవుతున్నాడు. భార్య సముదాయించినా లోలోపల కుమిలిపోతూనే ఉన్నాడు. కాగా, బుధవారం భార్యాభర్తలు ఎవరి పనులకు వారు వెళ్లి మధ్యాహ్న సమయంలో ఇంటికి వచ్చారు. ఒంటిపూట బడులు

మిగతా 6లో..

దొంగబిల్లుల దోపిడీ..!

కార్పొరేషన్‌లోని పాలకపక్షం బరితెగింపు

నేటి స్టాండింగ్ కమిటీ ముందుకు దొంగబిల్లులు

అప్పనంగా ప్రభుత్వ డబ్బు కొట్టేయటానికి విజయవాడ కార్పొరేషన్‌లోని వైసీపీ పాలకపక్షం వేసిన స్కెచ్ చూస్తే దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయిపోతుంది. 2020లో వైసీపీ హయాంలో జరిగిన స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమానికి సంబంధించిన అక్రమ బిల్లులను కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లింపులు చేసేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తోంది. ఈ అక్రమ బిల్లులను సక్రమం చేసుకునేందుకు స్టాండింగ్ కమిటీ అజెండాలో చేర్చింది. శుక్రవారం మేయర్ అధ్యక్షతన జరగనున్న స్టాండింగ్ కమిటీలో ఈ అంశం ప్రధానంగా చర్చకు రానుండగా, దీనివెనుక పాలకపక్షానికి లబ్ధి కలిగేలా భారీ ముడుపుల వ్యవహారాలు, అవకతవకలు ఉన్నాయన్న ఆరోపణలు వస్తున్నాయి. రూ.కోటి కథ కూడా దీని వెనుకే నడుస్తోందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

- 2020లో పారిశుధ్య నిర్వహణకు 150 మంది కార్మికులు
- సగంమందితో పనిచేయించి 150 మందికీ బిల్లులు
- మరో పారిశుధ్య కార్యక్రమంలోనూ ఇదే పరిస్థితి
- నాటి బిల్లులను నేడు ఆమోదించుకునే కుట్ర
- రూ.లక్షల్లో దోచేసేందుకు ప్రయత్నాలు
- వీటి ఆమోదం తర్వాత మరో పెద్ద ఫైల్‌కు స్కెచ్
- వరదల సమయంలో పనివారి బిల్లులు రూ.కోటి
- తక్కువ మందితో పనులు.. ఎక్కువ మందిగా లెక్కలు



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 2020లో విజయవాడ కార్పొరేషన్‌లోని ప్రజారోగ్యశాఖ నేతృత్వంలో స్వచ్ఛత సర్వేక్షణ్ పేరుతో నగరంలోని పలు డివిజన్లలో శానిటేషన్ పనుల కోసమని కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు 150 మందిని తీసుకునేందుకు ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఆ ఏజెన్సీ నడుపుతున్న కాంట్రాక్టర్ దాదాపు వారం పాటు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. కానీ, కార్పొరేషన్ నిర్దేశించిన 150 మంది కాకుండా, అందులో సగంమంది మాత్రమే పనిచేశారు. ప్రజారోగ్యశాఖ అధికారులు మాత్రం మొత్తం పనిచేసినట్టుగా ఫైల్‌ను తయారు చేశారు. ఈ వ్యవహారంలో ప్రజారోగ్యశాఖలోని సెక్షన్ ఉద్యోగి ఒకరు చక్రం తిప్పినట్టుగా తెలుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రజారోగ్యశాఖాధికారిణి హస్తం కూడా ఇందులో ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పనిచేసిన ఒక్కో సిబ్బందికి రోజుకు రూ.400 ప్రాతిపదికన చెల్లించాలి. ఈ లెక్కన అందరూ పనిచేస్తే రోజుకు రూ.60 వేల చొప్పున ఏడు రోజులకు రూ.4.20 లక్షలు చెల్లించాలి. ఇలా ఏడు రోజులకు తీసుకున్న వారిని 21 రోజుల పాటు ఉపయోగించుకున్నారు. 21 రోజులకు కలిపి రూ.16.80 లక్షలు చెల్లించేందుకు

మిగతా 6లో..

రూ.కోటి కొట్టేసే కుట్ర

వరదల సమయంలో పారిశుధ్య నిర్వహణ కోసం 250 మందిని తీసుకోవటానికి నామినేషన్ ప్రాతిపదికన మరో ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో ఇంజనీరింగ్ విభాగం వీరిని నియమించింది. క్షేత్రస్థాయిలో కేవలం 100 మందిలోపే పనిచేశారన్న ఆరోపణలు ఉన్నాయి. కానీ, 250 మంది పనిచేసినట్టుగా బిల్లులు పెట్టుకోవటానికి సిద్ధం చేశారు. ఈ ఫైల్ విలువ రూ.కోటికి పైగా ఉంటుంది. ఈ ఫైల్‌ను ఆమోదించటానికి వీలుగా ముందుగా పై రెండు ఫైళ్లను గప్‌చుప్‌గా పరిష్కరించాలనుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇవి ఆమోదం అయిపోతే, ఆ తర్వాత రూ.కోటి ఫైల్‌ను కూడా ఆమోదించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రజారోగ్యశాఖలో పనిచేసే ఉద్యోగి ఈ ఒప్పందాన్ని నడిపినట్టుగా తెలుస్తోంది.



లారీ నుంచి పడిన వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

హైదరాబాద్ టు విజయవాడ..

మాంసం వ్యర్థాల అక్రమ రవాణా!

రెండు జిల్లాల చేపల చెరువులకు యజమానుల దిగుమతి

- రోజూ హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా 50 లారీలు
- వినియోగంపై నిషేధం ఉన్నా బేఖాతరు.. చర్యలు శూన్యం

6లో

ఆయిల్‌హబ్ కొండపల్లి..!

ఇక ఆయిల్, గ్యాస్‌కు ప్రధాన కేంద్రంగా మారనున్న చారిత్రక ప్రాంతం

- సీఆర్‌డీఏ పరిధిలో ఉండటం ప్లస్ పాయింట్
- ఐవోసీఎల్, బీపీసీఎల్‌కు హెచ్‌పీసీఎల్ సంస్థలన్నీ ఇక్కడే
- ఇక్కడి నుంచే రాష్ట్రం మొత్తానికి గ్యాస్, ఆయిల్ సరఫరా

8లో

సరిహద్దుల్లో స్థావరాలు

కాకినాడ టూ గన్నవరం ఐపీఎల్ బెట్టింగ్



- పోలీసుల అదుపులో ఎనిమిది మంది
- రూ.2.90 లక్షలు, ఇతర వస్తువులు సీజ్
- కాకినాడలోని ప్రధాన బుకీ పరార్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లో ప్రధాన బుకీలు, సబ్ బుకీలకు కృష్ణాజిల్లా కేంద్రంగా మారుతోంది. సరిగ్గా సరిహద్దుల్లో పాగా వేసిన బుకీలు ఐపీఎల్‌లో పందేలను పరుగులు తీయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అవనిగడ్డకు చెందిన ఐదుగురు బుకీలు, పంటర్లను విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. తాజాగా గన్నవరం కేంద్రంగా బెట్టింగ్‌లను జోరుగా నిర్వహించిన ఎనిమిది మంది గ్యాంగ్‌ను అదుపులోకి తీసుకున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. బుకీలను పట్టుకున్న తర్వాత దర్యాప్తు చేస్తున్న పోలీసులకు కొత్తకొత్త విషయాలు తెలుస్తున్నాయి. జిల్లాలో మండల, గ్రామీణ స్థాయిలో సబ్ బుకీలు, పంటర్లకు పెద్ద నెట్‌వర్క్ నడుస్తున్నట్టు గుర్తించారు.

కాకినాడతో ప్రధాన బంధం

కిరణ్, కొసరాజు వెంకట సూర్యారావుకు కాకినాడకు చెందిన ఓ వ్యక్తితో సంబంధాలు ఉన్నాయని పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకోవడానికి ప్రయత్నాలు చేస్తుండగా, ఆ వ్యక్తి సెల్‌ఫోన్‌ను స్విచ్ఛాఫ్ చేసి పరారైనట్టు సమాచారం. పోలీసులు గాలిస్తున్నారు.

'రాధే'లో రయ్‌రయ్..

గన్నవరంతో పాటు మండలంలోని అల్లాపురం, అజ్జంపూడి గ్రామాల్లో ఉన్న బుకీల నెట్‌వర్క్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు బట్టబయలు చేశారు. పటమట పోలీసు స్టేషన్ పరిధిలోని సరిహద్దులకు వచ్చి బెట్టింగ్‌లు

మిగతా 6లో..



సమ్మర్ స్పెషల్ రైళ్లు

8లో

అమరావతి వరద ముంపు

నివారణ కాల్వ పనుల పరిశీలన

- వేగం పెంచాలని సూచించిన ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి

దడ పుట్టిస్తోన్న పసిడి!

- ఒక్కరోజే 3 వేలు పెరిగిన ధర
- సామాన్య, మధ్య తరగతికి అందని ద్రాక్షలా..
- ఈ నెలలో పెళ్లి ముహూర్తాలపై ఆశలు

6లో





నిరంజనానందకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామచంద్ర

దుర్గమ్మ సేవలో స్వామి నిరంజనానంద

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను గురువారం సత్యానంద యోగాశ్రమం పీఠాధిపతి స్వామి నిరంజనానంద దర్శించుకున్నారు. దేవదాయ కమిషనర్, ఈవో రామచంద్రమోహన్, స్థానాచార్యుడు శివప్రసాదశర్మలు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనం.. ఈవో అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



తెలంగాణ, ఏపీ ఎన్నికల కమిషనర్లు రాణి కుముదిని, నీలం సాహ్నిలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న అర్చకులు, ఏఈవో

దుర్గమ్మను దర్శించుకున్న ఎన్నికల కమిషనర్లు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు నీలం సాహ్ని, రాణి కుముదినిలు గురువారం దర్శించుకున్నారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, ప్రధాన అర్చకుడు దుర్గాప్రసాద్, ఏఈవో చంద్రశేఖర్‌లు వారికి సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం, ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

- సత్యనారాయణపురానికి చెందిన మాల్యాద్రి గురువారం కుటుంబసభ్యులతో కలిసి అన్నవితరణకు రూ1,11,116 విరాళం అందజేశారు.
- దుర్గగుడిలో చైత్రమాస బ్రహ్మోత్సవాల క్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి 10.30 గంటలకు గంగాపార్వతి,మల్లేశ్వరుల దివ్య లీలా కల్యాణోత్సవం జరగనున్నది. అంతకుముందు 7.30 గంటలకు ఎదుర్కోల ఉత్సవం జరుగుతుంది. ప్రముఖ కవి, పండితులు దుర్గామల్లేశ్వరుల వైభవం తదితరాల గురించి వర్ణిస్తారు.



సొసైటీ భవనంలో అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కొండపల్లి బొమ్మ ఖ్యాతిని చాటి చెప్పాలి

▸▸ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ సందర్శనలో కలెక్టర్ లక్ష్మీశ

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : హస్త కళాకారుల చేతుల నుంచి జీవం పోసుకుంటూ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కొండపల్లి బొమ్మ ఔన్నత్యాన్ని నేటి తరానికి చాటి చెప్పేలా వన్నె తగ్గని సృజనాత్మక సంపదను భావి తరాలకు అందించేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ చెప్పారు. గురువారం ఆయన పలుశాఖల అధికారులతో కలిసి కొండపల్లిలో పర్యటించారు. హస్తకళాకారుల సొసైటీ భవనాన్ని పరిశీలించి చేపట్టాల్సిన పనులపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందేందుకు అపార అవకాశాలున్నాయన్నారు. భౌగోళిక, ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక ఔన్నత్యమున్న జిల్లాను పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్యాకేజీలను రూపకల్పన చేసినట్టు తెలిపారు. దీనిలో భాగంగా శతాబ్దాల చారిత్రక వారసత్వానికి సజీవ సాక్ష్యంగా ఉన్న కొండపల్లి బొమ్మ విశిష్టతను పర్యాటకులకు చాటిచెప్పేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. సొసైటీ భవనంలో మౌలిక వసతులను అభివృద్ధి చేసి, సుందరీకరణ పనులు చేపట్టి ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. బొమ్మ చారిత్రక వైభవం, బొమ్మల తయారీకి ఉపయోగించే తెల్లపొణికి చెక్క, అత్యంత ప్రాచుర్యం పొందిన బొమ్మలు తదితర విశేషాలను కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రత్యేక అనుభూతి పొందేలా పర్యాటకులకు వివరించేందుకు ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఉపయోగపడుతుందన్నారు. కొండపల్లి పర్యాటకులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కావూరి చైతన్య, జిల్లాపర్యాటక అధికారి శిల్ప, కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తదితరులు పాల్గొన్నారు.

50శాతం రాయితీతో విద్యుత్ లోడు క్రమబద్ధీకరించుకోండి

▸▸ ట్రాన్స్‌కో ఏఈ దేవదాసు

తోట్లవల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : గృహ విద్యుత్ వినియోగదారులు అదనపు విద్యుత్ లోడును జూన్ 30లోగా స్వచ్ఛందంగా క్రమబద్ధీకరణ చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈ దేవదాసు కోరారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్(సీపీడీసీఎల్) వినియోగదారులకు భారం తగ్గించే విధంగా 50శాతం రాయితీని ప్రకటించిందని, దీనికి ఈ ఏడాది జూన్ 30 వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఎవరు ఎంత లోడు వినియోగించుకుంటున్నారో తెలియజేస్తే అందుకు తగ్గట్టుగా ఆయా ప్రాంతాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్ అందించే అవకాశం తమకు కలుగుతుందన్నారు. 1 కిలో వాట్‌కి అసలు ధర రూ. 2,250 ఉందని, 50 శాతం రాయితీ కింద రూ 1,250 తగ్గింపు అవకాశాన్ని కల్పించినట్టు ఏఈ వివరించారు. ప్రతివినియోగదారుడు స్వచ్ఛందంగా అదనపు లోడుని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. జూన్ 30 తరువాత తమ సిబ్బంది ఇంటింటికి వచ్చి తనిఖీల్లో అదనపు లోడు గుర్తిస్తే 100 శాతం చెల్లించాల్సిందేనని చెప్పారు.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు

▸▸ ఈ నెల 15 నుంచి 8,9,10 ప్లాట్ ఫాంల మూసివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పునరుద్ధరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 15 నుంచి 8,9,10 ప్లాట్ ఫాంలను మూసివేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. 8,9,10 ప్లాట్‌ఫాంల మరమత్తుల నేపథ్యంలో రైళ్లను 5,6,7 ప్లాట్ ఫాంల మీదుగా దారి మళ్లిస్తున్నట్లు చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పనులు జరుగుతున్న కారణంగా ఇప్పటికే కొన్ని రైళ్లు కాచిగూడ రైల్వేస్టేషన్ నుంచి, మరికొన్ని రైళ్లు చర్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాయి. రైళ్ల స్టేషన్ మార్పిడి విషయాన్ని రిజర్వేషన్ చేసుకున్న ప్రయాణికులకు చరవాణీ ద్వారా సమాచారం అందిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ప్రయాణికులు వాటిని జాగ్రత్తగా చూసుకోవాలని వారు సూచించారు. కాగా, ఈ నెల 15 నుంచి సికింద్రాబాద్ నుంచి ఏయే రైళ్లు నడవనున్నాయో సమాచారం లేదు.



దడ పుట్టిస్తోన్న పసిడి!

▸▸ ఒక్కరోజే 3 వేలు పెరిగిన ధర

▸▸ సామాన్య, మధ్య తరగతికి అందని ద్రాక్షలా..

▸▸ ఈ నెలలో పెళ్లి ముహుర్తాలపై ఆశలు

▸▸ వ్యాపారాలపై తీవ్ర ప్రభావం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

'అక్కా బంగారం కొనాలి షాపుకు వెళదాం వస్తావా.. పక్కింటి ఆవిడ దగ్గరకు వెళ్లి అడిగింది బంగారం కొనాల్సిన మహిళ! ఇప్పుడెందుకమ్మా ధరలు బాగా ఉన్నాయిగా.. అయినా తప్పదు.. మా బంధువుల ఇంట్లో శుభాకార్యం. వారు తులం రూ.30 వేలు ఉన్నపుడు పెట్టారు. ఇప్పుడు రూ. 85 వేలకు చేరింది.. ఏం చేస్తాం..! పెట్టాలిగా.' బంగారం ధరలపై సామాన్య, మధ్య తరగతి వాళ్ల మధ్య సంభాషణ ఇది. బంగారం కొందామా.. లక్షకు చేరుతుందంటా.. ఇపుడే కొంటే పోలా.. మొన్న వరుసగా రెండ్రోజులు తగ్గింది.. మళ్లీ తగ్గుతుందేమో అప్పుడు కొందాం.. పసిడి ప్రియుల మధ్య సందిగ్ధధోరణి!

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో సామన్య, మధ్యతరగతి వర్గాలు పసిడి పరుగుపై ఆందోళన చెందుతున్నాయి. రెండ్రోజుల క్రితం తగ్గినట్టే తగ్గిన ధర గురువారం రికార్డు స్థాయిలో పెరిగిపోయింది. బుధవారం 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.90,440లు ఉండగా గురువారం రూ.93,380లకు చేరింది. 22 క్యారెట్ల తులం బంగారం ధర బుధవారం రూ.82,900 ఉండగా గురువారం రూ.85,600లకు చేరుకుంది. అంతర్జాతీయ బులియన్ మార్కెట్ దేశంలో బంగారం ధరలపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి బంగారం ఇప్పటికే 17సార్లు ఆల్‌టైమ్ రికార్డును తాకింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బంగారు ఆభరణాల దిగుమతులపై సుంకాలు విధించడంతో పసిడి పరుగులు తీస్తోంది. దీంతో బంగారం కొనేవారి సంఖ్య తగ్గింది. మరోవైపు ఏప్రిల్‌లో పెళ్లి ముహూర్తాలు ఉండటంతో బంగారం కొనక తప్పని పరిస్థితి. మొత్తం మీద బంగారం ధరల విషయంలో ప్రజలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు.

పెట్టిపోతలకు తప్పడంలేదు

\- సుంద్రా తిరుపతమ్మ, కూనపరాజుపర్వ, రెడ్డిగూడెం



తాళిబొట్టు కొనుగోలు కోసం వచ్చాం. అదిరిపోయే ధర ఉంది. కాసు కూడా కొనేలా లేదు. రెండ్రోజుల క్రితం 2వేలు తగ్గింది. మరింత తగ్గుతుందని ఆశించాం. తగ్గకపోగా 3 వేలు పెరిగింది. ఇలా అయితే బంగారం కొనలేం. అలాగని మానుకోలేం. శుభకార్యాలలో అప్పు చేసయినా వస్తువు పెట్టాల్సిన పరిస్థితి.

ధరలు తగ్గితే బాగుంటుంది

\- జి.శ్రీరామ్ ఎ.కొండూరు, కుమ్మరికుంట్ల



ధరలు సామాన్యులు అందుబాటులో లేవు. సోదరుడి పెళ్లి ఉంది. 10 కాసులతో వస్తువు పెడదాం అనుకున్నా. ధర పెరగడంతో కేవలం ఆరేడు కాసులు మాత్రమే ఆర్డర్ ఇచ్చాను. పెట్టిపోతలకు బంగారం కొనక తప్పని పరిస్థితి.

వ్యాపారాలపై తీవ్ర ప్రభావం

\- కుక్కడపు వెంకట నాగేశ్వరరావు, వ్యాపారి

గ్రామాల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి వారే బంగారం కొనుగోలు చేస్తుంటారు. ధరలు పెరగడం వల్ల పదికాసులు కొనే వారు ఐదారు కాసులు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మూడు నెలల నుంచి ధరలు పెరుగుతూ ఉండటంతో వ్యాపారాలు లేవు. వినియోగదారుడు ఆర్డర్ ఇచ్చినపుడు ధర తక్కువగా ఉండి, వస్తువు తీసుకునే సమయానికి ధర పెరడం వల్ల నష్టాలు తప్పడం లేదు. మూడు నెలలు నష్టాలు భరించాం. పెళ్లిళ్ల సీజన్ ప్రారంభం కావడంతో వ్యాపారాలు బాగుంటాయేమో చూడాలి.



15 నుంచి చేపల వేటపై నిషేధం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మత్స్య సంపద పరిరక్షణ, ప్రభావవంతమైన నిర్వహణ కోసం ఏపీ తీరంలోని ప్రాదేశిక జలాల్లో ఈ నెల 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ మేరకు గురువారం నోటిఫికేషన్ జారీ చేసింది. సాంప్రదాయ పడవలు మినహాయించి, ఔట్ బోర్డ్, ఇన్ బోర్డ్ ఇంజన్లు అమర్చిన మోటరైజ్డ్, మెకనైజ్డ్ బోట్లతో ఈ 61 రోజుల పాటు తూర్పు తీర సముద్ర జలాల్లో మత్స్య సంపద వేటపై నిషేధం అమలులో ఉంటుందని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం పేర్కొంది.

మూడు పంటలతో స్థూల ఆదాయం: అగ్రి డైరెక్టర్

అమరావతి : వ్యవసాయ పంటల ద్వారా రాష్ట్ర స్థూల ఆదాయం పెంపునకు కృషి చేయాలని, స్థూల విలువ పెంపుదలకు చేపట్టాల్సిన కార్యాచరణపై వర్క్‌షాప్‌లు నిర్వహించాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు జిల్లా వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, విత్తనాభివృద్ధిశాఖ అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వ్యవసాయ భూముల్లో పంటల సాంద్రత ఎక్కువగా ఉంచడం, స్వల్ప, మధ్యకాలిక పంటలతో ఏడాదిలో మూడు పంటల సాగు విధానం, అంతర పంటలు, మిశ్రమ పంటల ద్వారా స్థూల విలువ పెంపుదలకు దోహదం చేసేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. మార్చి నుంచి జూన్ వరకు బోర్లు, పంపు సెట్ల కింద వేసవి పంటల సాగు విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు.

50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

అమరావతి : డీ కృషి యాప్ ద్వారా రైతులకు 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలను సరఫరా చేయనున్నట్టు వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. పిల్లిపెసర 2 కిలోలు, జీలుగ, జనుము 4 కిలోల చొప్పున తొలిసారి 10 కిలోల ప్యాకింగ్‌లో పచ్చి రొట్ట విత్తనాల మిశ్రమం, ఐదెకరాలకు మించకుండా రాయితీపై సరఫరా చేస్తామన్నారు.

21న మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి ప్రవేశాలకు ఈ నెల 20న నిర్వహించదలచిన ప్రవేశ పరీక్షను 21వ తేదీకి మార్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వి.విజయరామరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పర్వదినం రావడంతో ఈ మేరకు మార్పు చేసినట్టు తెలిపారు.

ఉపాధ్యాయులకు పారితోషికం చెల్లించాలి : ఏపీటీఎఫ్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా పత్రాల మూల్యాంకనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఇతర సిబ్బందికి వెంటనే పారితోషికాలు చెల్లించాలని ఏపీటీఎఫ్-1938 అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయరాజు, ఎస్.చిరంజీవి కోరారు. గురువారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డిని కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. రూ.35 కోట్లు త్వరలో విడుదల చేస్తామని వారికి ఆయన హామీ ఇచ్చారు.

ఎన్ఈపీ అమలుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో జాతీయ విద్యా విధానం అమలుకు పాఠశాల విద్యాశాఖ స్టేట్ టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. ఈ కమిటీకి పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ చైర్మన్‌గా ఉన్నారు. ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఆ శాఖ కమిషనర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, ఇతర అధికారులు సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలో ఎన్ఈపీ అమలు ఎంతవరకు వచ్చింది? మొత్తం విధానం అమలుచేసేందుకు ఇంకా చేపట్టాల్సిన చర్యలపై ఈ కమిటీ కసరత్తు చేస్తుంది.

సరిహద్దుల్లో స్థావరాలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్న సబ్ బుకీని అదుపులోకి తీసుకోగా, గ్యాంగ్ అసలు బాగోతం బయటపడింది. ఈ గ్యాంగ్‌కు సూత్రధారి కాకినాడకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అతడు తయారు చేయించిన రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో మొత్తం బెట్టింగ్ వ్యవహారం నడుస్తున్నట్టు నిర్ధారించారు. ఈ యాప్‌ను గన్నవరంలోని అల్లాపురానికి చెందిన కిరణ్, అజ్జంపూడికి చెందిన కొసరాజు వెంకట సూర్యారావును భాగస్వాములుగా తీసుకున్నారు. కిరణ్‌కు మచిలీపట్నంలో బంగారం పూత పనిచేసే కేతవరపు భానుప్రకాష్ బావమరిది అవుతాడు. మచిలీపట్నంలో పని లేకపోవడంతో కిరణ్ అతడిని గన్నవరం రప్పించుకున్నాడు. భాగస్వామిగా ఉన్న వెంకట సూర్యారావుతో భానుప్రకాష్‌కు లైన్ ఇప్పించాడు. భానుప్రకాష్.. ఎనికేపాడు సమీపంలోని ఓ పాఠశాల నుంచి బెట్టింగ్ నిర్వహిస్తుండగా, పక్కా సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. అతడి ఫోన్ ద్వారా ఒక్కో లింక్‌ను ఛేదించుకుంటూ వెళ్లిన పోలీసులు కిరణ్, అతడికి బెట్టింగ్ డబ్బును వసూలు చేసే బోస్ అనే వ్యక్తిని, బెట్టింగ్ ఆడుతున్న పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రవికుమార్‌ను అదుపులోకి తీసుకున్నారని తెలిసింది. ఇందులో కిరణ్‌కు భాగస్వామిగా ఉన్న కొసరాజు వెంకట సూర్యారావు.. పోలీసులను చూసి రెప్పపాటు వ్యవధిలో పరారయ్యాడు. ఈ నలుగురు కాకుండా గన్నవరంలో ఈ రాధే యాప్‌తో అనుసంధానమైన మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. యాప్‌లో ఉన్న ఖాతాలో మొత్తం రూ.2.90 లక్షల వరకు ఉన్నట్టు గుర్తించారు. వారి దగ్గర నుంచి ఓ ల్యాప్‌టాప్, 18 సెల్‌ఫోన్లు, రూ.12,000 స్వాధీనం చేసుకున్నారు. యాప్ ఖాతాలో ఉన్న నగదును స్తంభింప చేయించారు.

తండ్రీ తనయుల బలవన్మరణం

(5వ పేజీ తరువాయి)

కావడంతో పిల్లలు ఇంట్లోనే ఉన్నారు. తల్లి లక్ష్మీభవానీ తిరిగి మెడికల్ షాపునకు వెళ్లిపోయింది. కాగా, సాయంత్రం 4.30 గంటల సమయంలో సాయిప్రకాశ్‌రెడ్డి.. కుమారుడు తక్షిల్‌కు సైనైడ్ కలిపిన ఐస్‌క్రీమ్ తినిపించి తానూ తిన్నాడు. కాసేపటికే ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. స్థానికులు గమనించి వారిద్దరినీ పటమటలోని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం బుధవారం రాత్రి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి ఇద్దరూ మృతిచెందినట్లు తెలిపారు. సైనైడ్ సేవించే ముందు సాయిప్రకాశ్‌రెడ్డి తన స్నేహితుడు విజయ్‌కు ఒక మెసేజ్ చేశాడు. ఇద్దరం సైనైడ్ తిన్నామని, క్షమించమని మెసేజ్ పెట్టాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగబిల్లుల దోపిడీ..!

(5వ పేజీ తరువాయి)

స్థాయీ సంఘం ముందు ప్రతిపాదన పెట్టారు. వాస్తవానికి ఇందులో సగం మంది మాత్రమే పనిచేశారు. కాబట్టి బిల్లు రూ.8 లక్షల్లోపే చెల్లించాల్సి ఉంటుంది. కానీ, కార్పొరేషన్ వైసీపీ పాలకపక్షం మాత్రం తెలివిగా ఆ ఏజెన్సీతో డీల్ కుదుర్చుకుని మొత్తం పనిచేసినట్టుగా బిల్లు చెల్లించటానికి సిద్ధం కావటం గమనార్హం.

మరో కార్యక్రమంలో కూడా..

స్వచ్ఛత సర్వేక్షణ్‌లో భాగంగా నగరంలోని పలు డివిజన్లలో శానిటేషన్ పేరుతో నామినేషన్ ప్రాతిపదికన మరో ఏజెన్సీ నుంచి 150 మందిని పనివారిని తీసుకున్నారు. వీరిని కూడా అప్పట్లో వారం రోజులకే తీసుకున్నా 28 రోజుల పాటు కొనసాగించారు. వీరి ఏజెన్సీకి కూడా రూ.16.80 లక్షలు చెల్లించాలన్న ప్రతిపాదన తీసుకొచ్చారు. ఈ రెండు ఏజెన్సీలు కూడా క్షేత్రస్థాయిలో సగం సిబ్బందినే నియమించాయి. కానీ, పూర్తి సిబ్బంది ఉన్నట్టుగా బిల్లులు చెల్లించేందుకు పావులు కదిపారు. దొంగ బిల్లులు పెట్టుకోవటానికి సిద్ధమయ్యారని కమిషనర్ ధ్యానచంద్రకు ఫిర్యాదులు రావటంతో ఆయన చెల్లింపులకు సిద్ధపడలేదు. దీంతో తెలివిగా పాలకపక్ష సభ్యులు స్థాయీసంఘం దృష్టికి తీసుకొచ్చి ఆమోదింపజేసేందుకు పావులు కదిపారు. స్థాయీసంఘంలో కచ్చితంగా ఆమోదం పొందితేనే డబ్బు చెల్లించే వీలుంటుంది. కొన్ని సందర్భాల్లో కమిషనర్ ముందుగా డబ్బు చెల్లించినా వాటిని స్టాండింగ్ కమిటీ సమావేశంలో పెట్టి ర్యాటిఫై ప్రతిపాదనలు తీసుకొస్తారు. ఈ రెండు ప్రతిపాదనల పేరుతో రూ.16 లక్షలకు పైగా నొక్కేయటానికి వైసీపీ పాలకపక్షం కన్నేసింది.

'సిద్ధార్థ'లో ర్యాగింగ్ కలకలం

▸▸ 15 మందిని బయటకు పంపేసిన ప్రిన్సిపాల్

విజయవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : సిద్ధార్థ వైద్య కళాశాలలో ర్యాగింగ్ కలకలం రేపింది. ఈ విషయం బయటకు పొక్కకుండా, పోలీసులకు చేరకుండా కళాశాల అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. హాస్టల్‌లో ఉండే 15 మంది రెండో సంవత్సరం, మూడో సంవత్సరం విద్యార్థులను అధికారులు ఖాళీ చేయించారు. వారిని బయట హాస్టల్‌లో ఉండాలని ఆదేశించారు. ఫ్రెషర్స్‌ను ర్యాగింగ్ చేయడం వల్ల వారిని బయటకు పంపినట్టు తెలిసింది. అలాగే వారి తల్లిదండ్రుల నుంచి కూడా లెటర్లు తీసుకున్నారు. దీనిపై పోలీసులను అడగ్గా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు. మాచవరం పోలీసులు కళాశాల ప్రిన్సిపాల్‌ను ఫోన్‌లో సంప్రదించారు. హాస్టల్ నుంచి 15 మందిని బయటకు పంపిన విషయం వాస్తవమేనని ఆయన అంగీకరించినట్టు తెలిసింది. ర్యాగింగ్ జరిగిందని తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని కళాశాల అధికారులు చెబుతున్నారు.

చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోండి

సైబర్ పోలీసులకు వైసీపీ లీగల్ సెల్ ఫిర్యాదు

విజయవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ భారతిపై అసభ్యకరంగా వ్యాఖ్యలు చేసిన చేబ్రోలు కిరణ్‌పై చర్యలు తీసుకోవాలని వైసీపీ లీగల్ సెల్ నేతలు విజయవాడలోని సైబర్ క్రైం పోలీసులకు గురువారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. బసవారెడ్డి, వెంకటేశ్వరరావు సైబర్ క్రైమ్ ఎస్ఐ మూర్తిని కలిసి ఫిర్యాదు కాపీని అందజేశారు.

అందంగా..

(5వ పేజీ తరువాయి)

మిర్రర్ మేజ్, మేజ్ గార్డెన్, రోబోటిక్ పార్క్ వంటి వాటి దగ్గర కూడా ఇసుకను తొలగించి అభివృద్ధి చేశారు. మేజ్ గార్డెన్ ఏరియాలో చాలావరకు ఇసుక తొలగించినా.. మొక్కల మధ్యన ఉన్న పాత్‌వేలపై ఇసుక మేట వేయడంతో అక్కడ పనులు చేపట్టారు. కాగా, ఇటీవల ద్వీపాన్ని ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలాజీ సందర్శించారు. ఇదే సందర్భంలో కొత్తగా ఈడీగా ఉమామహేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఆయన నేతృత్వంలోనే ఈ అభివృద్ధి పనులు జరిగాయి. మరో 10 శాతం తొలగింపు పనులే మిగిలి ఉన్నాయి. ఇప్పటికే పర్యాటకుల రాకపోకలు మొదలు కాగా, వారంలో మేజ్ గార్డెన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. మ్యూజికల్ ఎక్విప్‌మెంట్లు, చిన్నారుల ఆటస్థలం, ఫౌంటేన్లు, సెల్ఫీ పాయింట్స్ అన్నీ బయటపడ్డాయి. బోటింగ్ పాయింట్ వద్ద పేరుకుపోయిన ఇసుక మేటలను కూడా పూర్తిగా తొలగించారు.



లారీ నుంచి పడిన మాంసం వ్యర్థాలను తరలిస్తున్న సిబ్బంది

హైదరాబాద్ టు విజయవాడ.. మాంసం వ్యర్థాల అక్రమ రవాణా!

▸▸ ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల చేపల చెరువులకు యజమానుల దిగుమతి

▸▸ ప్రతిరోజూ హైదరాబాద్ నుంచి విజయవాడ మీదుగా 50 లారీలు

▸▸ వినియోగంపై నిషేధం ఉన్నా బేఖాతర్.. ఆ చేపలు తింటే తీవ్ర అనారోగ్యం

▸▸ పట్టించుకునే వ్యవస్థలు.. చర్యలు శూన్యం

(ఆంధ్రజ్యోతి, నందిగామ/విస్సన్నపేట) : దొరికితేనే దొంగలు.. పాపం పండటంతో మాంసం వ్యర్థాల రాకెట్ గుట్టు రట్టయింది. హైదరాబాద్ నుంచి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లోని సిండికేట్లతో కలిసి భారీగా మాంసం వ్యర్థాలను డంప్ చేస్తున్నాయి. ఇన్నాళ్లూ గుట్టుగా చేస్తున్న అక్రమ వ్యాపారం లారీ ప్రమాదంతో వెలుగుచూసింది. విస్సన్నపేట మండలం చంద్రుపట్లలో మాంసం వ్యర్థాలు తరలిస్తున్న లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీ కొట్టడంతో అసలు కథ వెలుగులోకి వచ్చింది. ఖమ్మం జిల్లా నుంచి జాతీయ రహదారి మీదుగా, అడ్డదారుల్లో వస్తున్న మాంసం వ్యర్థాల లారీలు యథేచ్ఛగా ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. చేపలు వెంటనే పెరగటానికి చెరువుల్లో మాంసపు వ్యర్థాలను వేస్తూ ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణ విధ్వంసానికి ఆక్వాసాగు యజమానులు పాల్పడుతున్నారు.

చేపల చెరువుల్లో మాంసపు వ్యర్థాల వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ మత్స్యశాఖ అధికారులు వారిని అడ్డుకోవడం లేదు. గ్రామాల్లో ఊరచెరువుల నుంచి పంట పొలాలలో ఏర్పాటు చేస్తున్న చెరువుల వరకూ మాంసపు వ్యర్థాలను వినియోగిస్తున్నారు. హైదరాబాద్, ఖమ్మం నగరాల నుంచి నిత్యం 50 లారీలకు పైగా అక్రమంగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలోకి ప్రవేశిస్తున్నాయి. బోర్డర్ చెక్‌పోస్టులు, టోల్‌ప్లాజాల వద్ద సరైన తనిఖీలు నిర్వహించకపోవడంతో అక్రమ వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. వ్యర్థాల ఆనవాళ్లు కనిపించకుండా ప్లాస్టిక్ బ్యాగ్‌ల్లో పెట్టి లోడ్ చేస్తారు. వ్యర్థాల తాలూకా నీరు కింద పడకుండా లారీ అడుగు భాగాన ప్లాస్టిక్ పట్టాలు పరిచి జాగ్రత్త పడుతున్నారు. మరి కొందరు ఏసీ కంటైనర్ల ద్వారా వ్యర్థాలను దిగుమతి చేసుకుంటున్నారు. చికెన్, మటన్ దుకాణాల నుంచి కిలో రూ.3 చొప్పున వ్యర్థాలను సేకరిస్తున్న వ్యాపారులు చేపల చెరువులకు చేరవేసి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మొత్తం విజయవాడకు చెందిన ఒక మాఫియా కనుసన్నల్లో జరుగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. భారీఎత్తున సాగుతున్న అక్రమ వ్యాపారానికి పోలీసులు, మత్స్యశాఖ అధికారుల సహకారం ఉన్నట్టు విమర్శలు ఉన్నాయి.



ఎక్కడికక్కడే డంపింగ్ యార్డులు

హైదరాబాద్, ఖమ్మం పట్టణాల నుంచి రాష్ట్రంలోకి వస్తున్న వ్యర్థాలను చేపల చెరువులకు దిగుమతి చేస్తున్నారు. జిల్లాలోని నందిగామ పట్టణం బైపాస్ రోడ్డులో సంచులను ఆటోలకు దిగుమతి చేస్తున్నారు. అక్కడి నుంచి ఆటోల ద్వారా చందర్లపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు మండలాలోని చేపల చెరువులకు సరఫరా చేస్తున్నారు. కంచికచర్ల మండలం పరిటాల చెరువు వద్ద కొంత సరుకు దిగుమతి చేస్తున్నట్టు తెలిసింది. గన్నవరం, కైకలూరు, గుడివాడ, అవనిగడ్డ, నాగాయలంక, మచిలీపట్నం తదితర ప్రాంతాలలో చెరువులకు సరఫరా చేస్తున్నారు. మాంసపు వ్యర్థాలను చెరువులలో వేయడంపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదు. తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండటంతో పంట చేలల్లో పనులకు వ్యవసాయ కూలీలు కూడా రావడం లేదు. జల, వాయు కాలుష్యంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంది.

మాంసం వ్యర్థాల వల్ల తీవ్ర నష్టం

మాంసపు వ్యర్థాలను సేకరించే వ్యాపారులు వాటిని నిల్వ ఉంచేందుకు కొన్ని క్రిమి సంహారకాలను వినియోగిస్తారు. దీంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలూ కలసి ఉంటాయి. వీటిని కొనుగోలు చేసిన చేపల చెరువుల యజమానులు యంత్రాల సాయంతో సన్నని ముక్కలుగా నరికి చేపలకు మేతగా వేస్తారు. దీంతో చేపల ద్వారా రసాయనాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మానవ శరీరంలోకి చేరి వ్యాధులకు కారకాలుగా మారుతున్నాయి. కేన్సర్ వంటి భయంకరమైన వ్యాధులు సోకుతున్నాయి. మాంసపు వ్యర్థాలు కలిసిన నీటిలో ఆక్సిజన్ శాతం తగ్గుతుంది. దీని కారణంగా చెరువుల యజమానులు తరచూ నీటిని మార్చుతుంటారు. ఆ నీటిని పశువులు తాగితే ప్రమాదకరం. కొందరి స్వార్థం మత్స్య పరిశ్రమపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ పరిస్థితుల నుంచి మత్స్య పరిశ్రమను, ప్రజలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పైపులైన్ లీకేజీ..తాగునీటి సరఫరాకు అంతరాయం

లబ్బీపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరపాలక సంస్థ వాటర్ హెడ్ వర్క్స్‌లో 16ఎంజీడీ పైపులైన్ లీకేజీ ఉన్నందున తాగునీటి సరఫరాకు శుక్రవారం మధ్యాహ్నం వరకు అంతరాయం కలుగుతుందని ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ తెలిపారు. గాంధీనగర్, లబ్బీపేట, గవర్నర్‌పేట, గుప్తా కల్యాణమండపం, రెహమాన్ పార్క్ ఏరియా, మల్లికార్జునపేట, ఉప్పర వాగు ఏరియా, కేదారేశ్వరపేట, శ్రీనగర్, మ్యాచ్ ఫ్యాక్టరీ ఏరియా, మధురానగర్, గుల్మొద్దీన్ నగర్ ప్రాంతాలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. మధ్యాహ్నం నాటికి మరమ్మతులు పూర్తిచేసి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు.

ఐటీఐ ఆల్ ఇండియా ట్రేడ్ పరీక్షకు రేపటిలోగా దరఖాస్తు చేసుకోవాలి

భారతీనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి డైరెక్ట్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐటీఐ ఆల్‌ఇండియా ట్రేడ్ పరీక్ష -2025కు హాజరయ్యే అభ్యర్థులు ఈ నెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎం. కనకరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అర్హులైన ప్రైవేట్ అభ్యర్థులు ఐటీఐ ఆల్‌ఇండియా ట్రేడ్ పరీక్ష -2025కు ఆ రోజు సాయంత్రం 5గంటల లోపు విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాలకు 9490639639 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

పటమట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ గేటు వద్ద పాకల్లో ఉంటూ హత్యకు గురైన దాసరి లక్ష్మి కుటుంబానికి టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతి కుమార్ గురువారం రూ. 10 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల లక్ష్మి హత్యాచారానికి గురై హత్యగావించబడిన నేపథ్యంలో కుటుంబ సభ్యులను గద్దె క్రాంతి కుమార్ పరామర్శించి సాయం అందించారు.

దత్తపీఠంలో దత్తక్రియ యోగా శిక్షణ

పటమట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పటమట గణపతి సచ్చిదానంద ఆశ్రమంలో ఈనెల 12, 13, 14 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఉచిత దత్త క్రియ యోగా శిక్షణ, సాధనా తరగతులు నిర్వహిస్తామని దత్తక్రియ యోగా విజయవాడ శాఖ నార్త్ సమన్వయ కర్త దంతులూరి తిరుపతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్లపైన వారు, చేయగలిగిన వృద్ధులు ఈ శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. వివరాలకు 9866041332 నంబరును సంప్రదించాలని కోరారు.

మహానందీశ్వర స్వామికి అభిషేకాలు

విజయవాడ కల్చరల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురులోని శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం త్రయోదశి సందర్భంగా ప్రదోష కాలంలో మహానందీశ్వర స్వామికి అభిషేక, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని దేవస్థాన ప్రధాన అర్చకులు సాగర్, ఇతర అర్చకులతో కలిసి నిర్వహించారు. ఆలయ అభివృద్ధి దాత, రామలింగేశ్వర స్వామి చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సంగా నరసింహారావు వ్యవహరించారు.

చెత్తకుప్పలతో నిర్మాణ భవన్ రోడ్డు

● రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసనతో స్థానికుల వెతలు





రోజురోజుకు అంతర్గత రోడ్లలో పేరుకుపోతున్న చెత్తకుప్పలతో స్థానికులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఏపీఐఐసీ కాలనీలోని జమాక్ అపార్టుమెంట్ సమీపంలోని నిర్మాణ భవన్ రోడ్డులో గత కొద్దిరోజుల నుంచి చెత్తకుప్పలు పేరుకుపోతున్నాయి.ఈ చెత్తకుప్పలు రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిని ఇలా వదిలేస్తే మినీ డంపింగ్ యార్డుగా మారుతుందని స్థానికులు అంటున్నారు. అధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-భారతీనగర్, ఆంధ్రజ్యోతి

గ్రంథాలయ సంఘ సేవలు అమోఘం

డాక్టర్ డి. ప్రసాద్

బెంజిసర్కిల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో 110 ఏళ్ల క్రితం గ్రంథాలయ సంఘం స్థాపితమై నేటి వరకు కూడా అదే ఆశయంతో సేవలు అందించడం అమోఘమని ప్రభుత్వ ఆస్పత్రి రిటైర్డు వైద్యాధికారి డాక్టర్ డి. ప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం 110వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బెంజిసర్కిల్‌లోని సర్వోత్తమ భవనంలో పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ఆధ్వర్యంలో గురువారం జరిగిన సమావేశంలో డాక్టర్ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఒక స్వచ్ఛ సంస్థ అయిన గ్రంథాలయ సంఘం 110 ఏళ్ల మనుగడ సాధించి మరింత ఉత్సాహంగా పనిచేయడం అపురూపమని



సమావేశంలో డాక్టర్ ప్రసాద్, డాక్టర్ రావి శారదతోపాటు విద్యార్థులు, పాఠకులు

కొనియాడారు. ఏపీ గ్రంథాయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మాట్లాడుతూ సంఘం ఆవిర్భావ విశేషాలను, సాధించిన విజయాలను వివరించారు. గ్రంథాలయ శిక్షణ విద్యార్థులైన గురుమూర్తి, శ్రీరాములు, లిఖితలు గ్రంథాలయ సంఘం,గ్రంథాలయ ఉద్యమంలో ముఖ్య ఘట్టాలను వివరించారు. పలువురు పాఠకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత సంఘస్థాపకులు వెంకటరమణయ్య, గాడిచెర్ల, పాతూరి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు



మాట్లాడుతున్న ఈఈ విజయకుమారి

పటమట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పటమట సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. తొలుత ఆటోనగర్ సాయిబాబా కల్యాణ మండపంలో అధికారులు, సిబ్బంది సమావేశం నిర్వహించారు. 41 బృందాలుగా ఏర్పడి మొత్తం 3,259 గృహాలు, 413 వాణిజ్య సముదాయాలలో తనిఖీలు నిర్వహించారు. వాటిలో 37 సర్వీసుల్లో అవకతవకలను గుర్తించారు. రూ.1,42,200 జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో ఈఈ విజయకుమారి, గుణదల ఈఈ పి.హరిబాబు, డీఈఈ శివకుమార్, ఏఈ రాజశేఖర్, గుణదల పరిధిలోని డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మహిళపై దాడి

ఆలస్యంగా వెలుగుచూసిన వైనం

పటమట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): బెంజిసర్కిల్ సమీపంలో మోడరన్ సూపర్ మార్కెట్ ఎదుట కంకర పనికి వెళుతున్న పేరు తెలియని మహిళపై మద్యం మత్తులో ఇద్దరు మహిళలు దాడికి పాల్పడ్డ విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. తన వద్ద ఉన్న డబ్బును లాక్కొని వెళ్లిపోయారని, బట్టలు చించి వేశారని బాధిత మహిళ ఆరోపిస్తోంది. ఈ విషయంపై ఇప్పటి వరకు ఎలాంటి పోలీస్‌కేసు నమోదు కాలేదు. అసలు ఆ మహిళ ఎవరో, మద్యం మత్తులో ఆమెపై దాడి చేసిన ఇద్దరు మహిళలు ఎవరో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గ్రామదేవత కనక మహాలక్ష్మీ అమ్మవారి ఊరేగింపు

కృష్ణలంక, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): చైత్య మాస పౌర్ణమి సందర్భంగా కృష్ణలంకలోని గ్రామ దేవత కనక మహాలక్ష్మిని పురవీధుల్లో ఊరేగించారు. కృష్ణలంక గుండు కోటయ్య వీధిలోని చల్లా గణేష్ ఇంటి నుంచి ప్రారంభమైన ఊరేగింపు సర్వీసురోడ్డు మీదుగా సాగి తిరిగి గుండు కోటయ్య వీధికి చేరుకొన్నారు. మహిళలు అమ్మవారికి పసుపు నీరు వారబోసి పసుపు, కుంకుమలు సమర్పించి హారతులిచ్చారు. చీర, జాకెట్టు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చల్లా గణేష్, చల్లా మాధవి, నాగబాబు, చల్లా ఆదిలక్ష్మి, జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, కార్పొరేటర్ శేషు, వెంకట్ పాల్గొన్నారు.



స్టెల్లాలో ఇంటర్న్‌షిప్ ఫెలిసిటేషన్ ప్రోగ్రామ్

బెంజిసర్కిల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారిస్ స్టెల్లా కళాశాల ఆవరణలో గురువారం స్టెల్లా కళాశాల, ఐ బీలీవ్ ఐ క్యాన్(ఐబీఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ ఫెలిసిటేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లో సాధించిన విజయాలను గుర్తించి వారికి ప్రశంసలు అందజేశారు. విద్యార్థులు తమ ఇంటర్న్‌షిప్‌లో రూపొందించిన వాతావరణ సూచన యాప్, మ్యాజిక్ నెంబరు యాప్, సాంగ్ లిరిక్స్ ఎక్స్‌ట్రాక్టర్ యాప్ వంటి ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈయాప్‌లు పైథాన్, ఎస్‌క్యూఎల్, ఫ్లాస్క్ వంటి సాంకేతికతలతో రూపొందించారు. ఐబీఐసీ బృందం విద్యార్థులు, అధ్యాపకులు మాట్లాడుతూ పరిశ్రమలో అనుభవాన్ని పొందే అవకాశాలు విద్యార్థుల భవిష్యత్‌కు సహకరిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐబీఐసీ బోర్డు డైరెక్టర్ డాక్టర్ బి. కీర్తి, వాసవ్య మహిళా మండలి అధ్యక్షులు అనిత బాల, ఐబీఐసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు సెరీనా డిసిల్వా, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు.



ఫెలిసిటేషన్ సర్టిఫికెట్‌లను అందుకున్న విద్యార్థులతో అధ్యాపకులు



విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్బారావు

సైన్స్ విహారయాత్రకు తరలిన విద్యార్థులు

లబ్బీపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సమగ్రశిక్షా ఆధ్వర్యంలో జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి హైదరాబాద్‌కు సైన్స్ విహారయాత్రకు తరలివెళ్లారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన వివిధ వైజ్ఞానిక ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచిన 101మంది విద్యార్థులు, 20మంది గైడ్ టీచర్స్ ఈ విహారయాత్రకు బస్సుల్లో బయలుదేరగా ఆ బస్సులను జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ యాత్రలో భాగంగా మొదట భవానిపురంలోని రీజనల్ సైన్స్ సెంటర్‌ను సందర్శించగా, అనంతరం గరికపాడులోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్, ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ సైన్స్ ఫోరం కార్యదర్శి పి.నాగేశ్వరరావు, బయాలజీ ఫోరం కార్యదర్శి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరి సత్యనారాయణ దీక్ష విరమణ

విజయవాడ (స్పోర్ట్స్), ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలను అధికారులు పక్కన పెట్టి తనను పట్టించుకోవటం లేదని ఓల్గా ఆర్చరీ అకాడమీ చీఫ్ కోచ్ చెరుకూరి సత్యనారాయణ గత నాలుగు రోజుల నుంచి చేస్తున్న నిరాహార దీక్షను గురువారం విరమించారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఆదేశాలతో సౌత్ మోనిటరింగ్ కమిటీ ఆఫ్ అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చైర్మన్ ఆకుల రాఘవేంద్ర గురువారం సాయంత్రం చెరుకూరిని కలిసి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా రాఘవేంద్ర మాట్లాడుతూ చెరుకూరి సత్యనారాయణ చేస్తున్న దీక్ష ముఖ్యమంత్రి దృష్టికి వెళ్లడంతో సచివాలయ అధికారులు గురువారం ఆయనతో మాట్లాడారని, త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసే ఏర్పాట్లు చేయడంతో పాటు ఆయనకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ స్పందించి తగిన న్యాయం చేస్తానని, దీక్ష విరమింపచేయమని తమను పంపారని తెలిపారు. సత్యనారాయణ కూడా ఎంపీ, అధికారుల హామీతో దీక్ష విరమించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ జూడో అసోసియేషన్ సీఈవో నాగిశెట్టి వెంకట్, ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వై.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



చెరుకూరికి నిమ్మరసం తాగిస్తున్న రాఘవేంద్ర, శ్రీకాంత్, వెంకట్.

కృత్రిమ మేధస్సులో లాంగ్వేజ్ మోడల్స్ ప్రధానం

● ఇంజనీర్ ప్రియతమ్ బొల్లింపల్లి

మొగల్రాజపురం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సును ఉపయోగించే విషయంలో లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ ప్రధానం అని మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్, రెమాండ్ యూఎస్‌ఏ రీసెర్చ్ ఇంజనీర్ ప్రియతమ్ బొల్లింపల్లి చెప్పారు. కృత్రిమ మేధస్సును ఉపయోగించడం ఎలా అనే అంశంపై ఎంఎస్‌సి కంప్యూటర్ సైన్సు, ఎంసీఏ, ఎంబీఏ బిజినెస్ అనలిటిక్స్ చదువుతున్న విద్యార్థుకు గురువారం పీబీ సిద్ధార్థ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ పెద్ద మొత్తంలో భాషా డేటా నేర్చుకుని మనిషిలానే భాషను అర్థం చేసుకోవడం, రాయడం, అనుమానాలకు సమాధానం చెప్పడం తదితర పనులు ఏ విధంగా చేయగలుగుతాయో వివరించారు. ఈ పద్ధతిలో పరిశ్రమలకు కావాల్సిన పనులు, ఉత్పాదకత పెంచే విధానాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ రాజేష్ జంపాల, ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టిఎస్. రవికిరణ్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ బి. జయప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.



చేకూరి జన్మదిన వేడుకలలో పాల్గొన్న న్యాయవాదులు

సీనియర్ న్యాయవాది చేకూరి జన్మదిన వేడుకలు

విజయవాడ లీగల్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి) :ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో సిటీ సివిల్ కోర్టుల ఆవరణలో సీనియర్ న్యాయవాది చేకూరి శ్రీపతి రావు (74) జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎల్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ అర్బన్ టీడీపీ అధ్యక్షుడిగా, తూర్పు సమన్వయకర్తగా, టీడీపీ లీగల్‌సెల్ రాష్ట్ర నాయకుడిగా న్యాయవాదులకు చేకూరి అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. చేకూరి శ్రీపతిరావు మాట్లాడుతూ తనపై ఎంతో అభిమానంతో తన జన్మదిన వేడుకలను న్యాయవాదులు జరుపుకోవడం ఎంతో ఆనందంగా వుందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్ష, కార్యదర్శులు బాషా, కేవీ రంగారావు, న్యాయవాదులు షరీఫ్, సప్పా రమేష్, బొమ్మసాని రవి, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకు పీ-4 స్కాం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్

గుణదల, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా ప్రజలను మభ్యపెట్టేందుకు పీ-4 పేరుతో పెద్ద స్కాంను కూటమి ప్రభుత్వం తెరమీదకి తెచ్చిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ విమర్శించారు. గుణదల్లోని వైసీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుకు ఎంతమొత్తంలో నిధులు అవసరమౌతాయన్నది ముందుగా చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చాక అమ్మో ఏపీ అప్పుల ఊబిలో ఉంది పథకాలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం ఎంతవరకు సబబన్నారు. చంద్రబాబును నమ్మి ఓట్లు వేసిన వారంతా ఇప్పుడు తప్పుచేశామని పశ్చాత్తాపడుతున్నారని చెప్పారు. ఏ క్షణంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు పెట్టినా వైసీపీ మెజారిటీ స్థానాలు సొంతం చేసుకోవడం ఖాయమని జోస్యం చెప్పారు. తూర్పులో వైసీపీ హయాంలో రూ. 600కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది పిల్లలకు తల్లికి వందనం పేరుతో డబ్బులు వేస్తామన్న చంద్రబాబు ఏడాది కావస్తున్నా నేటికీ ఏ ఒక్కరికీ వేసిన పాపాన పోలేదని దుయ్యబట్టారు. 2029లో 88 సీట్లుపైబడి వైసీపీ సొంతం చేసుకోవడం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు కడియాల బుచ్చిబాబు, జిల్లా, మండల స్థాయి, నగరంలోని తూర్పు నియోజకవర్గం కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు జగన్ కుట్ర

యార్లగడ్డ సుచిత్ర

వన్‌టౌన్,ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు వైఎస్ జగన్ కుట్ర చేస్తున్నట్లు టీడీపీ మహిళా అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర విమర్శించారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జగన్‌రెడ్డి అరాచక రాజకీయాలకు పరాకాష్టగా కారుమూరి నాగేశ్వరరావు వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో గొడవలు సృష్టించేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. పర్యటనల పేరుతో జగన్‌రెడ్డి శాంతి భద్రతలకు ముప్పు తెస్తున్నారని, అతని వ్యాఖ్యలు సభ్య సమాజం చీదరించుకునేలా ఉన్నాయని తెలిపారు. పోలీసు వ్యవస్థపై అతని వ్యాఖ్యలు అప్రజాస్వామికమన్నారు. వారి భాష మార్చుకోకపోతే రాజకీయ సమాధి అవుతారని తెలిపారు. వైసీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కూటమి నాయకులు చూస్తూ ఊరుకోరన్నారు.

ఆయిల్‌హబ్ కొండపల్లి..!

ఇక ఆయిల్, గ్యాస్‌కు ప్రధాన కేంద్రంగా మారనున్న చారిత్రక ప్రాంతం


ఆయిల్ ట్యాంకర్లు, గ్యాస్ లారీలు

- సీఆర్‌డీఏ పరిధిలో ఉండటం ప్లస్‌పాయింట్
- ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థలన్నీ ఇక్కడే
- ఉపాధి అవకాశాలు మెరుగు, అభివృద్ధికి అవకాశం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల కుటుంబాలకు జీవనోపాధి
- ఇక్కడి నుంచే రాష్ట్రం మొత్తానికి గ్యాస్, ఆయిల్ సరఫరా

కొండపల్లి ప్రాంతం చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి. ప్రస్తుతం వేగంగా జరిగిన పరిణామాలతో ఈ ప్రాంతం సరికొత్త సొబగులు అద్దుకుంటోంది. కొండపల్లి ప్రాంతం రాజధాని ప్రాంతమైన సీఆర్‌డీఏ పరిధిలో ఉండటంతో రాజధాని అమరావతికి ఆయిల్ అండ్ గ్యాస్ హబ్‌గా మారనుంది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి సంస్థలన్నీ ఇక్కడే కొలువుదీరనున్నాయి. దీంతో ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి చెంది ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుంది. రాష్ట్రం మొత్తానికి ఆయిల్ ఇక్కడి నుంచే సరఫరా కానుంది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ:

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన ఐవోసీఎల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ఆయిల్, గ్యాస్ సంస్థలన్నీ కొండపల్లిలో కొలువుతీరాయి. నానాటికీ వీటి పరిధి విస్తరిస్తుండటంతో పాటు ఉత్పాదకత, పంపిణీ సామర్థ్యాలు పెరుగుతున్నాయి. రాజధాని అమరావతి ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ) పరిధిలో గ్యాస్, ఆయిల్ సంస్థలు కేంద్రీకృతమవడంతో కొండపల్లి 'ఆయిల్ అండ్ గ్యాస్ హబ్‌గా' చరిత్ర లిఖించబోతోంది. ఈ ప్రాంత అభివృద్ధికి కావలసిన గ్యాస్, ఆయిల్ సమృద్ధిగా సమీపంలో ఉండటంతో రవాణా ఖర్చులు, సమయం ఆదా అవుతాయని వ్యాపారవేత్తలు భావిస్తున్నారు. అమరావతి ప్రాంత అభివృద్ధి, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహజవనరులు సమృద్ధిగా ఉండటంతో పనుల వేగం పెరుగుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. విజయవాడ నగరానికి మణిహారంగా చెప్పుకునే పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వస్తే, మైలవరం నియోజకవర్గంలోని కంపెనీలకు అరగంట వ్యవధిలో చేరుకునే అవకాశం ఉంటుంది. వేలాది మందికి జీవనాధారంగా మారిన గ్యాస్, చమురు సంస్థలు ఆ ప్రాంత స్థితిగతులను పూర్తిగా మార్చేశాయి.


విద్యానగరం వద్ద ఉన్న భారత్ గ్యాస్ సంస్థ


కట్టుబడిపాలెం వద్ద ఉన్న వీపీపీఎల్ - హెచ్‌పీసీఎల్ చమురు సంస్థ

ఇప్పటి పరిస్థితికి వ్యత్యాసం

ఒకప్పుడు వ్యవసాయం, కూలిపనులపై ఆధారపడి జీవించిన కట్టుబడిపాలెం, జి.కొండూరు, కొండపల్లి గ్రామాల్లో ఇప్పుడు ఉద్యోగాలు, వ్యాపారాలు పుష్కలంగా ఉన్నాయి. భోజన హోటళ్లు, టీ, టిఫిన్ సెంటర్లు, చిన్న వ్యాపారాలు బాగానే నడుస్తున్నాయి.

పైపులైన్‌ల ద్వారా సరఫరా

వైజాగ్ నుంచి 348 కి.మీ. మేర పైపులైన్ ద్వారా కట్టుబడిపాలెంలోని వీపీపీఎల్ - హెచ్‌పీసీఎల్ చమురు సంస్థకు ఆయిల్ వస్తోంది. అదే విధంగా గ్యాస్ కూడా గెయిల్ ఇండియా లిమిటెడ్‌కు 343 కి.మీ. పైపులైన్ ద్వారా వస్తోంది. ఇక్కడి నుంచే తెలంగాణకు కూడా సరఫరా జరుగుతోంది.

పటిష్ట భద్రత, అవగాహన

ఈ పైపులైన్‌లకు సంబంధించి ఆయా సంస్థలు పటిష్ట భద్రత ఏర్పాటు చేశాయి. గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించేందుకు కళాజాతలు, మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. ఎక్స్ మిలిటరీ గార్డులతో భద్రతను మెరుగుపరుస్తున్నారు.

అన్ని సంస్థలూ ఒకేచోట

మైలవరం నియోజకవర్గంలోని జి.కొండూరు మండలాల్లో హెచ్‌పీసీఎల్, భారత్ గ్యాస్, భారత్ చమురు సంస్థ, ఇండియన్ ఆయిల్, గెయిల్ ఇండియా లిమిటెడ్ వంటి సంస్థలున్నాయి. ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి ఐడీఏలో హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్ సంస్థల గ్యాస్ బండ్లకు నింపే ఫిల్లింగ్ స్టేషన్లున్నాయి. ఈ ప్రాంతం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్యాస్ గోదాంలకు గ్యాస్, పెట్రోల్, డీజిల్‌ను సరఫరా చేస్తున్నారు. కంపెనీల ద్వారా ప్రత్యక్షంగా ఉద్యోగాలు చేసేవారితో పాటు, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. డ్రైవర్లు, సిలిండర్ రిపేర్, తయారీ యూనిట్ల ద్వారా అనేక మందికి ఉపాధి లభిస్తోంది.



జి.కొండూరులోని గెయిల్ ఇండియా లిమిటెడ్ సంస్థ

ప్రధాని మోదీ సహకారం ఎనలేనిది

● ఎక్స్‌లో ఎమ్మెల్యే సుజనా చౌదరి

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ప్రధాని మోదీ అందిస్తున్న సహకారం ఎనలేనిదని ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా చౌదరి) అన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో ఒక సందేశాన్ని పంపించారు. తిరుపతి- కాట్పాడి రైల్వేలైన్ నిర్మాణానికి తాజాగా కేంద్రం రూ.1332 కోట్లు మంజూరు చేయడమే ఏపీకి ప్రధాని మోదీ సహకరిస్తున్నారన్నదానికి నిదర్శనమన్నారు. రాజధాని అమరావతితో సహా ఏపీలోని అన్ని ప్రాంతాలను మోదీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల తరఫున మోదీకి ధన్యవాదాలు చెబుతున్నట్టు తెలిపారు.

హజ్ యాత్రికులకు టీకాలు వేయండి

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రికులకు టీకాలు వేయాలని కోరుతూ రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్, ఇమ్యూనైజేషన్ అధికారులకు విజయవాడ హజ్ కమిటీ కార్యనిర్వహణ అధికారి (ఈవో) గురువారం వినతి పత్రాలు అందజేశా రు. మంత్రి ఎన్ఎండీ ఫరూక్ ఆదేశాల మేరకు ఈ వినతి పత్రాన్ని అందచేసినట్టు తెలిపారు. హజ్ యాత్రికులకు ఇబ్బంది లేకుండా టీ కాలు వేయడానికి జిల్లాల పరిపాలనాధికారులకు తగిన ఆదేశాలిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారని ఈవో తెలిపారు. టీకాల తరువాత తగిన సమయం అవసరం ఉండడంతో యాత్రకు బయలుదేరడానికి కనీసం 15 రోజులు ముందు టీకా వేయించుకోవాలని ఈవో తెలిపారు. హజ్ సొసైటీలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

అపరిష్కృత సమస్యల పరిష్కారానికి 17న ధర్నా

● పీఎంటీఎఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు

గాంధీనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 17న ధర్నా చేపడుతున్నట్టు ప్రోగ్రెసివ్ మున్సిపల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (పీఎంటీఎఫ్ ఏపీ) రాష్ట్ర అధ్యక్షుడు సోమరౌతు శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి బైపాస్‌లోని విద్యాభవన్ వద్ద ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ ధర్నా జరుగుతుందన్నారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమన్నారు. మున్సిపల్ ఎడ్యుకేషన్ యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ విడుదల చేసి బదిలీల చట్టం రూపొందించాలన్నారు. అప్‌గ్రేడ్ చేసిన మున్సిపల్ పాఠశాలలకు పోస్టులు మంజూరు లేదా కేటాయింపులు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయాలని, ఉర్దూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి పి.సుమంత్ పాల్గొన్నారు.

సమ్మర్ స్పెషల్ రైళ్లు

రైల్వేస్టేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): వేసవి పురస్కరించుకుని ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు సమ్మర్ స్పెషల్ ప్రత్యేక రైళ్ల 24 సర్వీసులు నడుస్తాయని విజయవాడ రైల్వే డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం మండ్రుపకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11 నుంచి జూన్ 27 వరకు 07025 చర్లపల్లి-శ్రీకాకుళం రోడ్డు ప్రతి శుక్రవారం 12 సర్వీసులు నడవనుంది. 12 నుంచి జూన్ 28 వరకు 07026 శ్రీకాకుళం రోడ్డు-చర్లపల్లి ప్రతి శనివారం 12 సర్వీసులు నడవనుంది. ఈనెల 13 నుంచి జూన్ 29 వరకు 07637 తిరుపతి - షిర్డీసాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం నడుస్తుంది. మొత్తం 12 సర్వీసులుంటాయి. ఈనెల 14 నుంచి జూన్ 30 వరకు 07638 షిర్డీ సాయి నగర్- తిరుపతి ప్రతి సోమవారం నడుస్తుంది. మొత్తం 12 సర్వీసులుంటాయన్నారు.

ప్రభుత్వం స్పందించకుంటే నిరవధిక సమ్మె

మున్సిపల్ వర్కర్స్ నేత ఉమామహేశ్వరరావు

ధర్నాచౌక్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్య వైఖరి విడనాడాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దుచేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అధికారాలు అప్పగించే చర్యలను ప్రభుత్వం మానుకోవాలని, మున్సిపల్ కార్మికులకుందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ కార్మికుల నుంచి సేకరించిన సంతకాలను మంత్రి నారాయణకు అందించేందుకు వివిధ జిల్లాల నుంచి సంఘం నేతలు నగరానికి వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ధర్నాచౌక్‌లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.సోమయ్య కోశాధికారి ఎస్.జ్యోతిబసు మాట్లాడుతూ అర్హులైన కార్మికులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ నెల 15, 16, 17న రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేపట్టాలని తీర్మానించారు. బి.ముత్యాలరావు, కే.శ్రీనివాసరావు, ఎ.జాన్‌బాబు, తిరుపతమ్మ ప్రసంగించారు.


సభలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

పెంచిన ఆస్తి (ఇంటి) పన్ను తగ్గించాలి: బాబూరావు

భారతీనగర్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఎన్నికలకు ముందు పట్టణాల్లో ఆస్తి పన్ను పెంచబోమని, ఆస్తి విలువ ఆధారిత విధానాన్ని సమీక్షిస్తామని ఎన్నికల ప్రణాళికలో స్పష్టంగా హామీ ఇచ్చారని సీపీఎం నేత బాబూరావు అన్నారు. రాష్ట్రంలో పెంచిన ఆస్తిపన్ను తగ్గించాలని కోరుతూ సీపీఎం నేతలు సీహెచ్ బాబూరావు, డి.కాశీనాథ్, బోయి సత్యబాబు గురువారం ప్రభుత్వ ఐటీఐ కళాశాల రోడ్లోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో పాల్గొన్న మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట తప్పి ప్రజలపై రూ.320 కోట్ల భారం ఒకేసారి వేయడం తగదన్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు, పాలధరలు, నిత్యవసరాల ధరలు ఇలా పలు రూపాల్లో భారం వేశారన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డీ కాశీనాథ్, కార్పొరేటర్ బోయి సత్యబాబు, నగర సీపీఎం నేతలు బి.రమణరావు, పి.కృష్ణ, ఎన్ నాగేశ్వరరావు, కోరాడ రమణ పాల్గొన్నారు.


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న నేతలు


పునఃప్రతిష్ఠ అనంతరం అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అంగరంగ వైభవంగా..

ఘనంగా శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి పునఃప్రతిష్ఠ

తాత్వికుడు గెంటేల చేతుల మీదుగా యంత్రప్రతిష్ఠ

భారీగా హాజరైన భక్తులు, అన్న సమారాధన

జగ్గయ్యపేట, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారి వెండి దేవాలయం పునఃప్రతిష్ఠ బుధవారం వైభవంగా జరిగింది. తాత్వికుడు, బలుసుపాడు శ్రీ గురుధామ్ వ్యవస్థాపకుడు గెంటేల వెంకటరమణ, వసంతలక్ష్మీ దంపతుల హస్తాలతో ఉదయం 8-59 గంటలకరు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి యంత్రస్థాపనను నిర్వహించారు. తొలుత గణపతి పూజ, కర్మణఃపుణ్యాహవచనం, గోపూజ నిర్వహించారు. మూలమంత్ర సహిత రక్షాహోమాలు, పూర్ణాహుతిని యాజ్ఞికుడు జే కిశోర్‌శర్మ, ఇరువంటి వెంకటరమణశర్మ, సత్యనారాయణశర్మ నిర్వహించారు. యంత్ర ప్రతిష్ఠ అనంతరం బింబస్థాపనల అనంతరం కల్యాన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం అనంతరం అమ్మవారి తొలి దర్శనాన్ని గోమాతతో చేయించి, భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. మహాలక్ష్మీ అమ్మవారితో పాటు గణపతి, సాయినాథుడు విగ్రహాలను పునఃప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, మాజీ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా, జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు తుమ్మేపల్లి నరేంద్రరావు, వైకాపా నేతలు చౌడవరపు జగదీష్, వట్టెం మనోహర్ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. కమిటీ చైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు, కార్యదర్శి కే నాగేశ్వరరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ నూరె రాము ముఖ్యనేతలు, ప్రముఖులకు స్వాగతం పలికి దర్శనం కల్పించారు.

అందరి వృద్ధి కోరుకుంటే అమ్మ అనుగ్రహం: గెంటేల

అందరి వృద్ధి కోరుకున్న వారిని శ్రీమహాలక్ష్మీ అమ్మవారు త్వరగా అనుగ్రహిస్తుందని తాత్వికుడు గెంటేల వెంకటరమణ అన్నారు. ప్రతిష్ఠ సందర్భంగా అనుగ్రహభాషణం చేసిన ఆయన పరహితం కోరే వారంటే అమ్మకు ఎంతో ఇష్టమన్నారు.

తల్లిదండ్రులను విస్మరించటమే అలక్ష్మీ: తాత్వికులు చిట్టా

తల్లిదండ్రులను విస్మరించటమే అలక్ష్మీ అని తెలుసుకోవాలని తాత్వికుడు, శ్రీ గాయత్రీ ఆశ్రమ వ్యవస్థాపకుడు చిట్టా లక్ష్మీ నరసింహశాస్త్రి అన్నారు. పునఃప్రతిష్ఠకు హాజరైన ఆయన భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.

పేదరిక నిర్మూలనలో అధికారులదే కీలక పాత్ర

ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్ర జ్యోతి): పేదరిక నిర్మూలనలో అధికారులదే కీలకపాత్ర అని ఎన్టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారిణి జి విజయలక్ష్మి అన్నారు. విజయవాడ తుమ్మపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో గురువారం స్వర్ణాంధ్ర-2047 ప్రణాళిక, విజన్ డాక్యుమెంట్‌లోని 10 సూత్రాలపై వర్క్‌షాప్ జరిగింది. జిల్లా, మండల స్థాయి, అధికారులతో పాటు ఎంపీడీవోలు, తహసీల్దార్లు, పంచాయతీరాజ్ అధికారులు, డీఎల్‌పీవోలు, వార్డు సచివాలయం అధికారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయలక్ష్మి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో అధికారులు కీలకంగా వ్యవహరించాలన్నారు. విజన్ డాక్యుమెంట్ అమలుకు రథసారథులుగా ఉండాలన్నారు. ప్రజల్లో దాన స్ఫూర్తిని వినియోగించుకుని ప్రభుత్వం, ప్రైవేట్, పబ్లిక్, పీపుల్స్ భాగస్వామ్యం (పీ4) విధానానికి శ్రీకారం చుట్టారని, రానున్న 5 ఏళ్లలో పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యాన్ని విజయవంతం చేసేందుకు అన్ని స్థాయిల్లోనూ ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక విజన్-2047 ను అమలు చేయడానికి మండల స్థాయిలోనూ వర్క్‌షాపులను నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి ఏడాది 15 శాతం వృద్ధి లక్ష్యాలతో ప్రణాళికను రూపొందించినట్టు తెలిపారు. గణాంకాల మేరకు సర్వీస్ సెక్టార్‌లో ఎన్టీఆర్ జిల్లా రెండో స్థానం, పారిశ్రామిక వృద్ధిలో 5వ స్థానం, వ్యవసాయ రంగంలో 23వ స్థానంలో ఉందని, అయితే అన్ని రంగాలలోనూ జిల్లాను మొదటి స్థానంలో ఉంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. స్వర్ణాంధ్ర వికసిత్ భారత్ పది సూత్రాలను గురించి వివరించారు. 2047 లక్ష్యాలపై సుపరిపాలన విభాగం రిటైర్డ్ అదనపు డైరక్టర్ జనరల్ మహమ్మద్ తక్వియుద్దీన్, ఆర్థికవేత్త, ప్రొఫెసర్ ఎం ప్రసాదరావు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.



ప్రసంగిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారిణి విజయలక్ష్మి

మహిళ మృతి కేసులో అనుమానితుడి చిత్రం విడుదల



పెనమలూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): యనమలకుదురులోని లంక భూముల్లో గత శనివారం ఒక మహిళ మృతిచెందిన కేసును చాలెంజ్‌గా తీసుకున్న పెనమలూరు పోలీసులు ఈ కేసులో పక్కా ఆధారాలు లభించినట్టు భావిస్తున్నారు. మృతురాలు హత్యకు గురైందన్న దిశగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితుడిగా భావిస్తున్న వీడియోను పోలీసులు సంచరించిన విడుదల చేశారు. గత శనివారం పెనమలూరు పోలీసులు యనమలకుదురు లంక భూముల్లో ఒక మహిళ మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. యనమలకుదురు కరకట్ట, రామలింగేశ్వరాలయం వద్ద స్వాధీనం చేసుకొన్న సీసీ ఫుటేజీని పరిశీలించగా ఈనెల 4న ఉదయం 9గంటలకు చింతకట్ట సమీపంలోని ఒక ఇంటివద్ద గుర్తు తెలియని ఒక మహిళ, వ్యక్తితో కలిసి హతురాలు నదివైపు వెళుతున్నట్టు పోలీసులు గుర్తించారు. వెళ్లేటప్పుడు ముగ్గురూ వెళ్లగా గంటన్నర తర్వాత సుమారు పదిన్నరకు ఆమెతో వెళ్లిన మహిళ, వ్యక్తి మాత్రమే వచ్చినట్టు గుర్తించారు. వీరివెంట వెళ్లిన మహిళ మాత్రం తిరిగి రాలేదు. మృతురాలితో వెళ్లిన మహిళ ముందు జాగ్రత్తగా ముఖానికి మాస్క్ ధరించినట్టు పోలీసులు గుర్తించారు. మృతురాలితో వెళ్లిన మాస్కు ధరించిన మహిళ, వ్యక్తి ఎవరనే దానిపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. వీరిద్దరూ మృతురాలిని నమ్మించి లంక భూముల్లోకి తీసుకువెళ్లినట్టు అనుమానిస్తున్నారు. ముక్కు, నోరు, కళ్లవెంట ఉన్న రక్తపు చారికలను బట్టి ఆమెను వారిద్దరూ గొంతు నులిమి హత్య చేశారని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా మగ వ్యక్తి మాస్కు ధరించి ఆ పరిసరాల్లో ఒక్కడే సంచరిస్తున్న వీడియోను పోలీసులు విడుదల చేశారు. మృతదేహం కోసం ఎవరైనా బంధువులు వస్తారని పోలీసులు బాడీకి పోస్టుమార్టం నిర్వహించలేదు. ఫుటేజీలో పోలీసులు గమనించిన మహిళ, వ్యక్తి కోసం ఎస్ఐ ఫిరోజ్ నేతృత్వంలోని పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు.

అమరావతి వరద ముంపు నివారణ కాల్వ పనుల పరిశీలన

వేగం పెంచాలని సూచించిన ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీ పార్థసారథి

విజయవాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరుగుతున్న వరద ముంపు నివారణ అభివృద్ధి పనులను అమరావతి అభివృద్ధి సంస్థ(ఏడీసీ) సీఎండీ లక్ష్మీపార్థసారథి గురువారం క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. వెలగపూడిలోని సచివాలయం వెనుక వైపు ఎన్-9 మార్గంలో పాలవాగు దగ్గర జరుగుతున్న తవ్వకం పనులను పరిశీలించారు. అనంతరం శాఖమూరు దగ్గర జరుగుతున్న కొండవీటి వాగు అభివృద్ధి పనులను పరిశీలించి ఇంకా వేగంగా చేపట్టడానికి వీలుగా అధికారులకు సూచనలు చేశారు. తర్వాత ఐనవోలు గ్రామంలోని మంచినీటి చెరువులను పరిశీలించారు. ఏడీసీ చీఫ్ ఇంజినీరు ఎం.ప్రభాకర్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీరు నరసింహమూర్తి, ఈఈ కె.బసవేశ్వరరావు, ఐపీడీ అధికారులు, కె.వి.గణేష్‌బాబు, డి.శ్రీనివాస్‌రెడ్డి, హార్టికల్చర్ జేడీ వి.ఎస్.ధర్మజ పాల్గొన్నారు.

జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

వన్‌టౌన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి కృష్ణాజిల్లా డీఆర్‌డీఏ (సీడాప్) పథక సంచాలకుడు హరిహరనాథ్ ఒక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడాప్, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన కింద ఉద్యోగాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. బీఎస్సీ, ఎంఎస్సీ నర్సింగ్ అర్హత ఉండి, 20 నుంచి 35 ఏళ్లున్నవారు అర్హులన్నారు. సాధారణ ఆసుపత్రుల్లో అనుభవం, జర్మనీ భాష నేర్చుకోవడానికి ఆసక్తి కలిగి ఉండాలన్నారు. బీ2 స్థాయి వరకు ఉచిత భోజన వసతి, ఉచిత శిక్షణ ఉంటుందని, తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపికైన వారికి విమాన చార్జీలు ఉచితంగా ఇస్తారన్నారు. నెలకు రూ 2.4 నుంచి 3.10 లక్షల వేతనం ఉంటుందని, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి భవానీపురంలోని స్కిల్ కాలేజీలో తరగతులు ప్రారంభం కానున్నాయని చెప్పారు. పూర్తివివరాలకు 99630 74879, 94927 19843, 7288873337 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రంజీ మాజీ కెప్టెన్ యాచేంద్ర మృతికి ఎంపీల సంతాపం

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఆంధ్రా రంజీ క్రికెట్ టీమ్ కెప్టెన్ వెలుగోటి రాజగోపాల్ యాచేంద్ర (93) వయోభారంతో నెల్లూరు జిల్లా వెంకటగిరిలో గురువారం మృతి చెందారు. ఆయన మృతికి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎంపి కేశినేని శివనాథ్, ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ఆంధ్రప్రదేశ్ క్రికెట్ రంగాని తీరనిలోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. యాచేంద్ర ఆంధ్ర రంజీ టీమ్‌లో 1956 నుంచి 1965 మధ్య 15 రంజీట్రోఫీ మ్యాచ్‌లో బ్యాటింగ్‌తో పాటు లెగ్‌బ్రేక్ బౌలింగ్ చేసి ప్రతిభ గల క్రికెటర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 1963 నుంచి 1965 వరకు ఆంధ్ర జట్టుకు నాయకత్వం వహించారన్నారు, టేబుల్ టెన్నిస్‌లోనూ అగ్రశ్రేణి ఆటగాడిగా గుర్తింపు పొందారని అన్నారు.

కమీషన్‌లు ఇస్తేనే ప్రతిపాదనలకు ఆమోదం..!

● లేకపోతే వాయిదాల పర్వం

కార్పొరేషన్, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): నగరాభివృద్ధితో ఈ స్టాండింగ్ కమిటీకి పని లేదు. తమకందాల్సిన కమీషన్లు అందితే చాలు ప్రతిపాదనాలు ఆమోదం, లేకుంటే వాయిదాలేనని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఏ చిన్న టెండరైనా కమిటీ ఆమోదం పొందాలంటే తాయిలాలు చెల్లించాల్సిందేనని లేకుంటే తిరస్కారమేనని విమర్శలు ఉన్నాయి. దీనికి ఉదాహరణ మెయిన్ ఆఫీసు రోడ్డు సైడ్ మార్జిన్ పార్కింగే. అంతేకాదు వీటితోపాటు రెండు కర్మల్ భవనాల టెండర్‌లు ఇలాగే 2 సార్లు వాయిదా వేశారు. టెండర్లలో అవకతవకలు జరిగి ఉంటే దాన్ని రద్దు చేసే అధికారం కమిషనర్‌కు ఉంది. వాటిని రద్దు చేయమని కమిటీ సిఫార్స్ చేయలేదు. తమకు రావాల్సింది వచ్చేంతవరకు కమిటీ సభ్యులు వాయిదాలు వేస్తూ కార్పొరేషన్ ఆదాయాన్ని దారి మళ్లిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.

నేడు స్టాండింగ్ కమిటీ సమావేశం...

నగరపాలకసంస్థ స్థాయీ సంఘం సమావేశం మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరగనుంది. సమావేశంలో మొత్తం 37 అంశాలపై చర్చ జరుగుతుంది. గతంలో వాయిదా వేసిన పలు అంశాలతోపాటు కొత్తగా పెట్టిన టెండర్‌లు, అభివృద్ధి పనుల ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించనున్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య నివేదన
9
శుక్రవారం • 11 ఏప్రిల్ 2025



పర్వదినం

వందే అనిలాత్మజం

శ్రీరామదూత అయిన హనుమంతుడు అమేయ బలసంపన్నుడు. ఆయన నామ స్మరణతో భయాందోళనలు తొలగిపోతాయని, భూతప్రేతాదులు పారిపోతాయనీ ప్రతీతి. భక్తుల పాలిట కల్పవృక్షమైన ఆంజనేయుడు బలం, భక్తి, వినయం, విధేయతలకు ప్రతిరూపం. చైత్ర పౌర్ణమినాడు విజయప్రదాత అయిన హనుమద్విజయోత్సవాన్ని నిర్వహిస్తారు. ఇంతకీ ఈ రోజు ప్రత్యేకత ఏమిటి?

రావణ సంహారం అనే లక్ష్యం దిశగా రామాయణ గాథ నడవడంలో ప్రధాన పాత్ర హనుమంతుడిదే. అందుకే...

గోష్పదీకృత వారాశిం మశకీకృతరాక్షసం

రామాయణ మహామాలా రత్నం వందే అనిలాత్మజం... అన్నారు. "సముద్రాన్ని గోవు పాదంలా భావించి దాటినవాడు, రాక్షసులను దోమల్లా పరిగణించి మట్టుపెట్టినవాడు, 'రామాయణం' అనే మాలలో రత్నంగా భాసిల్లినవాడు అయిన వాయుపుత్రుడికి నమస్కారాలు" అని దీని భావం. అంతటి మహనీయుడైన హనుమంతుడి జయంతిని ఏ రోజు నిర్వహించాలనే విషయంలో సందిగ్ధత ఉంది. ఉత్తర భారతదేశ ప్రజలు హనుమజ్జయంతిని చైత్ర పౌర్ణమి నాడు జరుపుకొంటారు. తమిళనాడులో మార్గశిర అమావాస్య నాడు, ఒడిశాలో మేష సంక్రాంతి రోజున నిర్వహిస్తారు. తెలుగు ప్రాంతాల్లో చైత్ర పౌర్ణమిని హనుమద్విజయోత్సవంగా, వైశాఖ బహుళ దశమిని హనుమజ్జయంతిగా జరుపుకొనే ఆనవాయితీ కనిపిస్తుంది. వైశాఖ మాసం కృష్ణపక్షంలోని దశమి మంగళవారం నాడు... పూర్వాభాద్ర నక్షత్రంలో హనుమంతుడు జన్మించాడని పండితులు పేర్కొంటున్నారు.

"పరాశర సంహితలోని 'వైశాఖే మాసి కృష్ణాయాం దశమ్యాం మందవాసరే... పూర్వాభాద్ర ప్రభూతాయ మంగళం శ్రీ హనూమతే...' అనే శ్లోకాన్ని దీనికి ప్రమాణంగా తీసుకోవాలి" అని చెబుతున్నారు.

హనుమంతుడి జయంతిని ఏ రోజు నిర్వహించాలనే విషయంలో సందిగ్ధత ఉంది. ఉత్తర భారతదేశ ప్రజలు హనుమజ్జయంతిని చైత్ర పౌర్ణమి నాడు జరుపుకొంటారు. తమిళనాడులో మార్గశిర అమావాస్య నాడు, ఒడిశాలో మేష సంక్రాంతి రోజున నిర్వహిస్తారు. తెలుగు ప్రాంతాల్లో చైత్ర పౌర్ణమిని హనుమద్విజయోత్సవంగా, వైశాఖ బహుళ దశమిని హనుమజ్జయంతిగా జరుపుకొనే ఆనవాయితీ కనిపిస్తుంది.

లంకాదహనం... శ్రీరామ సత్కారం

హనుమద్విజయోత్సవానికి సంబంధించి పలు కథలు ప్రచారంలో ఉన్నాయి. సీతను అన్వేషిస్తున్న హనుమంతుడు... లంకలో ఆమెను కనుగొన్నాడు. ఆ సంతోషంలో అశోక వనాన్ని నాశనం చేశాడు. రావణుడి సైనికులు ఆయనను బంధించి, తోకకు నిప్పు అంటిస్తే... ఆ నిప్పుతో లంకాదహనం చేశాడు. ఆ రోజు చైత్ర పౌర్ణమి. రావణ సైన్యంపై హనుమంతుడు సాధించిన విజయానికి చిహ్నంగా ఈ వేడుకలను నిర్వహించుకోవడం సంప్రదాయంగా మారిందనేది ఒక కథ. కాగా, మరో కథ ప్రకారం.. రావణ సంహారం తరువాత అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడైన రాముడు... తన విజయానికి ఎంతగానో దోహదపడిన హనుమంతుణ్ణి ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని, ఘనంగా సత్కరించాడు. చైత్ర పౌర్ణమి నాడు జరిగిన ఈ సత్కారానికి చిహ్నంగా... ఆ రోజును ప్రజలు హనుమద్విజయోత్సవంగా నాటి నుంచి జరుపుకొంటున్నారు.

ఏం చేయాలి?: హనుద్విజయోత్సవం నాడు హనుమాన్ చాలీసా, ఆంజనేయ స్తోత్రాలను పఠించడం, పండ్లను, వడమాలను, అప్పాల మాలను, తమలపాకుల దండను సమర్పించడం, సిందూరంతో పూజించడం ద్వారా అన్ని పనుల్లో విజయం కలుగుతుంది. అలాగే చైత్ర పౌర్ణమి నుంచి వైశాఖ బహుళ దశమి వరకూ... నలభై రోజుల పాటు హనుమాన్ చాలీసాను వీలైనన్నిసార్లు పఠిస్తే హనుమంతుడి అనుగ్రహం లభిస్తుందనేది పెద్దల మాట.

(రేపు హనుమద్విజయోత్సవం)

గీతాసారం

కర్మయోగం

భగవద్గీతలో అత్యంత ప్రాచుర్యం పొందిన శ్లోకాలలో 'కర్మణ్యే వాధికార స్తే మా ఫలేషు కదాచన...' అనేది ఒకటి. 'మనకు కర్మ చేసే అధికారం ఉంది కానీ, కర్మ ఫలం మీద అధికారం లేదు' అని చెబుతున్న ఈ శ్లోకాన్ని భగవద్గీత సారాశం అని చెప్పవచ్చు. మనకు ప్రియమైన వారికి శస్త్రచికిత్స అవసరమైనప్పుడు... నిజాయితీ కలిగిన, సమర్థుడైన సర్జన్ కోసం చూస్తాం. ఎందుకంటే అతని యోగ్యత... శస్త్రచికిత్స విజయాన్ని సూచిస్తుంది. అతని నిజాయితీ... అనవసరమైన శస్త్రచికిత్స చేయరనే భరోసా ఇస్తుంది. అంటే సంక్షిప్తంగా మనం కర్మయోగి అయిన సర్జన్ కోసం వెతుకుతున్నామని అనుకోవచ్చు. ఇలాంటి సందర్భంలో మనం కోరుకొనే రెండు ప్రత్యేకతలు ఈ శ్లోకాన్ని మనం బాగా అర్థం చేసుకోవడానికి ఎంతో సహాయపడతాయి.

కర్మ ఫలం గురించి చింతించకుండా కర్మలో లోతుగా నిమగ్నమైనప్పుడు... మనం కాలాతీతమైన (కాలాన్ని అధిగమించిన) స్థితికి చేరుకుంటాం. అంటే ఇక్కడ సమయంతో సంబంధం లేదు. పైన చెప్పిన శస్త్రచికిత్స ఉదాహరణనే తీసుకుందాం. మనం ఆపరేషన్ థియేటర్ వెలుపల ఉన్నప్పుడు... సమయం చాలా నెమ్మదిగా గడుస్తున్నట్టు అనిపిస్తుంది. మరోవైపు కర్మయోగి అయిన సర్జన్... శస్త్రచికిత్సలో నిమగ్నమై, సమయానికి సంబంధించిన స్పృహను కోల్పోతారు. ఇంకో విధంగా చూస్తే... అతని దృష్టిలో సమయం ఆగిపోయి ఉంటుంది.

మనకు సేవ చేసేవారందరూ కర్మయోగులుగా ఉండాలని, సర్వోత్తమ ఫలితాలు అందించాలని మనం ఆశిస్తూ ఉంటాం. అదే సూత్రాన్ని మనకు అన్వయించుకుంటే... మనం కూడా మన దైనందిన జీవితంలో ఇతరులకు సేవ చేస్తూ కర్మయోగులుగా ఉండాలి. పని చేసే చోట, కుటుంబ వ్యవహారాల్లో ఏ బాధ్యత నిర్వర్తించినా సర్వోత్తమమైన కృషి చేయాలి. కర్మయోగ సాధనలో వేసే చిన్న చిన్న అడుగులు... మనల్ని సమత్వానికి దగ్గరగా తీసుకువస్తాయని, అవి మనలో ఆనందాన్ని కలిగిస్తాయని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు. మనం మళ్ళీ కలుసుకొనే అవకాశం లేనివారికి అత్యుత్తమ సేవలను అందించగలిగినప్పుడు... మనం కర్మయోగిగా మారే మార్గంలో దృఢంగా ఉన్నామని అర్థం.



కె.శివప్రసాద్



హనుమంతుడు ఎవరు?

హిందూ సంస్కృతిలో ఇష్టదేవతారాధన ఒక ముఖ్యమైన తాత్విక భావన. ఒకరిని పూజిస్తూనే ఇతర దేవతలను ద్వేషించకుండా.. వారిని కూడా గౌరవిస్తారు. బహుశా ప్రపంచంలో మరే మతంలోను ఈ తరహా సంప్రదాయం కనిపించదు. హనుమంతుడు కూడా ఈ తరహా దేవుడే! హనుమంతుడిని మనం రాముడి పరివారంలో భాగంగా చూడవచ్చు. లేదా శివుడు, విష్ణువు మొదలైన వారిని చేరుకోవటానికి ఒక మార్గంలా కూడా భావించవచ్చు. మన పూర్వ గ్రంథాలలో హనుమంతుడిని భక్తితత్వానికి ప్రతిరూపంగా చిత్రీకరిస్తారు. హనుమంతుడు ఆడగలడు. పాడగలడు. తప్పు చేసిన వారిని శిక్షించగలడు. దుర్గా దేవిలోని శక్తి, సరస్వతి దేవిలోని విజ్ఞానం, లక్ష్మీదేవిలోని సంపదలను తన భక్తులకు ఇవ్వగలిగినవాడు హనుమంతుడే! అందువల్లనే మన దేశంలో అనేక ప్రాంతాల్లో హనుమంతుడికి గుడులు కనిపిస్తాయి.

అనేక రూపాలలో...

భగవంతుడు కేవలం పురుషుడే కాదని... అర్ధనారీశ్వరుడని కొందరు నమ్ముతారు. ఇది మన స్థానిక సంస్కృతులలో ఒక కీలకమైన అంశం. అందుకే హనుమంతుడు చత్తీస్‌గఢ్‌లోని రత్నపూర్ జిల్లాలోని ఒక గుడిలో చీరకట్టుకొని, ముక్కుపుడక పెట్టుకొని కనిపిస్తాడు. మనకు అందుబాటులో ఉన్న గ్రంథాలను పరిశీలిస్తే - దేవుళ్లకు ఉన్న సమస్యలను కూడా తీర్చే వ్యక్తిగా హనుమంతుడు మనకు దర్శనమిస్తాడు. రామాయణంలో లక్ష్మణుడు స్పృహ తప్పిపడిపోయినప్పుడు సంజీవినిని తెచ్చి కాపాడతాడు. సీతను కనుగొనటంలో సముద్రాన్ని దాటి లంకకు చేరుకుంటాడు. ఇలా దేవుళ్లకే సాయం చేయగలిగిన వ్యక్తి మానవులకు ఎందుకు సాయం చేయలేడు? బహుశా అందుకే భారతదేశంలో కొండల్లో.. గుట్టల్లో హనుమంతుడి ఆలయాలు మనకు కనిపిస్తూ ఉంటాయి. తమకున్న సమస్యలను పరిష్కరించమని హనుమంతుడిని అందరూ కోరుకుంటూ ఉంటారు.

అనేక గ్రామాల శివార్లలో హనుమంతుడి విగ్రహం కనిపిస్తూ ఉంటుంది. ఈ విగ్రహమే తమను దుష్టశక్తుల నుంచి రక్షిస్తుందని ప్రజలు నమ్ముతూ ఉంటారు.



మన దేశంలో ఆదివాసీ ప్రాంతాల్లో ప్రచారంలో ఉన్న రామాయణంలో హనుమంతుడు లంకకు వెళ్లినప్పుడు ... అక్కడ ఒక పెద్ద భవనం కనిపిస్తుంది. అది రావణుడు రాజభవనం. దానిలోని రావణుడు కూర్చునే ఒక సింహాసనం ఉంటుంది. ఆ సింహనం కింద రావణుడు- శనిని, యముణ్ణి బంధించి ఉంచుతాడు. హనుమంతుడు వారిద్దరిని విడుదల చేస్తాడు. తమకు స్వేచ్ఛను కలగజేశాడు కాబట్టి వీరిద్దరూ హనుమంతుడికి రుణపడి ఉంటారు. అందుకే తీవ్రమైన ఈతి బాధలు వచ్చినప్పుడు హనుమాన్ చాలీసా చదువుకొమ్మని చెబుతారు. హనుమంతుడిని ప్రసన్నం చేసుకుంటే వీరిద్దరి అనుగ్రహం కూడా పొందవచ్చని భావిస్తారు.

- లఖనవూలో మే-జూన్ నెలల మధ్య- బడా మంగల్ - అనే ఉత్సవాన్ని జరుపుతారు. లక్నోను నవాబులు పరిపాలించే కాలంలో ఒక ప్రాంతంలో ఒక పెద్ద హనుమంతుడి విగ్రహం బయటపడింది. దీనిని శుభసూచకంగా భావించిన నవాబులు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ రోజుకు ఈ ఉత్సవం జరుగుతుంది. వేల మంది ప్రజలు హనుమంతుడి విగ్రహాన్ని దర్శించుకోవటానికి వస్తారు. వారికి స్థానిక ముస్లిములు అవసరమైన ఏర్పాట్లు చేస్తారు.

దైవమార్గం

పునరుత్థానానికి నిరీక్షణ

దైవ కుమారుడైన ఏసు క్రీస్తు మరణం, పునరుత్థానం అద్వితీయమైన ఘట్టాలు. వాటిని స్మరించుకుంటూ... దైవ చింతనకు, సేవకు పునరంకితం కావడానికి ఉద్దేశించిన రోజులు... 'లెంట్ డేస్' లేదా 'శ్రమ దినాలు'. క్రీస్తు మరణానికి ముందు ఉండే నలభై రోజులను 'శ్రమదినాలు' అంటారు. ఏసు క్రీస్తు తనంతట తానుగా పట్టుబడి, రోమన్ సైనికుల ద్వారా శిలువ శిక్షకు గురి కాకవడానికి ముందు... నలభై రోజుల పాటు ఎడారిలో ఉన్నాడు. తన తండ్రి అయిన దేవుణ్ణి ధ్యానిస్తూ ఉపవాస దీక్ష పాటించాడు. దానికి గుర్తుగా... ఆ నలభై రోజుల్లో క్రైస్తవులు ఉపవాసాలు చేస్తారు. దాన ధర్మాలు చేయడం, ఇతరుల పట్ల ద్వేష భావాన్ని తొలగించుకొని, స్నేహంతో, ప్రేమపూర్వకంగా ఉండడం లాంటి నియమాలను అనుసరిస్తారు. కాగా, రోమన్ క్రైస్తవులు ప్రతి శుక్రవారం 'శిలువ మార్గం' అనే భక్తి ధ్యాన ప్రక్రియను పాటిస్తారు. క్రీస్తు మరణ సంబంధమైన ఘట్టాలను పునశ్చరణ చేసుకుంటారు.

జనోద్ధరణ కోసం ఏసు హింసకు గురయ్యాడు, శిలువపై మరణించాడు. అది గుడ్ ఫ్రైడే. ఆ తరువాత మూడో రోజున తిరిగి ప్రాణాలతో లేచాడు. అదే పునరుత్థాన పండుగ... ఈస్టర్. ఆ రోజును గమ్యంగా చేసుకొని ఈ దీక్షలు కొనసాగుతాయి. ఏసును ధ్యానిస్తూ... గతంలో చేసిన పొరపాట్లను గుర్తు చేసుకొని, పశ్చాత్తాపం చెందడానికి, మానసికంగా పరిశుద్ధులు కావడానికి, తమలోని దోషాలను సరిదిద్దుకోవడానికి అనువైన రోజులుగా వీటిని పరిగణిస్తారు. విలాసవంతమైన జీవన విధానానికి, విందులకు, వినోదాలకు, ఆర్భాటాలకు దూరంగా ఉంటారు. శుభ శుక్రవారం కోసం, ఆ తదుపరి ఆదివారం వచ్చే ఈస్టర్ కోసం సమాయత్తమయ్యే దినాలు. క్రీస్తు పునరుత్థానానికి నిరీక్షణ దినాలు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్



సద్బోధ



ప్రతిదీ పాఠం చెబుతుంది!

ఒకప్పుడు చైనాలో అత్యంత ప్రాచుర్యం పొందిన గురువుల్లో లావోట్జూ ముఖ్యుడు. అతనికి ప్రధాన శిష్యుడు, చైనా తాత్వికుల్లో పేరుపొందినవాడు చువాంగ్‌ట్జూ. అతను ఎల్లప్పుడూ ఒక మానవ కపాలాన్ని (పుర్రెను) తన దగ్గరే ఉంచుకొనేవాడు. ఇది చాలాకాలం పాటు గమనించిన అతని శిష్యులు "గురువుగారూ! మీరు ఎప్పుడూ ఆ పుర్రెను మీ దగ్గరే పెట్టుకుంటారు. అది ఎందుకనేది మాకు అర్థం కావడం లేదు. దాన్ని చూసినప్పుడల్లా మాకు వెగటు కలుగుతోంది. దాన్ని మీతోనే ఎందుకు ఉంచుకుంటారు?" అని అడిగారు.

"దాన్ని ఎప్పుడూ, నా ఎదురుగా ఉంచుకోవడానికి కారణం ఏమిటంటే... ఇప్పుడు మీరు నన్ను ఎలా గౌరవిస్తున్నారో... ఈ పుర్రె ఉన్న వ్యక్తిని ఒకనాడు కొందరు గౌరవించి ఉంటారు. కానీ ఇప్పుడేమయింది? దాన్ని చూస్తేనే మీకు వెగటు కలుగుతోంది. రేపు నా పుర్రె గతీ అంతేకదా! ఆ సంగతి నిరంతరం గుర్తుంచుకోవడానికే ఈ పుర్రెను ఎల్లప్పుడూ నా ముందు ఉంచుకుంటాను. ఇది ఒక రకంగా నన్ను మెళకువతో ఉంచే గురువు. దానికి నేను కృతజ్ఞుణ్ణి. నిజానికి అది ఒకప్పుడు నన్ను కాపాడింది. ఒక వ్యక్తి నా మీద విపరీతమైన కోపంతో... నా తలమీద పాదరక్షతో కొట్టడానికి వచ్చాడు. ఆ వ్యక్తి మాటలకు, చేతలకు నాకు విపరీతమైన కోపం వచ్చింది. నా సహనాన్ని కోల్పోయి ఏం చేసేవాణ్ణో? ఆ తరువాత ఎంత ఘోరమైన నరకాన్ని అనుభవించేవాణ్ణో? ఆ సమయంలో నా ఎదురుగా ఉన్న పుర్రె... 'ఇప్పుడు నాకు పట్టిన గతే నీకు రేపోమాపో పడుతుంది. అటు పోయేవారు, ఇటు వచ్చేవారు నిన్ను కాలితో తంతారు. ఆ వ్యక్తి ఏదో తెలీక నీ మీద కోపగించాడు. ఆ మాత్రం దానికే నువ్వు రెచ్చిపోతే ఎలా? రేపటి సంగతి ఆలోచించు' అనే ఆలోచనను నాలో రేకెత్తించింది. అది నూరుపాళ్ళూ సత్యమే అని తెలుసుకొన్నాను. "సోదరా! ఇలారా! నీకు ఇష్టం వచ్చినంత సేపు నన్ను కొట్టు, తృప్తిగా తిరిగి వెళ్ళు" అని ఆ వ్యక్తిని ఆహ్వానించాను. అతను వెంటనే తన పాదరక్షలను దూరంగా విసిరేసి, నా కాళ్ళు పట్టుకొని నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు. నాకు ఆ గౌరవాన్ని, ఆ వ్యక్తిలో మార్పును తీసుకువచ్చింది ఈ పుర్రే కదా!" అన్నాడు చువాంగ్.

నేర్చుకోవడానికి సిద్ధపడితే రాయి, రప్ప, చెట్టు, గుట్ట... చివరకు పుర్రె కూడా మనకు విలువైన పాఠాలు నేర్పిస్తాయి, మనల్ని ఉద్ధరిస్తాయి. ఈ సంగతి చువాంగ్‌కు బాగా తెలుసు. కాబట్టే ఒక రోజు రాత్రి శ్మశానంలోంచీ వెళుతూ ఉండగా... చీకట్లో తన కాలికి తగిలిన పుర్రెకు క్షమాపణ చెప్పి, తన నివాసానికి దాన్ని తీసుకువచ్చాడు. దాన్ని గురువులా గౌరవించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

ఆలయదర్శనం

ఆ దేవి దర్శనం ఏడాదికి ఒకసారే!

మంగళాదేవి కన్నగి ఆలయ సందర్శన ఆధ్యాత్మిక యాత్ర మాత్రమే కాదు, సాహస యాత్ర కూడా. చుట్టూ క్రూరమృగాల సంచారం ఉన్న దట్టమైన అడవుల మధ్య ఉన్న ఈ ఆలయంలోకి భక్తులను ఏడాదికి ఒకసారి మాత్రమే అనుమతిస్తారు. కేరళ, తమిళనాడు రాష్ట్రాల సరిహద్దుల్లో కొలువైన మంగళాదేవి కన్నగికి చారిత్రకంగానూ, సాహిత్యపరంగానూ కూడా ప్రాధాన్యం ఉంది.

పశ్చిమ కనుమల్లోని పెరియార్ పులుల అభయారణ్యం వృక్ష, జీవ వైవిధ్యానికి నెలవు. ఈ అరణ్యంలో... సముద్రమట్టానికి దాదాపు అయిదువేల అడుగుల ఎత్తున ఉన్న మంగళాదేవి కన్నగి ఆలయానికి ఎన్నో విశిష్టతలు ఉన్నాయి. దీని నిర్మాణం వెనుక ఆసక్తికరమైన కథ ఉంది.

ఎవరీ కన్నగి?

ప్రాచీన తమిళ సాహిత్యంలో గొప్ప ఇతిహాసాలుగా పరిగణించే అయిదింటిలో 'సిలప్పదికారం' ఒకటి. దీన్ని క్రీస్తుశకం అయిదు, ఆరు శతాబ్దాల మధ్య తమిళ సంగమ సాహిత్య యుగంలో రచించారనేది చరిత్రకారుల అభిప్రాయం. ఒక సామాన్య మహిళ ప్రధాన పాత్రగా రూపొందిన తొలి తమిళ కావ్యం కూడా ఇదే. 'సిలప్పదికారం' కథాంశానికి వస్తే... కోవలన్ అనే ధనికుడైన వ్యాపారితో కన్నగి వివాహం జరిగింది. తన సంపదనంతటినీ ఒక నర్తకి కోసం ఖర్చు చేసిన కోవలన్... పశ్చాత్తాపంతో తిరిగి భార్యను చేరుకున్నాడు. కొత్త జీవితాన్ని మొదలుపెట్టాలని నిర్ణయించుకున్న ఆ దంపతులు... మదురై నగరానికి వెళ్ళారు. అక్కడ కన్నగి కాలి అందెను అమ్మడానికి వెళ్ళాడు. మదురై రాణి కాలి అందె దొంగతనానికి గురి కావడంతో... దానికోసం వెతుకుతున్న భటులు కోవలన్‌ను అనుమానించి బంధించారు. ఎలాంటి విచారణ లేకుండానే రాజు ఆదేశం మేరకు కోవలన్‌కు మరణ శిక్ష అమలు చేశారు. ఈ సంగతి తెలిసిన కన్నగి రాజాస్థానానికి వెళ్ళి, చోరీకి గురైన అందె, కోవలన్ అమ్మబోయిన అందె ఒకటి కాదని నిరూపించింది. దాంతో... ఒక నిరపరాధిని శిక్షించాననే వేదనతో రాజు గుండె పగిలి మరణించాడు. కన్నగి కోపాగ్నికి మదురై నగరం దగ్ధమయింది. ఆ తరువాత పద్నాలుగు రోజుల పాటు కాలినడకన ప్రయాణించిన కన్నగి... ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశమైన వెంగైకనల్ నెడున్ కుంద్రం దగ్గరకు చేరుకుంది. అక్కడ దివ్య రూపంలో ఉన్న తన భర్తను ఆమె కలుసుకుందనీ, వారిద్దరూ ఆకాశంలోకి ఎగిరి అంతర్ధానమైపోయారనీ ఆ ఇతిహాసం చెబుతోంది. ఈ అపూర్వ ఘటనను ప్రత్యక్షంగా చూసినవారు... చేర రాజు సెంగుట్టువన్‌కు వివరించగా... ఆయన ఆ ప్రదేశాన్ని సందర్శించాడనీ, హిమాలయాల నుంచి శిలలను తెప్పించి... కన్నగి ఆలయాన్ని నిర్మించాడనీ స్థల పురాణం వెల్లడిస్తోంది. సెంగుట్టవన్ క్రీస్తుశకం రెండో శతాబ్దానికి చెందినవాడు. కాబట్టి ఈ ఆలయం 1800 ఏళ్ళ నాటిదని స్థానికులు పేర్కొంటున్నారు.

ఎన్నో ఆంక్షల మధ్య...

కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో కన్నగిని దేవతగా ఆరాధించే ఆలయాలు అనేక చోట్ల కనిపిస్తాయి. మంగళాదేవి కన్నగి ఆలయం అడవుల్లో ఉండడం వల్ల చేరుకోవడం కష్టం. దానికి తోడు ఈ ప్రాంతాన్ని అభయారణ్యంగా ప్రకటించడంతో అనేక ఆంక్షలు అమలవుతున్నాయి. ప్రతి సంవత్సరం చైత్ర పౌర్ణమినాడు జరిగే ఉత్సవాలకు మాత్రమే భక్తులను అనుమతిస్తారు. అటవీ, పోలీసు అధికారుల పర్యవేక్షణలో ఈ యాత్ర సాగుతుంది. ఈ ఉత్సవాలను కేరళ, తమిళనాడు ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తాయి. పర్యావరణ పరిరక్షణ కోసం, జంతువుల భద్రత కోసం ఈ ప్రాంతం మీద నిరంతరం నిఘా ఉంటుంది. మామూలు రోజుల్లో ఈ ప్రాంతాన్ని సందర్శించాలంటే... అటవీ అధికారుల అనుమతి తప్పనిసరి. చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయం కావడంతో... దీన్ని యథాతథ స్థితిలో కేరళ పురావాస్తు శాఖ భద్రపరిచింది. ఈ కారణంగా... ఆలయం శిథిలావస్థలో దర్శనమిస్తుంది. దీర్ఘచతురస్రాకారంలోని గ్రానైట్ రాళ్ళను పేర్చినట్టుండే ఈ కట్టడంలో పాండ్య నిర్మాణ శైలి కనిపిస్తుంది. ఇక్కడ మంగళాదేవితో పాటు శివుడు, వినాయకుడు తదితర ఉపాలయాలు ఉన్నాయి. చైత్ర పౌర్ణమినాడు అమ్మవారికి విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయి. ఆమెను దర్శించుకోవడానికి వేల సంఖ్యలో భక్తులు తరలివస్తారు.



ఎలా వెళ్ళాలి?
కేరళలోని ఇడుక్కి జిల్లాలోని కుమిలీ నుంచి సుమారు పది కిలోమీటర్లు, తమిళనాడులోని తేని జిల్లా పళియంకుడి నుంచి ఏడు కిలోమీటర్ల దూరంలో మంగళాదేవి కన్నగి ఆలయం ఉంది. ఇరువైపులా నుంచి ట్రెక్కింగ్ చేయవచ్చు. అయితే కుమిలీ నుంచి జీపుల్లో ప్రయాణించే అవకాశం ఉంది.





ధోనీకి 'చెన్నై' పగ్గాలు

గాయంతో రుతురాజ్ దూరం

చెన్నై: మాజీ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు గట్టి ఝలక్ తగిలింది. ఇప్పటికే నాలుగు వరుస ఓటములతో డీలాపడిన ఈ జట్టుకు.. తాజాగా కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ కూడా దూరమయ్యాడు. అతడి మోచేయి ఫ్రాక్చర్ కావడంతో ఐపీఎల్‌కు అందుబాటులో ఉండడని, ఇక లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లకు ఎంఎస్ ధోనీ సారథిగా వ్యవహరిస్తాడని సీఎస్‌కే ప్రకటించింది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌కే రుతురాజ్ దూరమవుతాడని భావించినా.. ఆఖరి నిమిషంలో బరిలోకి దిగాడు. నేడు కేకేఆర్‌తో చెన్నై జట్టు అమీతుమీ తేల్చుకోనుంది. మరోవైపు తాజా సీజన్‌లో పేలవ ఫామ్‌లో ఉన్న రుతురాజ్ ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో కేవలం 122 పరుగులు మాత్రమే చేశాడు. అటు కెప్టెన్సీలోనూ ప్రభావం చూపలేకపోయాడు. ఇప్పుడతని స్థానంలో త్రిపాఠి, హుడాలలో ఒకరిని తీసుకునే అవకాశముంది. అయితే ఈ ఇద్దరూ ఇదివరకే ఆడి ఫామ్‌లేమితో చోటు కోల్పోవడం గమనార్హం. వీరిద్దరితోపాటు వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన పృథ్వీషాకూ అవకాశముంది.

ఐపీఎల్‌లో నేడు	వేదిక చెన్నై
చెన్నై x కోల్‌కతా	రా.7.30



భారత్‌ను ఫైనల్ చేర్చిన ధీరజ్

» ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1

ఆబన్‌డేల్ (అమెరికా): తెలుగు కుర్రాడు ధీరజ్ బొమ్మదేవర ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్-1లో తన అద్భుత ప్రదర్శనతో భారత రికర్వ్ జట్టును ఫైనల్‌కు చేర్చాడు. స్పెయిన్‌ను 6-2తో ఓడించిన టీమిండియా పతకం ఖరారు చేసుకుంది. వీసా సమస్యల కారణంగా పోటీల ఆరంభానికి కొద్ది గంటల ముందు మాత్రమే అమెరికా చేరుకున్న ధీరజ్..అతాను దాస్, తరుణ్‌దీప్ రాయ్‌లతో కలిసి జట్టును విజయపథంలో నడిపాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత జట్టు చైనాతో తలపడుతుంది. అంతకుముందు జరిగిన మహిళల రికర్వ్ ఈవెంట్‌లో దీపిక కుమారి, అంకితా భకత్, అనుష్క కుమారి త్రయం 2-6 స్కోరుతో అమెరికా చేతిలో ఓటమిపాలైంది. కాగా కాంపౌండ్ పురుషుల విభాగంలో భారత్ ఇప్పటికే కాంస్యం దక్కించుకుంది.

రాహుల్.. జిగేల్

- 'సొంత గడ్డ'పై చెలరేగిన కేఎల్
- ఢిల్లీకి వరుసగా నాలుగో విజయం
- నిరాశపర్చిన బెంగళూరు
- సత్తా చాటిన డీసీ బౌలర్లు

బెంగళూరు: తాజా ఐపీఎల్ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అపజయం లేకుండా దూసుకెళుతోంది. అటు బౌలింగ్.. ఇటు బ్యాటింగ్ విభాగాల్లో అద్భుతంగా రాణిస్తున్న ఈ జట్టు ఖాతాలో వరుసగా నాలుగో విజయం చేరింది. క్లిష్ట పరిస్థితుల్లో కేఎల్ రాహుల్ (53 బంతుల్లో 7 ఫోర్లు, 6 సిక్సర్లతో 93 నాటౌట్) సమయోచిత ఆటతీరు కనబర్చగా.. గురువారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో డీసీ 6 వికెట్ల తేడాతో నెగ్గింది. అటు సొంత గడ్డపై ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఆర్‌సీబీకి ఓటములే ఎదురయ్యాయి. మరోవైపు కెరీర్‌లో ఓనమాలు దిద్దిన చిన్నస్వామి స్టేడియంలోనే రాహుల్ చెలరేగి స్థానిక జట్టుకు ఓటమి రుచి చూపించడం గమనార్హం. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ 20 ఓవర్లలో 7 వికెట్లకు 163 పరుగులు చేసింది. సాల్ట్ (37), డేవిడ్ (37 నాటౌట్), పటీదార్ (25) మాత్రమే రాణించారు. కుల్దీప్, విప్రజ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 17.5 ఓవర్లలో 4 వికెట్లకు 169 పరుగులు చేసి గెలిచింది. స్టబ్స్ (38 నాటౌట్) సహకరించాడు. భువనేశ్వర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రాహుల్ నిలిచాడు.

శతక భాగస్వామ్యంతో..

పిచ్ నుంచి సహకారం లభించడంతో ఆర్‌సీబీ బౌలర్లు ఆరంభంలో వణికించారు. పవర్‌ప్లేలో అతికష్టమ్మీద 39 పరుగులు చేసిన డీసీ మూడు వికెట్లను కూడా కోల్పోయింది. అయితే స్టబ్స్‌తో కలిసి రాహుల్ ఐదో వికెట్‌కు 111 పరుగుల అజేయ భాగస్వామ్యంతో జట్టును గట్టెక్కించాడు. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ డుప్లెసి (2)ను యష్ అవుట్ చేయగా, మరో ఓపెనర్ ఫ్రేజర్ (7), పోరెల్ (7)లను భువీ దెబ్బ తీశాడు. రాహుల్ సైతం ఐదు పరుగుల వద్దే వెనుదిరగాల్సినా.. పటీదార్ డైవింగ్ క్యాచ్ అందుకోలేకపోయాడు. కెప్టెన్ అక్షర్ (15) కూడా నిరాశపరిచాడు. దీంతో 58/4 స్కోరుతో డీసీ ఇబ్బందుల్లో పడింది. కానీ ఈ దశలో రాహుల్ ఎదురుదాడికి దిగాడు. అతడికి స్టబ్స్ నుంచి సహకారం అందింది. 13వ ఓవర్‌లో రాహుల్ 4,6తో 14 పరుగులు రావడంతో డీసీ ఇన్నింగ్స్‌లో వేగం పెరిగింది. ఇక 15వ ఓవర్‌లో మరింతగా చెలరేగిన రాహుల్ 4,4,2,2,4,6తో 22 పరుగులు రాబట్టాడు. 18 బంతుల్లో 18 రన్స్ కావాల్సిన వేళ రాహుల్ 6,4,6తో 13 బంతులుండగానే డీసీ మ్యాచ్‌ను ముగించింది.

ఆరంభం అదిరినా..

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్‌సీబీ ఇన్నింగ్స్ వామ్మో.. అనే రీతిలో ఆరంభమైంది. ఓపెనర్ సాల్ట్ వీర బాదుడుకు జట్టు తొలి 3.4 ఓవర్లలోనే 61 పరుగులతో నిలిచింది. ఆ సమయంలో 220కి పైనే స్కోరు చేస్తారనిపించింది. కానీ ఢిల్లీ బౌలర్ల ధాటికి గతి తప్పిన ఆర్‌సీబీ ఆ తర్వాత 86 బంతుల్లో 66 పరుగులే చేసి ఏడు వికెట్లు కోల్పోయింది. అయితే టిమ్ డేవిడ్ పుణ్యమా చివరి రెండు ఓవర్లలో 36 పరుగులతో సవాల్ విసిరే స్కోరందుకుంది. అంతకుముందు స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే సాల్ట్ 6,4,4,4,6 బాది ఏకంగా 30 పరుగులు రాబట్టాడు. ఇంత జోరు మీదున్న వేళ.. లేని పరుగు కోసం వెళ్లి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది. నాలుగో ఓవర్‌లో కవర్స్ వైపు ఆడిన సాల్ట్ సింగిల్ కోసం ముందుకు కదిలాడు. కానీ కోహ్లీ వారించడంతో వెనక్కి మళ్లిన అతడు కింద పడి క్రీజులోకి చేరుకోలేకపోవడంతో, అటు విప్రజ్ త్రోను అందుకున్న కీపర్ రాహుల్ రనౌట్ చేశాడు. అంతే.. అక్కడి నుంచి ఆర్‌సీబీ ఆట ఒక్కసారిగా తేలిపోయింది. ఐదో ఓవర్‌లో విప్రజ్ రెండు పరుగులే ఇవ్వగా.. ముకేశ్ ఆరో ఓవర్‌ను మెయిడిన్‌గా వేసి మరీ పడిక్కళ్ (1) వికెట్ తీశాడు. ఇక వరుస విరామాల్లో విరాట్ (22), లివింగ్‌స్టోన్ (4), జితేశ్ (3)లను పెవిలియన్‌కు చేర్చిన ఢిల్లీ బౌలర్లు పైచేయి సాధించారు. వాస్తవానికి తొమ్మిది ఓవర్ల వరకు కూడా జట్టు పది పరుగుల రన్‌రేట్‌తోనే ఉంది. కానీ ఆ తర్వాత ఆర్‌సీబీ బ్యాటర్లు భారీ షాట్లు ఆడలేక వికెట్లు సైతం కోల్పోయారు. ఫామ్‌లో ఉన్న కెప్టెన్ పటీదార్ కూడా ఎక్కువసేపు నిలువలేకపోయాడు. అతడిని 15వ ఓవర్‌లో కుల్దీప్ అవుట్ చేశాడు. కానీ రన్స్ కోసం అష్టకష్టాలు పడుతున్న జట్టుకు చివరి రెండు ఓవర్లలో డేవిడ్ ఊపిరిలూదాడు. 19వ ఓవర్‌లో 6,4,6తో 17 రన్స్. ఆఖరి ఓవర్‌లో 6,6,4తో 19 రన్స్ రాబట్టడంతో ఆర్‌సీబీ 160+ స్కోరుతో ఫర్వాలేదనిపించింది.



రాహుల్ (53 బంతుల్లో 93 నాటౌట్)

స్కోరుబోర్డు

బెంగళూరు: సాల్ట్ (రనౌట్) 37; విరాట్ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 22; దేవ్‌దత్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 1; పటీదార్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 25; లివింగ్‌స్టోన్ (సి) అశుతోష్ (బి) మోహిత్ 4; జితేశ్ (సి) రాహుల్ (బి) కుల్దీప్ 3; క్రునాల్ (సి) అశుతోష్ (బి) విప్రజ్ 18; డేవిడ్ (నాటౌట్) 37; భువనేశ్వర్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 163/7; వికెట్ల పతనం: 1-61, 2-64, 3-74, 4-91, 5-102, 6-117, 7-125; బౌలింగ్: స్టార్క్ 3-0-35-0; అక్షర్ 4-0-52-0; విప్రజ్ 4-0-18-2; ముకేశ్ 3-1-26-1; కుల్దీప్ 4-0-17-2; మోహిత్ 2-0-10-1.

ఢిల్లీ: డుప్లెసి (సి) పటీదార్ (బి) యశ్ దయాళ్ 2 ; మెక్‌గుర్క్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; అభిషేక్ (సి) జితేశ్ (బి) భువనేశ్వర్ 7; రాహుల్ (నాటౌట్) 93, అక్షర్ (సి) డేవిడ్ (బి) సుయాశ్ 15, స్టబ్స్ (నాటౌట్) 38, ఎక్స్‌ట్రాలు 7, మొత్తం: 17.5 ఓవర్లలో 169/4; వికెట్లపతనం: 1-9, 2-10, 3-30, 4-58; బౌలింగ్: భువనేశ్వర్ 4-0-26-2, యశ్ దయాళ్ 3.5-0-45-1, హాజిల్‌వుడ్ 3-0-40-0, సుయాశ్ 4-0-25-1, కృనాల్ 2-0-19-1, లివింగ్‌స్టోన్ 1-0-14-0.

1 ఐపీఎల్‌లో వెయ్యి బౌండరీలు బాదిన తొలి బ్యాటర్‌గా విరాట్.

ఒలింపిక్స్‌కు క్రికెట్ కిక్

- ఆరు జట్లు.. టీ20 ఫార్మాట్
- ఆతిథ్య అమెరికాకు బెర్త్ ఖరారు
- ఐసీసీ ర్యాంకుల ఆధారంగా మిగతా ఐదు?

న్యూఢిల్లీ: లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్‌కు చోటు ఖరారైంది. 2028లో జరిగే విశ్వక్రీడల్లో కొత్తగా ఐదు క్రీడలకు అవకాశం కల్పిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. దీంతో 128 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో మళ్లీ క్రికెట్ సందడి చేయనుంది. 1900లో పారిస్‌లో జరిగిన మెగా క్రీడల్లో క్రికెట్‌కు తొలి.. చివరిసారి చోటు దక్కింది. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ ఈవెంట్‌ను టీ20 ఫార్మాట్‌లో నిర్వహించనున్నారు. పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు చొప్పున ఆడనున్నాయి. అయితే, అర్హత ప్రక్రియను త్వరలో ఖరారుచేస్తారు. ఆతిథ్య హోదాలో అమెరికాకు ఓ బెర్త్ ఖరారు కాగా.. మిగతా ఐదు స్థానాల కోసం జట్లు పోటీ పడనున్నాయి. కటాఫ్ తేదీకి ముందు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5లో నిలిచిన జట్లకు ఒలింపిక్ బెర్త్‌లు దక్కే చాన్సుంది. ఐసీసీ ఈవెంట్ల తరహాలోనే ప్రతి టీమ్‌లో 15 మంది ఉంటారు. ఈసారి రికార్డు స్థాయిలో 351 మెడల్ ఈవెంట్లు నిర్వహించాలని అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ ఎగ్జిక్యూటివ్ బోర్డ్ నిర్ణయం తీసుకొంది. ఈ ఒలింపిక్స్‌లో క్రికెట్‌తోపాటు సాఫ్ట్‌బాల్, స్క్వాష్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లక్రాస్ (సిక్సెస్)కు చోటు దక్కింది.

క్వార్టర్స్‌లో అర్జున్ ఓటమి

పారిస్: ఫ్రీస్టైల్ చెస్ గ్రాండ్‌స్లామ్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి నాకౌట్‌లో చుక్కెదురైంది. క్వార్టర్ ఫైనల్స్‌లో హికరు నకమురా (అమెరికా) చేతిలో ఇరిగేసి 0.5-1.5తో ఓటమి పాలయ్యాడు. రెండో రౌండ్ గేమ్‌లో నల్లపావులతో ఆడిన అర్జున్.. 62 ఎత్తుల్లో ప్రత్యర్థికి తలవంచాడు. కాగా, తొలి రౌండ్ గేమ్ డ్రాగా ముగిసిన సంగతి తెలిసిందే. సెమీస్‌లో కార్ల్‌సన్‌తో కరువానా, నకమురాతో విన్సెంట్ కీమర్ తలపడనున్నారు.

సురుచి జంటకు కాంస్యం

బ్యూనస్ ఎయిర్స్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో సురుచి-సౌరభ్ చౌదరి జంట కంచు మోత మోగించింది. 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ విభాగంలో సహచరుల మధ్య జరిగిన కాంస్య పోరులో సురుచి-సౌరభ్ 16-8తో మను భాకర్-రవీందర్ సింగ్‌పై గెలిచింది. చైనా జోడీలు స్వర్ణ, రజత పతకాలు దక్కించుకొన్నాయి. కాగా, టోర్నీలో సురుచికి ఇది రెండో పతకం. ఇప్పటి వరకు భారత్ 4 స్వర్ణాలు సహా 8 పతకాలతో రెండో స్థానంలో కొనసాగుతోంది.

పోరాడి ఓడిన సింధు

● ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

నింగ్బో (చైనా): ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు పోరాటం ముగిసింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో జోడీ క్వార్టర్స్‌లోకి ప్రవేశించింది. గురువారం వరల్డ్ నెంబర్ 4 యమగూచి (జపాన్)తో గంటా ఆరు నిమిషాల పాటు జరిగిన సుదీర్ఘ పోరులో ప్రపంచ 17వ ర్యాంకర్ సింధు పోరాడి ఓడింది. సింగిల్స్ రెండో రౌండ్‌లో సింధు 12-21, 21-16, 16-21తో యమగూచి చేతిలో పరాజయం పాలైంది. యమగూచితో పోరులో సింధు ఓడడం ఇది పన్నెండో సారి. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీక్వార్టర్స్‌లో ధ్రువ్-తనీషా జంట 12-21, 21-16, 21-18తో హాంగ్ వీ-నికోల్ చాన్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచి ముందంజ వేసింది. ఇదే విభాగంలో పోటీ పడిన మరో భారత జంట సూర్య-అమృత ఓటమి పాలైంది. పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రియాన్షు రజావత్ 14-27, 17-21 స్కోరుతో కొడై నరోకా (జపాన్) చేతిలో వరుసగా రెండు గేమ్‌ల్లో ఓడాడు. ప్రియాన్షుతో పాటు కిరణ్ జార్జ్ కూడా రెండో రౌండ్‌లో ఓడి ఇంటిముఖం పట్టాడు. డబుల్స్‌లో హరిహరణ్-రుబాన్ కుమార్ జోడీ కూడా ఓటమి చవి చూసింది.



రష్మిక హ్యాట్రిక్ విజయం



పుణె: బిల్లీ జీన్ కింగ్ కప్‌లో హైదరాబాద్ అమ్మాయి భమిడిపాటి శ్రీవల్లి రష్మిక హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసింది. పుణెలో జరుగుతున్న ఈ కప్ గ్రూప్ దశ మూడో మ్యాచ్‌లో భారత్ 2-1తో హాంకాంగ్‌పై గెలిచింది. తొలి సింగిల్స్ పోరులో వైదేహి చౌదరి 7-6, 6-1తో హో చింగ్ వుపై, రెండో సింగిల్స్‌లో రష్మిక 7-6, 2-6, 6-3తో హాంగ్ వీ వాంగ్‌పై గెలిచారు. డబుల్స్‌లో అంకిత-ప్రార్థన జోడీ ఓటమిపాలైంది. కాగా ఇప్పటివరకు ఈ కప్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండింట్లో నెగ్గింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	5	4	1	0	8	1.413
ఢిల్లీ	4	4	0	0	8	1.278
బెంగళూరు	5	3	2	0	6	0.539
పంజాబ్	4	3	1	0	6	0.289
లఖ్‌నవూ	5	3	2	0	6	0.078
కోల్‌కతా	5	2	3	0	4	-0.056
రాజస్థాన్	5	2	3	0	4	-0.733
ముంబై	5	1	4	0	2	-0.010
చెన్నై	5	1	4	0	2	-0.889
హైదరాబాద్	5	1	4	0	2	-1.629

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

బిజినెస్

టీసీఎస్.. ప్చ్!

క్యూ4 లాభంలో 1.68% క్షీణత

» రూ.12,224 కోట్లకు పరిమితం

» ఆదాయం రూ.64,479 కోట్లు

ఒక్కో షేరుకు రూ.30 డివిడెండ్



టీసీఎస్ సీఈఓ కృతివాసన్

ముంబై: మార్చితో ముగిసిన 2024-25 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక (క్యూ4) ఆర్థిక ఫలితాల సీజన్ నిరాశాజనకంగా ప్రారంభమైంది. దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) పనితీరు మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. క్యూ4లో టీసీఎస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 1.68 శాతం తగ్గి రూ.12,224 కోట్లకు పరిమితమైంది. ఆదాయం మాత్రం 5.3 శాతం వృద్ధితో రూ.64,479 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలానికి స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయం వార్షిక ప్రాతిపదికన 2.5 శాతం పెరిగింది. నిర్వహణ మార్జిన్ 24.2 శాతంగా, నికర మార్జిన్ 19 శాతంగా నమోదైంది. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను టీసీఎస్ తన వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.30 తుది డివిడెండ్ ప్రకటించింది. డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలోనూ ఒక్కో షేరుకు రూ.10 మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.66 ప్రత్యేక డివిడెండ్‌ను సైతం చెల్లించింది. క్యూ1, క్యూ2ల్లోనూ రూ.10 చొప్పున డివిడెండ్ పంచింది.

3,000 కోట్ల డాలర్లు దాటిన వార్షికాదాయం

పూర్తి ఆర్థిక సంవత్సరానికి మాత్రం కంపెనీ నికర లాభం 5.76 శాతం పెరుగుదలతో రూ.48,553 కోట్లకు, ఆదాయం 5.99 శాతం వృద్ధితో రూ.2,55,324 కోట్లకు (అమెరికా కరెన్సీలో 3,000 కోట్ల డాలర్ల పైమాటే) చేరుకుంది. కంపెనీ వార్షికాదాయం తొలిసారిగా 3,000 కోట్ల డాలర్ల స్థాయిని చేరుకోవడంతో పాటు వరుసగా రెండో త్రైమాసికంలో బలమైన ఆర్డర్ బుక్‌ను సాధించడం సంతోషంగా ఉందని టీసీఎస్ సీఈఓ కే కృతివాసన్ అన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ ఆవిష్కరణల్లో అనుభవంతో పాటు కస్టమర్లతో సత్సంబంధాలు, అంతర్జాతీయ వ్యాప్తి ప్రస్తుత ఆర్థిక అనిశ్చితిలో క్లయింట్లకు కంపెనీని దన్నుగా నిలిపాయన్నారు. కస్టమర్ల కీలక ప్రాధాన్యాల సాధనలో తోడ్పడే విషయంలో తాము కట్టుబడి ఉన్నామన్నారు.

1,220 కోట్ల డాలర్ల కాంట్రాక్టులు

మార్చితో ముగిసిన త్రైమాసికంలో 1,220 కోట్ల విలువైన కాంట్రాక్టులను దక్కించుకున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి లభించిన కాంట్రాక్టులు 3,940 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

సీఓఓగా ఆర్తి సుబ్రమణియన్

టీసీఎస్ రెండు కీలక నియామకాలను జరిపింది. ఆర్తి సుబ్రమణియన్‌ను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీఓఓ)గా ఐదేళ్ల కాలానికి నియమించినట్లు కంపెనీ తెలిపింది. మే 1 నుంచి సుబ్రమణియన్ కొత్త బాధ్యతలను చేపట్టనున్నారు. ప్రస్తుతం ఆమె టాటా సన్స్‌లో గ్రూప్ చీఫ్ డిజిటల్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. టీసీఎస్‌లో డైరెక్టర్ కూడా. కాగా, మంగేశ్ సాథే‌ను చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా నియమించినట్లు టీసీఎస్ ప్రకటించింది.

సుంకాలతో సవాళ్లే..

గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈసారి ఆదాయం మరింత మెరుగుపడనుందని టీసీఎస్ సారథి కృతివాసన్ ధీమా వ్యక్తం చేశారు. అయితే, ట్రంప్ సుంకాలతో ఐటీ సేవల రంగమూ సవాళ్లు ఎదుర్కోనుందన్నారు. సుంకాలతో ఆర్థిక అనిశ్చితి పెరిగి నేపథ్యంలో క్లయింట్లు ఐటీ వ్యయ నిర్ణయాలను జాప్యం చేస్తున్నారు. కొందరు ప్రాజెక్టులను నిలిపివేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అయినప్పటికీ, భారీ ప్రాజెక్టులు జాప్యం కాలేదన్నారు. మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడుతోందని, క్లయింట్ల ఐటీ వ్యయాలు క్రమంగా పుంజుకుంటున్నాయని మూడు నెలల క్రితం చెప్పాం. కానీ, సుంకాల కారణంగా పరిస్థితులు మళ్లీ మారాయన్నారు.

జీతాల పెంపు వాయిదా

ట్రంప్ సుంకాలతో అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితులు మరింత పెరిగిన నేపథ్యంలో ఉద్యోగులకు ఏప్రిల్ నుంచి అమలు చేయాల్సి ఉన్న జీతాల పెంపును వాయిదా వేసినట్లు టీసీఎస్ వెల్లడించింది. మార్కెట్లో ఆర్థిక అనిశ్చితులు తగ్గుముఖం పట్టి, భవిష్యత్‌పై కొంత స్పష్టత వచ్చాక సరైన సమయంలో వేతనాలను పెంచనున్నట్లు చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు.

ఈసారి 42,000 ఫ్రెషర్ల నియామకాలు

గత ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 42,000 మంది ఫ్రెషర్లను కంపెనీలో చేర్చుకున్నట్లు టీసీఎస్ చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ మిలింద్ లక్కడ్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 42,000 మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్లు ఆయన చెప్పారు. 2024-25 క్యూ4లో టీసీఎస్ ఉద్యోగుల సంఖ్య నికరంగా 625 పెరిగి మొత్తం 6,07,979కి చేరింది. పూర్తి ఆర్థిక సంవత్సరంలో ఉద్యోగుల నికర పెరుగుదల 6,433గా నమోదైంది. కాగా, అంతక్రితం ఆర్థిక సంవత్సరం (2023-24)లో మాత్రం ఉద్యోగుల సంఖ్య 13,200కు పైగా తగ్గింది. కాగా, మార్చి త్రైమాసికంలో టీసీఎస్ ఉద్యోగుల వలసల (అట్రిషన్) రేటు 13.3 శాతానికి పెరిగింది. అంతక్రితం త్రైమాసికంలో ఇది 13 శాతంగా ఉంది.

ప్రపంచ టాప్ 100లో హైదరాబాద్ విమానాశ్రయం

56వ స్థానం కైవసం.. ఢిల్లీ, బెంగళూరు, ముంబైలకూ స్థానం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారత విమానయాన రంగం అద్భుతమైన పురోగతి సాధిస్తోంది. పచ్చగా కళకళలాడుతూ, పరిశుభ్రంగా కనిపించడంలో దేశంలోని విమానాశ్రయాలు అంతర్జాతీయ విమానాశ్రయాలతో పోటీ పడుతున్నాయి. ఫలితంగా ఈ ఏడాది ప్రపంచంలోని టాప్ 100 విమానాశ్రయాల జాబితాలో మన దేశంలోని నాలుగు విమానాశ్రయాలకు స్థానం దక్కింది. అంతర్జాతీయ ఎయిర్ ట్రావెల్ రేటింగ్ సంస్థ స్కైట్రాక్స్ ప్రకటించిన ర్యాంకుల ప్రకారం హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం 56వ స్థానంలో నిలిచింది. పరిశుభ్రత, స్నేహపూర్వకంగా వ్యవహరించే సిబ్బంది, ప్రయాణికుల అనుభూతిపరంగా ఈ ర్యాంకు దక్కించుకుంది. దేశంలోనే అత్యంత రద్దీ గల విమానాశ్రయంగా పేరొందిన ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ఆధునిక టెర్మినల్స్, కళాకృతుల ప్రదర్శన, సమర్థవంతమైన ఇమ్మిగ్రేషన్, మంచి కనెక్టివిటీతో 32వ స్థానంలో నిలిచింది. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయం 48, ముంబైలోని ఛత్రపతి శివాజీ మహరాజ్ అంతర్జాతీయ విమానాశ్రయం 73 స్థానాల్లో నిలిచాయి. టాప్ 100లో స్థానం సంపాదించడమే కాదు...గత ఏడాదితో పోల్చితే మన విమానాశ్రయాలు ర్యాంకింగ్‌ను కూడా గణనీయంగా పెంచుకున్నాయి. ఢిల్లీ విమానాశ్రయం గత ఏడాది 36వ స్థానంలో ఉండగా ఈ ఏడాది 32వ స్థానానికి ఎగబాకింది. అలాగే హైదరాబాద్ విమానాశ్రయం ర్యాంకింగ్ గత ఏడాదితో పోల్చితే 59వ స్థానం నుంచి 56వ స్థానానికి ఎదిగింది. అయితే ప్రపంచ టాప్ 20 విమానాశ్రయాల్లో మాత్రం మన దేశానికి చెందిన ఏ విమానాశ్రయానికి స్థానం దక్కలేదు. ఇదిలా ఉండగా ప్రపంచంలోనే అత్యుత్తమమైన విమానాశ్రయంగా సింగపూర్‌కి చెందిన చాంగి ఎయిర్‌పోర్ట్ నిలిచింది. విలాసవంతంగా కనిపిస్తూ సౌకర్యం, వినోదంలో కూడా తిరుగులేనిదిగా పేరొందిన ఈ విమానాశ్రయానికి ఈ స్థానం దక్కడం ఇది 13వ సారి.

అమెరికా మార్కెట్లు మళ్లీ డౌన్

బుధవారం అనూహ్యంగా దూసుకుపోయిన అమెరికా స్టాక్ మార్కెట్లు గురువారం మళ్లీ పతన బాట పట్టాయి. ఆరంభంలో లాభాలతో ప్రారంభమైనప్పటికీ చైనాపై సుంకాలను 145 శాతానికి పెంచుతున్నట్లు ట్రంప్ ప్రకటించటంతో సూచీలు మళ్లీ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ ఏకంగా 5 శాతానికి పైగా నష్టపోగా డౌజోన్స్ 4 శాతం, నాస్‌డాక్ 5.7 శాతానికి పైగా నష్టపోయాయి.

భగ్గుమన్న పసిడి ధర

ఔన్స్ 3,183 డాలర్లు

అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర మరో రికార్డు స్థాయికి చేరింది. న్యూయార్క్ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి (24 కేరట్స్) బంగారం ధర భారత కాలమానం ప్రకారం గురువారం రాత్రి 10 గంటలకు రికార్డు స్థాయిలో 3,183 డాలర్లకు (సుమారు రూ.2,75,460) చేరింది. బుధవారం ముగింపు ధరతో పోలిస్తే ఇది 3.28 శాతం (103 డాలర్లు) ఎక్కువ. ప్రధాన కరెన్సీలతో అమెరికా డాలర్ బక్కచిక్కడం, అమెరికా-చైనా మధ్య ముదురుతున్న వాణిజ్య యుద్ధం, మార్కెట్ల పతనం ఇందుకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	390	విజయవాడ	420
వరంగల్	392	గోదావరి	415
చిత్తూరు	460	విశాఖపట్నం	435
		డజను గుడ్లు రూ. 60	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	93,380 ▲	85,600 ▲	1,07,000 ▲
విజయవాడ	93,500 ▲	86,500 ▼	94,000 ▲
విశాఖపట్నం	91,180 ▲	83,580 ▲	91,770 ▲
రాజమండ్రి	93,380 ▲	85,600 ▲	93,500 ▲
ప్రొద్దుటూరు	92,300 ▲	84,920 ▲	92,300 ▼
ముంబై	90,161 ▲	82,588 ▲	90,669 ▲

'ఎఫ్‌డీ'లపైనా తగ్గుతున్న వడ్డీ రేటు

న్యూఢిల్లీ: ఫిక్స్‌డ్ డిపాజిట్ల (ఎఫ్‌డీ) పైనా బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గిస్తున్నాయి. వివిధ కాలపరిమితుల ఎఫ్‌డీలపై చెల్లించే వడ్డీ రేటును పావు శాత (0.25%) తగ్గించినట్టు కోటక్ మహీంద్రా బ్యాంక్, కెనరా బ్యాంక్ ప్రకటించాయి. బుధవారం నుంచే ఈ తగ్గింపు అమల్లోకి వచ్చినట్టు తెలిపాయి. ఆర్‌బీఐ రెపో రేటును 0.25 శాతం తగ్గించటంతో ఈ బ్యాంకులు ఆ మేరకు తగ్గిస్తున్నట్టు ప్రకటించాయి. కాగా సీనియర్ సిటిజన్ల ఎఫ్‌డీలపై మాత్రం ఎప్పటిలాగానే అర శాతం వడ్డీ అధికంగా లభిస్తుంది. మరోవైపు బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) కూడా తన ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ రుణాలపై వడ్డీ రేటును పావు శాతం తగ్గిస్తున్నట్టు ప్రకటించింది.

భారత వృద్ధి 6.1 శాతమే: మూడీస్

అమెరికా ప్రతీకార సుంకాల ప్రభావం వల్ల 2025 సంవత్సరంలో భారత వృద్ధిరేటును మూడీస్ 6.1 శాతానికి కుదించింది. గతంలో ఈ సంస్థ ప్రకటించిన అంచనా 6.4 శాతం. భారత వస్తు దిగుమతులపై 26% సుంకాలు పడినట్టయితే వాణిజ్య సమతుల్యత దెబ్బ తింటుందని పేర్కొంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	110	విజయవాడ	125
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	83
కర్నూలు	110	నెల్లూరు	88
విశాఖపట్నం	119	అనంతపురం	88
గోదావరి	125		

భారత్ నుంచి అమెరికాకు 600 టన్నుల ఐఫోన్ల తరలింపు

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాల భారాన్ని తప్పించుకునేందుకు టెక్నాలజీ దిగ్గజం యాపిల్ హుటాహుటిన చర్యలు చేపట్టింది. సుంకాలు అమల్లోకి రాకముందే భారత్ నుంచి అమెరికాకు 6 కార్గో విమానాల ద్వారా 600 టన్నుల బరువున్న 15 లక్షల ఐఫోన్లను తరలించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఇందుకోసం భారత్‌లోని యాపిల్ థర్డ్ పార్టీ వెండార్ల ప్లాంట్లలో ఉత్పత్తిని అమాంతం పెంచింది. విమానాల ద్వారా సరుకు రవాణాకు కస్టమ్స్ అనుమతులు అవసరం. ఇందుకు సాధారణంగా పట్టే 30 గంటల సమయాన్ని 6 గంటలకు తగ్గించాలని భారత ఎయిర్‌పోర్ట్ అధికారులతోనూ యాపిల్ లాబీయింగ్ జరిపినట్లు తెలిసింది. చెన్నై ఎయిర్‌పోర్ట్ ద్వారా కంపెనీ ఐఫోన్లను అమెరికాకు తరలించింది.

'లులు' చేతికి మంజీరా మాల్

దివాలా పరిష్కార ప్రక్రియ ద్వారా రూ.318 కోట్లకు కొనుగోలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దివాలా పరిష్కార ప్రక్రియలో ఉన్న హైదరాబాద్, కూకట్‌పల్లిలోని మంజీరా మాల్ భవనం.. అంతర్జాతీయ రిటైల్ సంస్థ లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ పరమైంది. మంజీరా మాల్ రుణదాతలకు రూ.318.42 కోట్లు చెల్లించేందుకు లులు ఇంటర్నేషనల్ చేసిన ప్రతిపాదనకు రుణదాతల కమిటీ (సీఓసీ), ఎన్‌సీఎల్‌టీ, హైదరాబాద్ బెంచ్ ఆమోదం తెలపడంతో ఇది సాధ్యమైంది. ప్రస్తుతం ఇదే భవనంలో లులు మాల్ అద్దె పద్ధతిలో తన భారీ రిటైల్ మాల్ నిర్వహిస్తోంది. ఇప్పుడు ఏకంగా ఈ భారీ మాల్ భవనానికి యజమాని కాబోతోంది.

2023లో దివాలా పిటిషన్ దాఖలు: మంజీరా మాల్‌ను ప్రముఖ పారిశ్రామికవేత్త జీ యోగానంద్ మంజీరా రిటైల్ హోల్డింగ్స్ పేరుతో ప్రమోట్ చేశారు. అయితే తమకు చెల్లించాల్సిన రూ.317.30 కోట్ల బకాయిలను చెల్లించలేక పోవడంతో రుణదాతలైన క్యాటలిస్ట్ ట్రస్టీషిప్ లిమిటెడ్, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ 2023 జూలైలో మంజీరా రిటైల్ హోల్డింగ్స్‌పై జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ), హైదరాబాద్ బెంచ్‌లో దివాలా పిటిషన్ దాఖలు చేశాయి. మొత్తం 49 సంస్థలు ఈ మాల్‌పై ఆసక్తి చూపించినప్పటికీ చివరికి ఏడు సంస్థలు మాత్రమే పోటీలో నిలిచాయి. అందులో అత్యధికంగా కోట్ చేసిన లులు ఇంటర్నేషనల్ షాపింగ్ మాల్స్ బిడ్‌కు ఎన్‌సీఎల్‌టీ, సీఓసీ ఆమోదం తెలిపాయి.

విద్యార్థి వీసా రద్దయితే ఇంటికేనా?

- 15 రోజుల్లోగా అమెరికా వీడాలని నిబంధన
- అయోమయంలో వేలాది భారత విద్యార్థులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: గ్రీన్‌కార్డులు రద్దవుతున్నాయి. తాత్కాలిక వర్క్ వీసాలపై కత్తి వేలాడుతోంది.. ఏఐ సాంకేతికతను వినియోగించి మరీ విద్యార్థులను దేశం నుంచి బహిష్కరిస్తున్నారు.. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న చాలామంది భారతీయుల పరిస్థితి ఇదే. దీనికితోడు ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడ్డారని.. డ్రైవింగ్ లైసెన్స్ లేదని ఇలా చిన్నచిన్న సాకులతోనూ భారత్ సహా పలువురు అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను ట్రంప్ సర్కారు రద్దు చేస్తోంది. వీరంతా వీసా రద్దయిన 15రోజుల్లోగా స్వీయ బహిష్కరణ కింద సీబీపీ యాప్‌లో తమ పేర్లు నమోదు చేసుకొని, స్వదేశాలకు తిరిగి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో అమెరికా చట్టాలు ఏం చెబుతున్నాయో బాధిత విద్యార్థులకు ఇమిగ్రేషన్ నిపుణులు సూచిస్తున్నారు.

అమెరికాలో మనోళ్లే అధికం

అమెరికాలోని అంతర్జాతీయ విద్యార్థుల్లో భారత్‌కు చెందినవారే అత్యధికం. 2023-24లో అమెరికాలో 11,26,690 మంది విదేశీ విద్యార్థులు ఉన్నారు. వీరిద్వారా ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు 43.8 బిలియన్ డాలర్ల ఆదాయం లభించడంతో పాటు 3,78,000 ఉద్యోగాల కల్పన జరిగింది. 2024 నవంబరునాటికి అమెరికాలోని చైనా విద్యార్థుల సంఖ్యను భారత్ అధిగమించింది. అయితే 2023తో పోలిస్తే 2024లో భారత విద్యార్థులకు ఆమోదించిన వీసాల సంఖ్య 34శాతం తక్కువ. ఇప్పుడు కాలేజీల్లో చదివే విద్యార్థుల వీసాలను ట్రంప్ ప్రభుత్వం రద్దు చేస్తోంది. వలసదారుల విషయంలో ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన వైఖరితో విద్యార్థి వీసాలను అధికారులు రద్దు చేస్తున్నారు. దీంతో లక్షలాది మంది భారత విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పాలస్తీనాకు మద్దతుగా క్యాంపస్‌ల్లో చేపట్టిన ఆందోళనలకు మద్దతు పలికారన్న ఆరోపణలపై ఇటీవల కొందరు విదేశీ విద్యార్థులను దేశంనుంచి బహిష్కరించారు. ఇప్పుడీ నిరసనలతో ఏ సంబంధంలేకున్నా వీసాలు రద్దు చేస్తున్నారు. ఈ జాబితాలో హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, మిచిగాన్, ఒహియో తదితర ప్రతిష్ఠాత్మక వర్సిటీలు, కాలేజీలున్నాయి.

ఇమిగ్రేషన్ లాయర్ల సంఘం నోట్

అకస్మాత్తుగా వీసా రద్దవడంతో పలువురు భారతీయ విద్యార్థులు స్వీయ బహిష్కరణకు గురవుతున్నారు. దీంతో బాధితులు న్యాయ సహాయం పొందాలని పలు విద్యాసంస్థలు సూచిస్తున్నాయి. 'అంతర్జాతీయ విద్యార్థులపై ఇమిగ్రేషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు'అనే అంశంపై అమెరికన్ ఇమిగ్రేషన్ లాయర్ల సంఘం ఇటీవల ఓనోట్ విడుదల చేసింది. అందులో స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (సెవిస్) రికార్డు తొలగింపు అంశంలో విదేశీ విద్యార్థులు ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశాలున్నాయో వివరించింది. ఇక వీసా రద్దైన సమయంలో విద్యార్థులు ఏ ఉద్యోగం చేయడం, ఇంటర్న్‌షిప్‌లో, విద్యాసంబంధమైన ప్రాక్టికల్స్ శిక్షణలో పాల్గొనడం కుదరదు. ఎస్ఈవీఐఎస్ రికార్డును పునరుద్ధరణకు నిరాకరించిన సందర్భంలో దానిపై సమీక్షించే అధికారం ఇమిగ్రేషన్ న్యాయమూర్తులకు కూడా ఉండదు. విద్యార్థి వీసా రద్దయితే వారు స్వదేశానికి తిరిగి వెళ్లిపోవడానికి అవసరమైన ప్రక్రియను పూర్తి చేయడానికే అమెరికాలో ఉండటానికి అనుమతి లభిస్తుంది. అయితే తమపై ఉన్న కేసును సవాల్ చేసే హక్కు, సొంత ఖర్చులతో న్యాయ నిపుణులను నియమించుకొని కోర్టులో పోరాడే హక్కు వారికి ఉంటుంది. ఇక భారత విద్యార్థులు, దరఖాస్తుదారులకు ఇమిగ్రేషన్.కామ్ మేనేజింగ్ అటార్నీ రాజీవ్ ఖన్నా మార్గదర్శకాలు జారీ చేశారు. విద్యార్థులు తమ ఈమెయిల్‌ను తాజా అప్‌డేట్ల కోసం నిరంతరం పర్యవేక్షించాలని, విద్యాసంస్థలో వారి అడ్మిషన్, అకడమిక్ స్టేటస్ రికార్డులు వెంట ఉంచుకోవాలన్నారు. వర్సిటీలు, ఇమిగ్రేషన్ న్యాయవాదుల మద్దతు అమెరికాలోని చాలామంది భారత విద్యార్థులకు ఉపశమనం కలిగే అవకాశం ఉంది.

యూదు వ్యతిరేక పోస్టులు పెడితే వీసా రద్దు

- శాశ్వత నివాసానికి అనుమతులూ నిరాకరిస్తాం.. యూఎస్‌సీఐఎస్ ప్రకటన
- విద్యార్థి వీసా, గ్రీన్‌కార్డు దరఖాస్తుదారులకు హెచ్చరికలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 10: సామాజిక మాధ్యమాల్లో యూదు వ్యతిరేక పోస్టులు పెట్టేవారికి వీసాలు మంజూరు చేయబోమని అమెరికా స్పష్టం చేసింది. ఈ నిబంధన తక్షణమే అమలులోకి వస్తుందని అమెరికా పౌరసత్వ, వలసల విభాగం (యూఎస్‌సీఐఎస్) అధికారికంగా ప్రకటించింది. విద్యార్థి వీసాతోపాటు గ్రీన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వారి సోషల్ మీడియా ఖాతాలను జల్లెడ పడతామని, యూదు వ్యతిరేక కంటెంట్ పోస్టు చేసేవారికి వీసా నిరాకరిస్తామని ఇమిగ్రేషన్ అధికారులు స్పష్టం చేశారు. ఇప్పటికే అమెరికాలో ఉంటున్నవారు ఇటువంటి చర్యలకు పాల్పడితే వారి శాశ్వత నివాస అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. హమాస్, లెబనాన్ హెజ్‌బొల్లా, యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులతో సహా ఉగ్రసంస్థలుగా అమెరికా వర్గీకరించిన మిలిటెంట్ గ్రూపులకు మద్దతుగా పోస్టులు పెట్టడాన్ని యూదు వ్యతిరేక చర్యలుగా పరిగణిస్తామని యూఎస్‌సీఐఎస్ తేల్చిచెప్పింది. యూదు వ్యతిరేక ఉగ్రవాదాన్ని, ఆ తీవ్రవాద సంస్థల కార్యకలాపాలను సమర్థించడం, ప్రోత్సహించడం, వాటికి మద్దతుగా సోషల్ మీడియాలో ప్రచారం చేయడాన్ని ప్రతికూల అంశాలుగా పరిగణిస్తామని, దీనికి తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించింది. గత కొన్ని వారాలుగా ట్రంప్ ప్రభుత్వం అమెరికాలోని వందలాది మంది విదేశీ విద్యార్థుల వీసాలను రద్దు చేసిన నేపథ్యంలో తాజా ప్రకటన వెలువడింది.

డీఎస్-160 ఫాం సమర్పిస్తేనే వీసా ఇంటర్వ్యూ

అమెరికా వీసా కోసం దరఖాస్తు చేసేవారు ఇకపై ఇంటర్వ్యూ స్లాట్ బుక్ చేసుకోవడానికి ముందే డీఎస్-160 ఫాంను తప్పనిసరిగా సమర్పించాలి. ఈమేరకు ఆన్‌లైన్ ఫాం, షెడ్యూల్ ప్రక్రియలో అమెరికా విదేశాంగ శాఖ మార్పులు చేసింది. గతంలో దరఖాస్తుదారులు ఫాం సమర్పించడానికి ముందే స్లాట్ బుక్ చేసుకొనే అవకాశం ఉండేది. ఇది కొన్నిసార్లు దరఖాస్తు ప్రాసెసింగ్‌లో జాప్యానికి కారణమవుతోంది. దీంతో తాజా నిర్ణయంతీసుకున్నారు.

అణు కార్యక్రమం విరమించుకోకుంటే సైనిక చర్య : ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్: అణ్వస్త్రాలను సమకూర్చుకోవాలనే ఆలోచనను విరమించుకోకపోతే సైనిక చర్య తప్పదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌ను హెచ్చరించారు. సైనిక చర్యలో ఇజ్రాయెల్ కూడా పాల్గొంటుందన్నారు. శనివారం ఒమన్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. ప్రత్యక్ష చర్చలకు ఒప్పుకోబోమని ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ ఇప్పటికే తేల్చి చెప్పగా, జరగాల్సిందేనని ట్రంప్ పట్టుబడుతున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

విశ్వంభర నుంచి రామ రామ



చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం'విశ్వంభర.' యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై అభిమానుల్లో అంచనాలు తారస్థాయికి చేరుకున్నాయి. ఈ చిత్రం నుంచి తొలి గీతం 'రామ రామ'ను ఈ శనివారం విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చిరంజీవి చుట్టూ పిల్లలు హనుమంతుడి వేషధారణలో ఉన్నారు. అలాగే బ్యాక్‌డ్రాప్‌లో రాముడి విగ్రహం ఉంది. 'రామ రామ' పాటను రామజోగయ్య శాస్త్రి రాయగా, ఎం.ఎం.కీరవాణి స్వరపరిచారు. కాగా, ఈ చిత్రంలో త్రిష కృష్ణన్, ఆశికా రంగనాథ్ హీరోయిన్లు. కునాల్ కపూర్ కీలక పాత్రలో నటిస్తున్నారు.

మా బిడ్డ ఇంటికొచ్చేసాడు : చిరంజీవి

సింగపూర్‌లోని స్కూల్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుమారుడు మార్క్ శంకర్ గాయపడిన విషయం తెలిసిన వెంటనే చిరంజీవి, ఆయన సతీమణి సురేఖతో కలసి అక్కడికి వెళ్లారు. మార్క్ శంకర్ ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ చిరంజీవి ట్వీట్ చేశారు. 'మా బిడ్డ ఇంటికొచ్చేసాడు. అయితే ఇంకా కోలుకోవాలి. మా కులదైవమైన ఆంజనేయ స్వామి కృపతో త్వరలోనే పూర్తి ఆరోగ్యంతో, మళ్లీ ఎప్పటిలానే ఉంటాడు. రేపు హనుమత్ జయంతి, ఆ స్వామి ఓ పెద్ద ప్రమాదం నుంచి ఆ పసిబిడ్డని కాపాడి మాకు అండగా నిలిచాడు. మా కుటుంబానికి అండగా నిలబడి, ఆ బిడ్డకోసం ప్రార్థనలు చేసిన ప్రతి ఒక్కరికీ నా తరపున, తమ్ముడు పవన్ కల్యాణ్ తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నాం' అని చిరంజీవి పేర్కొన్నారు.

వజ్రానికి స్వాగతం



తమిళ నటుడు విజయ్ సేతుపతితో దర్శకుడు పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న విషయం విదితమే. తాజాగా ఈ సినిమాలో టబు భాగమయ్యారు. ఈ మేరకు చిత్రనిర్మాణ సంస్థ పూరి కనెక్ట్స్ ఆమెను ఆహ్వానిస్తూ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టింది. భారతీయ చలనచిత్ర రంగంలో వజ్రంలాంటి టబుకు స్వాగతం అని పూరి కనెక్ట్స్ పేర్కొంది. ఈ చిత్రంలో ఆమె కోసం ఓ అద్భుతమైన పాత్ర సిద్ధంగా ఉంది అని తెలిపింది. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమా షూటింగ్‌ను జూన్‌లో ప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు.

'హ్యాపీ డేస్'కు ముందు నేనూ అలా ఉండేవాణ్ణి

నిఖిల్



యువ కథానాయకుడు దేవన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించిన సూపర్ నేచురల్ లవ్‌స్టోరీకి 'కృష్ణలీల' అని పేరు పెట్టారు. ధన్య బాలకృష్ణ హీరోయిన్. జి. జోత్స్న నిర్మిస్తున్నారు. గురువారం ఈ సినిమా టైటిల్‌ను, మోషన్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమంలో హీరో నిఖిల్ మాట్లాడుతూ 'దేవన్ చాలా ప్యాషన్ ఉన్న నటుడు, దర్శకుడు. 'హ్యాపీ డేస్' చిత్రానికి ముందు నేను కూడా ఓ మంచి అవకాశం కోసం తపించేవాడిని. దేవుడి దయ వల్ల 'హ్యాపీ డేస్' దొరికింది.' అని అన్నారు. దేవన్ మాట్లాడుతూ 'నాకు సినీ జీవితాన్ని ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది' అని చెప్పారు.

రామ్‌చరణ్ ప్రోత్సాహం మరువలేనిది

\- ప్రదీప్ మాచిరాజు



ప్రదీప్ మాచిరాజు, దీపికా పిల్లి జంటగా నటించిన చిత్రం 'అక్కడ అమ్మాయి ఇక్కడ అబ్బాయి'. దర్శక ద్వయం నితిన్, భరత్ దర్శకత్వంలో నిర్మాణ సంస్థ మాంక్స్ అండ్ మంకీస్ నిర్మించింది. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా మేకర్స్ ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ మాచిరాజు మాట్లాడుతూ "అద్భుతమైన టీమ్ వర్క్‌కు నిదర్శనం ఈ సినిమా. రామ్‌చరణ్ 'పెద్ది ఫర్ ప్రదీప్' అని చెప్పడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆయన మా సినిమా మొదటి టికెట్‌ను కొని ప్రోత్సహించడం ఎప్పటికీ మర్చిపోలేని విషయం. ఈ సమ్మర్‌లో కుటుంబమంతా హాయిగా థియేటర్లో కూర్చుని నవ్వుకునేలా చేసే సినిమా ఇది" అని చెప్పారు. "రామాయణంలో ఉడతని శ్రీరాముడు ఎలా ఎలివేట్ చేశారో తెలిసిందే. అలాగే, మా చిత్రాన్ని రామ్‌చరణ్ శ్రీరాముడిలా ఎలివేట్ చేశారు" అని దర్శకుడు భరత్ చెప్పారు. "మొదలైన క్షణం నుంచి ఎండ్ టైటిల్స్ పడేదాకా వినోదాన్ని అందిస్తుందీ సినిమా" అని దర్శకుడు నితిన్ తెలిపారు.

విలన్ల ప్రేమగీతం



అభ్యుదయ దర్శకుడు బాబ్జీ రూపొందించిన 'పోలీస్ వారి హెచ్చరిక' చిత్రం నుంచి ఓ వినూత్న ప్రేమగీతాన్ని సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ విడుదల చేశారు. 'సాధారణంగా హీరోహీరోయిన్లు ప్రేమ గీతాలు పాడుకుంటారు. కానీ ఈ సినిమాలో విలన్లు డ్యూయెట్ పాడుకోవడం ఓ వెరైటీ కాన్సెప్ట్. ఇలాంటి సరికొత్త పాటను ఆవిష్కరించే అవకాశం రావడం ఆనందంగా ఉంది' అని ఆయన చెప్పారు. సెన్సార్ పనులు పూర్తి చేసి త్వరలో సినిమాను విడుదల చేస్తామని దర్శకుడు బాబ్జీ చెప్పారు. త్వరలోనే వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో సినిమాను రిలీజ్ చేస్తామని నిర్మాత బెల్లి జనార్ధన్ చెప్పారు.

ఐసే చడా హై నషా



ఇప్పటికే పలు చిత్రాల్లో హుషారైన ప్రత్యేక గీతాల్లో నర్తించి అభిమానులను అలరించారు తమన్నా భాటియా. ఇప్పుడు మరోసారి ఆమె బాలీవుడ్‌లో ప్రత్యేక గీతంతో మెరవబోతున్నారు. అజయ్ దేవ్‌గణ్ కథానాయకుడిగా నటించిన 'రైడ్ 2' చిత్రంలో ప్రత్యేకగీతం చేశారు తమన్నా. చిత్రబృందం గురువారం ఆ పాటకు సంబంధించిన ప్రోమోను సోషల్ మీడియాలో విడుదల చేయగా వైరల్ అయింది. పూర్తి పాటను నేడు విడుదల చేయనున్నారు. ఇందులో జాక్వెలిన్ ఫెర్నాండేజ్ సైతం నటించారు. జైలర్ చిత్రంలోని 'నువ్వే కావాలయ్యా' పాట తరహాలో నషా సాంగ్ కూడా అభిమానులను ఉర్రూతలూగించడం ఖాయం అనే అభిప్రాయం తమన్నా అభిమానుల నుంచి వినిపిస్తోంది. మే 1న విడుదలవుతున్న ఈ చిత్రంలో వాణీకపూర్ కథానాయిక. రితేశ్ దేశ్‌ముఖ్, సుప్రియా పాఠక్ కీలకపాత్రలు పోషించారు.

ఆ నమ్మకం ఉంది



రచిత మహాలక్ష్మి, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రలు పోషించిన 'తల్లి మనసు' చిత్రం ఇప్పుడు ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. వి.శ్రీనివాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 14 నుంచి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుందని నిర్మాత ముత్యాల అనంతకిశోర్ చెప్పారు. ఈ చిత్ర సమర్పకుడు, సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత ఓ మంచి చిత్రాన్ని చూశామని ప్రేక్షకులు చెప్పడం మాకు ఆనందం కలిగించింది. ఇప్పుడు ఓటీటీ వేదిక ద్వారా మిగిలిన ప్రేక్షకులకు దగ్గరైతే మేం ఏం ఆశించామో ఆ లక్ష్యం నెరవేరుతుందనే నమ్మకం ఉంది' అన్నారు.



తునిలో యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ అయ్యన్న. చిత్రంలో మంత్రులు అనిత, అచ్చెన్న, నారాయణ తదితరులు

యనమల రాజకీయ వ్యూహకర్త

- ఎన్టీఆర్‌కు ముద్దుబిడ్డ: స్పీకర్ అయ్యన్న
- తునిలో యనమల రాజకీయ ప్రస్థానం పుస్తకావిష్కరణ

కాకినాడ, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అద్భుతమైన రాజకీయ వ్యూహకర్త. ఈ రోజుల్లో ఒకసారి గెలిస్తేనే మళ్లీ ఎమ్మెల్యేగా గెలవలేని పరిస్థితులున్నాయి. అలాంటిది 42 ఏళ్ల రాజకీయ ప్రస్థానం అరుదైన రికార్డు. ఎన్టీఆర్‌కు ముద్దుబిడ్డగా యనమల ఎంతో దగ్గరయ్యారు. అటువంటి నేత సేవలు పార్టీకి ఎంతో అవసరం' అని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. కాకినాడ జిల్లా తునిలో గురువారం యనమల 42 ఏళ్ల రాజకీయ ప్రస్థాన సభ గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన అయ్యన్న.. మంత్రి అచ్చెన్నాయుడితో కలిసి యనమల రాజకీయ ప్రస్థానం పుస్తకాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు సభ వద్ద ఫొటోగ్యాలరీని ప్రారంభించారు. మంత్రులు అనిత, నారాయణ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కూడా పాల్గొన్నారు. యనమల ప్రసంగిస్తూ.. రాజకీయాల్లో మంత్రి పదవి ప్రధానం కాదని, మనం వేసిన ముద్రే ప్రధానమని చెప్పారు.

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలో సవరణలు చేయాలి

- ఐఎంఏ అధ్యక్షుడు నందకిశోర్

అమరావతి, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అమలవుతున్న క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టంలో కొన్ని సవరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి నందకిశోర్ అన్నారు. గురువారం ఉదయం విజయవాడలోని ఐఎంఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లినిక్, చిన్న, మధ్య తరహా ఆస్పత్రులు, 50 పడకల లోపు ఉన్న ఆస్పత్రులను ఈ చట్టం నుంచి మినహాయించాలని కోరారు. ఐఎంఏ విన్నపం మేరకు చాలా రాష్ట్రాల్లో 50 పడకల లోపు ఆస్పత్రులను క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం నుంచి మినహాయించారని అన్నారు. వైద్యులపై దాడుల విషయంలో కేంద్ర ప్రభుత్వం సూచించిన విధంగా చట్టంలో సవరణలు చేయాలన్నారు. మందులు, వైద్య పరికరాలపై అధిక జీఎస్టీ విధిస్తున్నారని, హెల్త్ ఇన్సూరెన్స్‌పై కూడా 18శాతం జీఎస్టీ విధిస్తున్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వీటిపై జీఎస్టీని తగ్గించాలని కోరారు.

ఈవీఎంల వినియోగంపై పరిశీలిస్తున్నాం

- స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వెల్లడి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న పంచాయతీరాజ్, పురపాలక సంఘ ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై పరిశీలిస్తున్నామని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని చెప్పారు. సాధ్యాసాధ్యాలపై అధికారులు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై గురువారం ఆమె తిరుపతి జిల్లా అధికారుల సూచనలు, సలహాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాస్టర్ ట్రైనర్ శిక్షణ, భద్రతా బలగాలు, మానవ వనరులు, బడ్జెట్ తదితర అంశాలపై ముందస్తు అంచనాలతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో..
ప్రాజెక్టులన్నీ కుదేలే!

- ఆ ఐదేళ్లలో 120 పథకాలు ఎక్కడివక్కడే
- 57 ప్రాజెక్టుల్లో తట్టెడు మట్టీ ఎత్తలేదు
- మిగతా 63లో నాలుగో వంతు పనులూ కాలేదు
- విధ్వంసం నుంచి బయటపడడమెలా?
- జలవనరుల శాఖ మల్లగుల్లాలు

పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులన్నీ మాజీ సీఎం జగన్ కక్షకు బలయ్యాయి. ఆయన ఐదేళ్ల ఏలుబడిలో ఒక్కటంటే ఒక్క ప్రాజెక్టునూ పూర్తిచేయలేదు. పైగా రూపాయి కూడా ఇవ్వకుండా అన్నిటినీ నాశనం చేసేశారు. ఇప్పుడు వాటిని ముట్టుకోవాలంటేనే ప్రభుత్వం భయపడుతోంది. నిర్మాణ వ్యయం భారీగా పెరిగిపోయింది. అలాగని వాటిని చేపట్టకుండా ఆపితే ప్రజలకు భారీ నష్టం. ఏం చేయాలో అర్థం కాక తర్జనభర్జన పడుతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

జగన్ గద్దెనెక్కక ముందే రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల విధ్వంస రచనకు ప్రణాళికలు వేసినట్లు ఆయన అనుసరించిన విధానమే చాటుతోందని సాగునీటి రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు. పగ్గాలు చేపట్టిన వెంటనే.. శరవేగంగా నడుస్తున్న పోలవరం పనులు ఆపేశారు. కేంద్రం వద్దంటున్నా కాంట్రాక్టు సంస్థను తొలగించారు. రివర్స్ టెండర్ పేరిట విధ్వంసానికి బీజం వేశారు. ఇదే కాదు.. 25శాతం పనులు పూర్తికాని అన్ని ప్రాజెక్టుల కాంట్రాక్టులనూ నిరంకుశంగా కనీసం నోటీసైనా ఇవ్వకుండా రద్దు చేశారు. ఆ వెంటనే తన అస్మదీయ సంస్థలకు కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం పనులు కట్టబెట్టారు. ఐదేళ్ల జగన్ పాలనలో సాగునీటి ప్రాజెక్టుల స్థితిగతులను ముఖ్యమంత్రి చంద్రబాబు, జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు తరచూ సమీక్షిస్తున్నప్పుడు కళ్లు చెదిరే నిజాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. మొత్తం 120 ప్రాజెక్టుల్లో 57 ప్రాజెక్టులు పనుల ప్రారంభానికే నోచుకోలేదు. వీటిలో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు... పోయలేదు. మరో 53 పథకాలకు పాలనామోదం లభించినా.. నాలుగో వంతు పనులైనా పూర్తికాలేదు. జగన్ నిర్లక్ష్యానికి గురైన ప్రాజెక్టుల్లో బుడమేరు మళ్లింపు-ఆధునికీకరణ పథకం, ముక్త్యాల ఎత్తిపోతల, గోదావరి-పెన్నా మొదటి దశ, వరికిపూడిశెల ఎత్తిపోతల, హంద్రీ-నీవా సుజల స్రవంతి రెండో దశ, రాయలసీమ ఎత్తిపోతల, రాజోలిబండ మళ్లింపు పథకం, వేదావతి ఎత్తిపోతల, జీడిపల్లి రిజర్వాయరు-భైరవానితిప్ప ఎత్తిపోతల, గాలేరు-నగరి సుజల స్రవంతి, హంద్రీ-నీవా(చక్రాయపేట), అన్నమయ్య ప్రాజెక్టు పునరుద్ధరణ వంటివి ఉన్నాయి.



మొదలే కాని ప్రాజెక్టులు..

ప్రాజెక్టు పనులు ప్రారంభం కానివాటిలో ఉత్తర కోస్తా చీఫ్ ఇంజనీర్ పరిధిలో 4, గోదావరి డెల్టా సిస్టమ్, ధవళేశ్వరం చీఫ్ ఇంజనీర్ పరిధిలో ఒకటి, కృష్ణా డెల్టా సీఈ పరిధిలో 4, ఒంగోలు సీఈ పరిధిలో 4, నాగార్జునసాగర్ సీఈ పరిధిలో రెండు, ఎస్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు (తిరుపతి) సీఈ పరిధిలో 12, కర్నూలు సీఈ పరిధిలో 4, అనంతపురం సీఈ పరిధిలో 7 ఉన్నాయి. కడపలో ఏకంగా 14 ప్రాజెక్టు పనుల్లో తట్టెడు మట్టి కూడా ఎత్తలేదు. అంచనా వ్యయంలో 25శాతం కంటే తక్కువ పనులు జరిగిన ప్రాజెక్టులు 63 ఉన్నాయని జలవనరుల శాఖ తేల్చింది. వాటిలో ఉత్తర కోస్తా సీఈ పరిధిలో 15, ధవళేశ్వరం సీఈ పరిధిలో 5, పోలవరం సీఈ పరిధిలో 6, కృష్ణా డెల్టా సీఈ పరిధిలో 7, ఒంగోలు సీఈ పరిధిలో 2, నాగార్జునసాగర్ సీఈ పరిధిలో 1, తెలుగుగంగ సీఈ పరిధిలో 7, కర్నూలు సీఈ పరిధిలో 7, అనంతపురం సీఈ పరిధిలో 1, కడప సీఈ పరిధిలో 12 ప్రాజెక్టులు ఉన్నట్లు వెల్లడించింది. జగన్ నిర్లక్ష్యంతో నిలిచిపోయిన ప్రాజెక్టులను పూర్తిచేయాల్సి బాధ్యత ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వంపై పడింది. అవన్నీ పూర్తిచేయాలంటే అంచనాలు పెంచాలి. కొత్త ఎస్ఎస్ఆర్ ధరల ప్రకారం అమలు చేస్తే.. ఆర్థిక భారం తడిసిమోపెడవుతుందని జలవనరుల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. జగన్ విధ్వంసం నుంచి బయటపడే మార్గాలు అన్వేషిస్తోంది. ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టక తప్పదని స్పష్టం చేస్తోంది.

గ్రామ, వార్డు సచివాలయాల వర్గీకరణ

- జనాభా ఆధారంగా ఏ, బీ, సీ కేటగిరీలు
- ఉద్యోగులను హేతుబద్ధీకరిస్తూ ఉత్తర్వులు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రక్షాళన చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. జనాభా ఆధారంగా సచివాలయాలను ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించడంతోపాటు ఏ కేటగిరీ సచివాలయంలో ఏయే ఉద్యోగులు, ఎంతమంది ఉండాలన్న దానిపై స్పష్టతనిస్తూ గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ఉత్తర్వులు జారీచేసింది. 2,500మంది లోపు జనాభా కలిగిన సచివాలయాలను కేటగిరీ-ఏ కింద, 2,501-3,500 మంది జనాభా ఉంటే కేటగిరీ-బీ కింద, 3,501 మందికి పైబడిన ఉంటే కేటగిరీ-సీ కింద పరిగణించారు. ఏ-కేటగిరీ సచివాలయాల్లో మల్టీపర్పస్ సిబ్బంది ఇద్దరు, టెక్నికల్ సిబ్బంది నలుగురు కలిపి మొత్తం ఆరుగురిని నియమించనున్నారు. బీ-కేటగిరీ సచివాలయాల్లో మల్టీపర్పస్ సిబ్బంది ముగ్గురు, టెక్నికల్ సిబ్బంది నలుగురితో కలిపి ఏడుగురు, సీ-కేటగిరీ సచివాలయాల్లో నలుగురు మల్టీపర్పస్ సిబ్బంది, నలుగురు టెక్నికల్ సిబ్బంది కలిపి మొత్తం 8 మందిని నియమిస్తారు. మల్టీపర్పస్/ సాధారణ అవసరాలకు సంబంధించి గ్రామ సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి గ్రేడ్ 1-5, డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్, గ్రామ మహిళా పోలీసు, వార్డు సచివాలయాల్లో అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్యదర్శి, మహిళా పోలీసును నియమిస్తారు. ప్రత్యేక/ టెక్నికల్ సిబ్బందికి సంబంధించి గ్రామ సచివాలయాల్లో విలేజ్ రెవెన్యూ ఆఫీసర్, ఏఎన్ఎం, సర్వే అసిస్టెంట్, ఇంజనీర్ అసిస్టెంట్, అగ్రికల్చర్/హార్టీకల్చర్/సెరికల్చర్ అసిస్టెంట్, వెటర్నరీ/ఫిషరీస్ అసిస్టెంట్, ఎనర్జీ అసిస్టెంట్‌ను, వార్డు సచివాలయాల్లో వార్డ్ రెవెన్యూ కార్యదర్శి, హెల్త్ సెక్రటరీ, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ కార్యదర్శి, అమెనిటీస్ కార్యదర్శి, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శి, ఎనర్జీ కార్యదర్శులను నియమిస్తారు. ఏ సచివాలయం ఏ కేటగిరీలో ఉందో, అందులో ఎంతమంది సిబ్బందిని ఏర్పాటు చేస్తారనే జాబితాను గ్రామ, వార్డు సచివాలయ శాఖ విడుదల చేసింది. ఆయా కేటగిరీలకు సంబంధించి సచివాలయాల్లో సిబ్బంది నియామకాలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఉద్దేశపూర్వకంగా కోర్టు ఉత్తర్వులను అగౌరవపర్చారు

- మీ చర్య కోర్టుధిక్కరణ కిందకి వస్తుంది
- సూళ్లూరుపేట సీఐకి నోటీసులు
- పోసానిపై కేసులో తదుపరిచర్యలు నిలుపుదల

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సినీనటుడు పోసాని కృష్ణమురళి విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని తాము ఉత్తర్వులు ఇచ్చిన అనంతరం పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 111(వ్యవస్థీకృతనేరం), ఇతర సెక్షన్లు చేర్చి విచారణకు పిలవడంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి చర్యలు కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా అగౌరవపర్చడమేనని వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తు చేస్తున్న సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్ సీఐ చర్యలు కోర్టుధిక్కరణ కిందికి వస్తాయని పేర్కొంది. దర్యాప్తు అధికారి చర్యలు కోర్టు అధికారాన్ని, రూల్ ఆఫ్ లాను అధిగమించడమేనని తెలిపింది. బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) కింద నోటీసులు ఇచ్చినప్పుడు అనుసరించాల్సిన విధివిధానాలపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, తమ ఉత్తర్వులను పక్కనపెట్టి దర్యాప్తు అధికారి దురుద్దేశపూర్వకంగా వ్యవహరించారని పేర్కొంది. కోర్టు ధిక్కరణ కింద చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో తమ ముందు హాజరై వివరణ ఇవ్వాలని దర్యాప్తు అధికారి సీఐ మురళీకృష్ణకు ఫామ్-1 నోటీసులు జారీ చేసింది. విచారణను ఏప్రిల్ 25కి వాయిదా వేసింది. పోసానిపై సూళ్లూరుపేట పోలీసులు నమోదు చేసిన కేసులో తదుపరి చర్యలన్నింటినీ నిలుపుదల చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడుని పోసాని అసభ్యపదజాలంతో దూషించారన్న ఫిర్యాదు ఆధారంగా గతేడాది నవంబర్ 14న సూళ్లూరుపేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ గతంలో పోసాని హైకోర్టును ఆశ్రయించారు. ఆయన విషయంలో బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని మార్చి 6న సూళ్లూరుపేట పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈనెల 15న తమ ముందు హాజరుకావాలని దర్యాప్తు అధికారి ఇటీవల పోసానికి నోటీసులు జారీ చేశారు. దీంతో కేసును కొట్టివేయాలంటూ పోసాని తాజాగా మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. వ్యాజ్యం గురువారం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది పాపుడిప్పు శశిధర్ వాదనలు వినిపించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ.. పోలీసులకు ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. దర్యాప్తు అధికారి తీరును తీవ్రంగా తప్పుపట్టారు.



'డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్' స్నాతకోత్సవంలో ప్రసంగిస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

సరిహద్దు ఆవల నుంచి నిరంతర బెదిరింపులు

- పరోక్ష యుద్ధం, ఉగ్రవాద సవాళ్లతో పరిస్థితి సంక్లిష్టం: రాజ్‌నాథ్ సింగ్

చెన్నై, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): దేశం సరిహద్దుల ఆవల నుంచి నిరంతర బెదిరింపులు ఎదుర్కోవాల్సి వస్తోందని, పొరుగు దేశాల నుంచి ఎదురయ్యే పరోక్ష యుద్ధం, ఉగ్రవాద సవాళ్లతో పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతోందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఆధునిక సాంకేతితతో కూడిన సైబర్, స్పేస్ వంటి బహుముఖ వాతావరణంలో సాయుధ దళాలు సహకారంతో పనిచేయాలని, భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం నీలగిరి జిల్లా వెల్లింగ్టన్‌లోని 'డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్' (డీఎస్ఎస్‌సీ) 80వ స్నాతకోత్సవానికి రాజ్‌నాథ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం సాయుధ దళాలను సాంకేతికంగా, తిరుగులేని శక్తిగా మార్చడానికి అన్ని ప్రయత్నాలూ చేస్తోందన్నారు. 80వ స్టాఫ్ ట్రైనింగ్ క్లాస్‌లో మొత్తం 479 మంది ట్రైనీ ఆఫీసర్లు ఉండగా, వారిలో 26 మంది మిత్రదేశాలకు చెందిన వారు. ఈ శిక్షణలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. అంతకుముందు రాజ్‌నాథ్ మద్రాస్ రెజిమెంట్ వార్ మెమోరియల్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అమర సైనికులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్మీ చీఫ్ జనరల్ అనిల్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

50 భాషల్లో బోధించే రోబో టీచర్..!

- తమిళనాడులోని రామనాథపురంలో ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 50 భాషల్లో విద్యాబోధన చేసే రోబో టీచర్‌ను తమిళనాడులోని రామనాథపురం జిల్లా మెయ్యంపులిలోని ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు పరిచయం చేశారు. ఏఐ పరిజ్ఞానంతో పనిచేసే ఈ 'రోబో టీచర్'ను క్రైస్ట్ ది కింగ్ పాఠశాలలో డీఆర్వో గోవిందరాజులు గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ రోబో టీచర్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలిచ్చింది. ఈ రోబో 27 భారతీయ భాషలు, ప్రపంచంలోని వివిధ దేశాలకు చెందిన 23 భాషలు మాట్లాడగలదని పాఠశాల ప్రిన్సిపాల్ షాలిని చెప్పారు.



విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న రోబో టీచర్

నేడే ఒంటిమిట్ట రాములోరి కల్యాణం

ఒంటిమిట్ట/రాజంపేట, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణానికి కడప జిల్లా ఒంటిమిట్ట సుందరంగా ముస్తాబైంది. శుక్రవారం జరుగనున్న కల్యాణోత్సవానికి రాష్ట్ర ప్రభుత్వం, టీటీడీ ఆధ్వర్యంలో కనీవిని ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేశారు. వేదిక ముందుభాగంలో వీవీఐపీ గ్యాలరీతో పాటు క్యూలైన్లు, ఆలయం వద్ద భారీగా చలువ పందిళ్లు సిద్ధం చేశారు. కల్యాణోత్సవానికి సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించనున్నారు. రామాలయం ప్రాంగణం మొత్తం రంగురంగుల విద్యుద్దీపాలు, దేశ, విదేశాల్లో లభించే అరుదైన పుష్పాలతో చేసిన అలంకరణలు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శుక్రవారం సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు కల్యాణాన్ని భక్తులు వీక్షించేందుకు వీలుగా ఆలయానికి సమీపంలో కల్యాణవేదిక ప్రాంతంలో 23 భారీ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ అశోక్ కుమార్, జేఈవో వీరబ్రహ్మం గురువారం ఏర్పాట్లను పరిశీలించారు. కల్యాణోత్సవ వైభవాన్ని ప్రపంచవ్యాప్తంగా భక్తులు తిలకించడానికి వీలుగా టీటీడీ ఎస్వీబీసీ చానల్ ప్రత్యక్ష ప్రసారం చేయనుంది.

గరుడ వాహనంపై జగదభిరాముడి దర్శనం

ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదో రోజైన గురువారం ఉదయం మోహినీ అవతారంలో, రాత్రి గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చారు.

సుందరంగా ముస్తాబైన ఏకశిలానగరం

సీతారాముల కల్యాణానికి కోటి తలంబ్రాలు

శుక్రవారం జరగనున్న సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు గోటితో ఒలిచిన కోటి తలంబ్రాలను సమర్పించారు. తూర్పుగోదావరి జిల్లా కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కల్యాణ అప్పారావు ఆధ్వర్యంలో 120 కిలోల తలంబ్రాలను టీటీడీ అధికారులు హనుమంతయ్య, శ్రావణకుమార్‌కు గురువారం అందజేశారు. వీటికోసం మూడు నెలల పాటు వరిని ప్రత్యేకంగా పండించి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఢిల్లీ, తమిళనాడుకు చెందిన భక్తులు ఎంతో భక్తితో 3నెలల పాటు గోటితో ఒలిచి సిద్ధం చేశారని తెలిపారు. ఈ సంఘం ఆధ్వర్యంలో గత 14ఏళ్లుగా భద్రాద్రి రామునికి, మూడేళ్లుగా అయోధ్యకు, ఎనిమిదేళ్లుగా ఒంటిమిట్ట కోదండ రాముని కల్యాణోత్సవం సందర్భంగా కోటి తలంబ్రాలను అందజేస్తున్నట్లు అప్పారావు పేర్కొన్నారు.

పండు వెన్నెల్లో నెలరాజు చూస్తుండగా...

శ్రీరాముడు చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో జన్మించాడు. ఆయన పరిణయ మహోత్సవాలు అయోధ్యలోనైనా.. భద్రాద్రిలోనైనా.. ఏ ఇతర రామాలయ క్షేత్రంలోనైనా నవమి నాడే అభిజిత్ లగ్నంలో పగటిపూట మాత్రమే జరుపడం ఆనవాయితీ. అలాగే అన్ని ఆలయాల్లో చైత్రశుద్ధ పౌర్ణమి నుంచి ఉత్సవాలు మొదలై నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. అయితే అందుకు భిన్నంగా శ్రీరామ చంద్రుడు, సీతమ్మను పరిణయమాడే మహత్తర ఉత్సవాన్ని చైత్ర శుద్ధ చతుర్దశి నాటి రాత్రివేళ పండువెన్నెల్లో నిర్వహించడం ఏకశిలానగరి ఒంటిమిట్టలో మాత్రమే ప్రత్యేకం.



గరుడ వాహనంపై కోదండరాముడు

టెక్స్‌టైల్స్‌లో నవశకం

10 వేల కోట్ల పెట్టుబడి.. 2 లక్షల మందికి ఉపాధే లక్ష్యం

- పెట్టుబడిదారులందరికీ రాయితీలు, ప్రోత్సాహకాలు
- నూతన టెక్స్‌టైల్ పాలసీ విడుదల చేసిన ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో 2లక్షల మందికి ఉపాధి అవకాశాలు సృష్టించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం టెక్స్‌టైల్ పాలసీ ప్రకటించింది. ఈ రంగంలో రూ.10వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. చిన్న, పెద్ద పెట్టుబడిదారులకు రాయితీలపై విధివిధానాలు విడుదల చేసింది. నేత, ప్రాసెసింగ్, వస్త్రాలతో పాటు ఇంటిగ్రేటెడ్ యూనిట్లపై ప్రోత్సాహకాలు అందించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు మహిళలకు మూలధన రాయితీలు, అదనపు ప్రోత్సాహకాలు అందించనున్నట్లు స్పష్టం చేసింది. అట్టడుగు వర్గాల మహిళలకు విస్తృత ఉపాధి అవకాశాలు సృష్టిస్తూ వస్త్ర పరిశ్రమలో పెట్టుబడులకు ఏపీని గమ్యస్థానం చేసేలా ఐదేళ్లపాటు (2024-29) అమలయ్యే నూతన పాలసీ రూపొందించింది.

రాయితీపై విద్యుత్..

ఈ పాలసీలో భాగంగా వస్త్రపరిశ్రమలకు రాయితీలపై ప్రభుత్వం విద్యుత్తు ఇస్తుంది. పరిశ్రమ స్థాపనకు కేటాయించిన భూమి అభివృద్ధి ఫీజులో 50శాతం ఇస్తూనే ల్యాండ్ కన్వర్షన్ రుసుము పూర్తిగా రీయింబర్స్ చేస్తుంది. విద్యుత్తు, నీరు, రోడ్ల అభివృద్ధికి అయ్యే ఖర్చులో గరిష్ఠంగా రూ.కోటికి దాటకుండా 50శాతం రాయితీ ఇస్తుంది. ఐదేళ్ల టర్మ్ లోన్‌పై ఏడాదికి 8శాతం చొప్పున వడ్డీరాయితీ, వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించిన నాటి నుంచి ఐదేళ్ల పాటు విద్యుత్‌కు యూనిట్‌పై రూపాయి, సుంకం చార్జీలో 50శాతం రాయితీ లభిస్తుంది. టెక్స్‌టైల్ యూనిట్లకు ఇచ్చే భూమి స్టాంప్, ట్రాన్స్‌ఫర్ డ్యూటీతో పాటు స్టాంప్ డ్యూటీలో వంద శాతం రీయింబర్స్ ఉంటుంది. రాష్ట్రంలో తయారు చేసిన తుది ఉత్పత్తుల విక్రయాలపై ఎంఎస్ఎంఈలు భారీ యూనిట్లకు చెల్లించాల్సిన ఎస్‌జీఎస్టీని వాణిజ్య ఉత్పత్తి తేదీ నుంచి ఐదేళ్లలో తిరిగి ప్రభుత్వం చెల్లిస్తుంది. నీటి ఆడిట్ ఖర్చులో 75 శాతం, ఎనర్జీ ఆడిట్ ఖర్చులో వన్‌టైమ్ సెటిల్మెంట్ కింద రూలక్ష నుంచి 2లక్షలు అందిస్తుంది. వస్త్రం పేటెంట్ పొందేందుకయ్యే ఖర్చులో 50 శాతం(10 లక్షల వరకూ) ఇవ్వనున్నట్లు ప్రకటించింది. భారీ, మెగా, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు ఐదేళ్ల పాటు నెలవారీ ఉపాధి రాయితీ ఉంటుంది. ఈ రాయితీ ఈఎస్ఐ, ఈపీఎఫ్‌కు చెల్లించే మొత్తంలో 75శాతం రీయింబర్స్ లభిస్తుంది. ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఇన్వెస్టిమెంట్‌పైనా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు మూడు రకాలుగా ఉంటాయి. భారీ ప్రాజెక్టులకు 20% లేదా రూ.15కోట్లు, మెగా ప్రాజెక్టులకు 20% లేదా రూ.30కోట్లు, అల్ట్రా మెగా ప్రాజెక్టులకు 20% లేదా రూ.50కోట్లు ఇస్తారు. బీసీ మహిళలు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు అదనంగా 10 శాతం ఎఫ్‌సీఐ, బీసీలకు 5శాతం, ప్రత్యేక సామర్థ్యం ఉన్న పారిశ్రామిక వేత్తలకు 10 శాతం లభిస్తుందని కొత్త పాలసీలో ప్రభుత్వం వివరించింది.

నేడు కోస్తా, సీమలో వర్షాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమమధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోంది. దీనిపై ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. అల్పపీడనం ఉత్తర ఈశాన్యంగా పయనించి మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో బలహీనపడుతుందని వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడనం ప్రభావంతో గురువారం కోస్తాలో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. వర్షాలు లేని ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగుతుందని, సాధారణం కంటే 2నుంచి 4 డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించింది. రాష్ట్రంలో శుక్రవారం భిన్నమైన వాతావరణం ఉంటుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. గురువారం ప్రకాశం జిల్లా నందనమారెళ్లలో 41.8, తిరుపతి జిల్లా వెంకటగిరిలో 41.1, చిత్తూరు జిల్లా నగరి, కడప జిల్లా ఒంటిమిట్టలో 41 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

28 మంది డీఎస్పీలకు పోస్టింగ్, బదిలీలు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోస్టింగ్ కోసం ఎదురు చూస్తోన్న పలువురు డీఎస్పీలకు పోలీసు శాఖ ఎట్టకేలకు పోస్టింగ్స్ ఇచ్చింది. తిరుపతి, మదనపల్లి, పెనుకొండ, భీమవరం, టెక్కలి సబ్ డివిజన్లతోపాటు ఏసీబీ, సీఐడీ, విజిలెన్స్, పీటీసీల్లో మొత్తం 28మందికి పోస్టింగ్స్ ఇస్తూ డీజీపీ హరీశ్ కుమార్‌గుప్తా ఉత్తర్వులు జారీచేశారు. పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లును పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

రాష్ట్ర కార్యక్రమాల క్యాలెండర్ విడుదల

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రముఖుల జయంతి, వర్ధంతులను రాష్ట్ర కార్యక్రమాలుగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్యాలెండర్ విడుదల చేసింది. 22 మంది ప్రముఖుల జయంతి, వర్ధంతులను నిర్వహించాలని సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డె ఓబన్న జయంతి (జనవరి 11), త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి (జనవరి 15), యోగి వేమన జయంతి (జనవరి 19), శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ రోజు (మాఘశుద్ధ విదియ), దామోదర సంజీవయ్య జయంతి (ఫిబ్రవరి 14), ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతి (ఫిబ్రవరి 22), కె.అత్తుకూరి మొల్లమాంబ (మొల్ల) జయంతి (మార్చి 13), పొట్టి శ్రీరాములు జయంతి (మార్చి 16), పుట్టపర్తి నారాయణ ఆచార్యులు జయంతి (మార్చి 28), డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి (ఏప్రిల్ 5), మహాత్మా జ్యోతిబా పూలే జయంతి (ఏప్రిల్ 11), డా.బీఆర్ అంబేడ్కర్ జయంతి (ఏప్రిల్ 14), మహాత్మా బసవేశ్వర జయంతి (అక్షయ తృతీయ రోజు), అల్లూరి సీతారామరాజు జయంతి (జూలై 4), వర్ధంతి (మే 17), బళ్లారి రాఘవ జయంతి (ఆగస్టు 2), టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి (ఆగస్టు 23), శ్రీ విశ్వకర్మ జయంతి (సెప్టెంబరు 17), మహర్షి వాల్మీకి జయంతి (ఆశ్వయుజ పౌర్ణమి), మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి (నవంబరు 11), కనకదాసు జయంతి (నవంబరు 18) నిర్వహించాలని ప్రభుత్వ కార్యదర్శులు, జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. చివరగా డిసెంబరు 15న పొట్టి శ్రీరాములు వర్ధంతిని ఆత్మార్పణ దినంగా నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మీ పిల్లల అల్లరి భరించలేకపోతున్నాం

- విద్యార్థుల తల్లిదండ్రులకు అనంతపురం జిల్లాకు చెందిన హెచ్ఎం లేఖ

ఉరవకొండ, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల అల్లరిని భరించలేకపోతున్నాం అంటూ అనంతపురానికి చెందిన హెడ్మాస్టర్ తల్లిదండ్రులకు లేఖ రాశారు. ఇప్పుడు ఈలేఖ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారుతోంది. ఉరవకొండ మండలం ఆమిద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నాగమంజుల.. పిల్లల అల్లరి చేష్టలు ఎక్కువ అయిపోయాయని, వారిని దారిలో పెట్టకపోతే పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ఆ లేఖలో తల్లిదండ్రులను హెచ్చరించారు. పరీక్షల సమయంలో తాగునీటి కోసం అంటూ బయటకు వెళ్లి, ఇంటికి వెళ్లిపోతున్నారని, ఎన్నిసార్లు మంచిగా చెప్పినా వినడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాఠశాలలో బెంచీలు విరగ్గొట్టారని, బండలు, స్విచ్‌బోర్డులను ధ్వంసం చేశారని వాపోయారు. పిల్లలపై కాస్త శ్రద్ధపెట్టి వారిని దారిలోకి తేవాలని తల్లిదండ్రులకు విన్నవించారు. లేదంటే విద్యార్థుల మీద పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

పదేళ్లయినా ఇంకా
కోలుకోలేదు!

- విభజిత ఆంధ్రకు రెవెన్యూ లోటు గ్రాంటు కావాలి
- 16వ ఆర్థిక సంఘాన్ని కోరనున్న ఆంధ్ర
- మౌలిక వసతులు, పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఇది అవసరం
- రాజధాని, రోడ్లు, పోర్టులు, ఎయిర్‌పోర్టులకు ప్రత్యేకంగా నిధులివ్వండి
- విజయవాడ, విశాఖ మెట్రోకు, నదుల అనుసంధానానికి కూడా
- 14వ తేదీ నుంచి మూడ్రోజులు రాష్ట్రంలో ఫైనాన్స్ కమిషన్ పర్యటన



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ఏయే అవసరాలకు ఎన్నెన్ని నిధులు కావాలో ఆర్థిక సంఘానికి వివరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. 16వ ఫైనాన్స్ కమిషన్ ఈ నెల 14 నుంచి 16 వరకు మూడ్రోజుల పాటు ఏపీలో పర్యటించనుంది. విభజన జరిగి పదేళ్లు దాటినప్పటికీ ఇంకా రాష్ట్రం ఆర్థికంగా కోలుకోకపోవడాన్ని ప్రభుత్వం ప్రముఖంగా ప్రస్తావించనుంది. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు రెవెన్యూ మిగులు ఉండేదని.. విభజన తర్వాత నవ్యాంధ్ర రెవెన్యూ లోటు కోరల్లో చిక్కుకున్న విషయాన్ని ఆర్థిక సంఘం దృష్టికి తీసుకెళ్లనుంది. సాధారణంగా ఏపీకి ప్రకృతి విపత్తులు ఎక్కువ. కోస్తా ప్రాంతం తుఫాన్లతో, రాయలసీమ కరువుతో విలవిల్లాడుతుంటాయి. దీనికి తోడు రాష్ట్ర విభజన అశాస్త్రీయంగా జరగడంతో రాష్ట్రంలోని పారిశ్రామిక రంగం కుదేలైంది. గత ఐదేళ్ల జగన్ పాలనలో ఆదాయం పూర్తిగా క్షీణించి అప్పులు విపరీతంగా పెరిగాయి. ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైంది. దీంతో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పెట్టుబడులు ఆకర్షణ, పారిశ్రామిక రంగానికి ఉత్తేజమివ్వడానికి రెవెన్యూ లోటు గ్రాంటు అవసరమని కమిషన్‌ను కోరనున్నారు. రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం, రోడ్ల అభివృద్ధి, కొత్త పోర్టులు, ఎయిర్‌పోర్టుల నిర్మాణం, విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని అభ్యర్థించనున్నారు. రాష్ట్రంలో గోదావరి నుంచి ప్రతి ఏటా 2,000 టీఎంసీల వరద సముద్రంలో కలుస్తోంది. మరోవైపు అనంతపురం జిల్లాలో దేశంలోనే అతి తక్కువ వర్షపాతం నమోదవుతోంది. ఈ నేపథ్యంలో కృష్ణా-గోదావరి నదులను పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా సీఎం చంద్రబాబు అనుసంధానం చేశారు. అదేవిధంగా కృష్ణా, పెన్నా, వంశధార నదులను అనుసంధానించి వర్షపాతం లేక అల్లాడుతున్న జిల్లాలకు ప్రాణం పోయాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీలో నదుల అనుసంధానానికి నిధులు కేటాయించాలని ఆర్థిక సంఘాన్ని ప్రభుత్వం కోరనుంది.

ఇక వేసవి సెలవుల్లోనే ఉపాధ్యాయ బదిలీలు

- అమల్లోకి వచ్చిన ఉపాధ్యాయ బదిలీల చట్టం



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల నియంత్రణ చట్టం-2025 అమల్లోకి వచ్చింది. ఈ నెల 9 నుంచే ఈ చట్టం అమల్లోకి వచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఇకపై చట్టంలోని నిబంధనల ప్రకారం మాత్రమే ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతాయి. ఏటా వేసవి సెలవుల్లో మాత్రమే బదిలీలు చేస్తారు. గతంలో ప్రభుత్వం నిర్ణయించిన సమయంలో బదిలీలు జరిగేవి. దానికి నిర్దేశిత సమయం లేకపోవడంతో న్యాయ వివాదాలు ఏర్పడి ప్రతిసారీ వాయిదాలు పడుతూ ఆలస్యం జరిగేది. అలాంటి గందరగోళ పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం టీచర్ల బదిలీల అంశంపై చట్టం చేసింది. దీంతో న్యాయ వివాదాలకు ఆస్కారం లేకుండా బదిలీలు జరిగే అవకాశం ఏర్పడింది. ఈ ఏడాది మే నెలలో టీచర్ల బదిలీలు జరుగుతాయి. పాఠశాల విద్యాశాఖ ఇప్పటికే ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలు విడుదల చేసింది.

మంత్రి కొల్లు ఓఎస్డీ తొలగింపు

- గనులశాఖపై తీవ్ర విమర్శల నేపథ్యంలో నిర్ణయం
- నివేదిక తెప్పించుకొన్న సీఎం చంద్రబాబు
- ఓఎస్డీ రాజాబాబును తప్పించాలని ఆదేశం
- నియామకానికి ముందే ఆయనపై తీవ్ర ఆరోపణలు
- అయినప్పటికీ ఆయనే కావాలని నాడు పట్టుబట్టిన మంత్రి


మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర వద్ద ఓఎస్డీగా పనిచేస్తోన్న పి. రాజాబాబును ప్రభుత్వం పక్కన పెట్టింది. రాజాబాబు గనులశాఖ అధికారి. ఆ శాఖలో జాయింట్‌డైరెక్టర్‌గా పని చేస్తూ 2024 మార్చిలో పదవీ విరమణ పొందారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆయన్ను కొల్లు రవీంద్రకు ఓఎస్డీ గా తీసుకోవాలని సంప్రదింపులు జరిగిన సమయంలోనే తీవ్ర విమర్శలు వచ్చాయి. గనులశాఖలో పనిచేసినప్పుడు ఆయనపై అనేక విమర్శలు, ఆరోపణలు వచ్చాయి. అలాంటి అధికారిని మంత్రి ఓఎస్డీగా ఎలా తీసుకుంటారన్న ప్రశ్నలు వచ్చినా నాడు మంత్రి లెక్కపెట్టలేదు. రాజాబాబే ఓఎస్డీగా కావాలని పట్టుబట్టి మరీ తీసుకున్నారు. ఈ 10 నెలల పాలనలో గనులశాఖ పనితీరు, అప్పీల్ రివిజన్ కేసులపై అనేకానేక ఆరోపణలు వచ్చాయి. ఇవన్నీ ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి వెళ్లాయి. వీటిపై సీఎం నివేదిక తెప్పించుకున్నారు. ఇప్పుడు ఏకంగా ఓఎస్డీనే తప్పించాలని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో రాజాబాబు గత కొద్దిరోజులుగా ఆఫీసుకు రావడం లేదు. ఓఎస్డీ పోస్టు నుంచి తప్పుకుంటానని ఆయన పేషీలో చెప్పినట్లు తెలిసింది. ప్రభుత్వం తప్పించబోతోందన్న సమాచారంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

పరి'శ్రమ' ఫలించాలి!

(మొదటి పేజీ తరువాయి)



జరిగింది. ఏదైనా ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడే.. ఆ సంస్థ ఎప్పుడు ఉత్పత్తి ప్రారంభిస్తుందన్న తేదీపై స్పష్టత తీసుకోవాలని సీఎం చెప్పారు. దానికి అనుగుణంగా దశలవారీగా ప్రాజెక్టు పురోగతిని పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటి వరకూ ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్న ఎన్ని సంస్థలు ఉత్పత్తి ప్రారంభించాయి.. ఎంతమందికి ఉద్యోగాలు వచ్చాయనే వివరాలతో ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించాలని చంద్రబాబు ఆదేశించారు. ఏ సంస్థ ఎవరెవరికి ఉద్యోగాలు ఇచ్చిందో వ్యక్తిగత వివరాలు కూడా సదరు పోర్టల్‌లో ఉంచాలన్నారు. ఐటీ కంపెనీలకు నామమాత్రపు ధరలకే భూ కేటాయింపులు జరపాలని మంత్రి లోకేశ్ కోరగా.. సీఎం ఆమోదం తెలిపారు. సవరించిన భూమి ధరలతో పాలసీని తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో 17 పారిశ్రామిక సంస్థలతో ఒప్పందాలను ఖరారు చేశారు. మౌలిక సదుపాయాలు, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, ఎనర్జీ తదితర రంగాల్లో రూ.31,167 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలను ఆమోదించారు. ఆయా కంపెనీల ద్వారా 32,633 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.

10 నెలలు.. రూ.4,71,379 కోట్ల పెట్టుబడులు

టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక ఇప్పటిదాకా ఐదు ఎస్ఐపీబీ సమావేశాలు జరిగాయి. వీటిలో 57 సంస్థలకు సంబంధించి రూ.4,17,379 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. 4,17,188 మందికి ఉద్యోగాలు దక్కనున్నాయి. గత ప్రభుత్వం ఐదేళ్ల కాలంలో ఐదు ఎస్ఐపీబీ సమావేశాలను నిర్వహించగా.. కూటమి వచ్చిన పది నెలల్లోనే ఐదు జరిపామని చంద్రబాబు వెల్లడించారు. సమావేశంలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఇంధనమంత్రి గొట్టిపాటి రవికుమార్, మౌలిక సదుపాయాల కల్పన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి . ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులతో వస్తున్న 17 కంపెనీలివే..

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉద్యోగాలు	వివరణ
మాయా మహామాయ ఇండస్ట్రీస్, విజయనగరం	2063	1000	స్టీల్ ఉత్పత్తి విస్తరణ.. 131 ఎకరాల భూమితోపాటు ఇతర ప్రోత్సాహకాలు
ప్రీమియర్ ఇంజనీర్స్ లిమిటెడ్.., నాయుడుపేట	4200	1500	సోలార్ సెల్స్ మాన్యుఫ్యాక్చరింగ్
ఎల్జీ వెండార్స్, శ్రీసిటీ	839	692	వైట్ గూడ్స్ మాన్యుఫాక్చరింగ్
ప్రొటెన్షియల్ లిమిటెడ్, శ్రీసిటీ	1055	515	అమోర్‌ఫాస్ మెటల్ తయారీ
శ్రేష్ట పార్క్స్	459	559	పౌల్ట్రీఫీడ్
పెట్రా సిలికాన్ లిమిటెడ్	585	477	సిలికా తయారీకి అనువైన 224 ఎకరాల భూమి
డిక్సన్ టెక్నాలజీస్			కొప్పర్తి ఈఎంసీ తరహా ఈఓటీ ఫీజు
ఏవీశా ఫుడ్స్	500	500	వ్యవసాయ క్షేత్రం కోసం రాయితీ ధరపై 115 ఎకరాల భూమి
రాంకో సిమెంట్స్	478	550	ఏటా 6.3 టన్నుల ఉత్పత్తి.. 79.91 ఎకరాలు
ఎంఎండబ్ల్యూఎల్	1198	870	మడకశిరలో 325 ఎకరాలు
టాప్‌లైన్ మెటల్ అండ్	32	200	ఈవోటీ రద్దు.. 10.75
ఎల్లాయ్ ఇండియా			ఎకరాలు కేటాయింపు
టాటా కన్సల్టెన్సీ	1370	12000	21.16 ఎకరాల్లో ఐటీ కాంప్లెక్స్ నిర్మాణం
అల్ట్రా క్లస్టర్స్	5278	2500	విశాఖలో 59 ఎకరాల్లో డేటా సెంటర్/ ఐటీ ఆఫీస్
జేఎస్‌డబ్ల్యూ నియో ఎనర్జీ, కర్నూలు	660	110	88 మెగావాట్ల విండ్ పవర్
రెన్యూ విక్రమ్ శక్తి, అనంతపురం	3000	1050	540 మెగావాట్ల సోలార్ ప్లాంట్
చింతా గ్రీన్ ఎనర్జీ, సత్యసాయి జిల్లా	2450	2400	బ్యాటరీ స్టోరేజీతో 700 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్
చింతా గ్రీన్ ఎనర్జీ	7000	6900	బ్యాటరీ స్టోరేజీతో 2,000 మెగావాట్ల సౌరవిద్యుదుత్పత్తి

వక్ఫ్‌లో ఎట్టకేలకు
దిద్దుబాటు

- వక్ఫ్ భూముల లీజు నోటీసు రద్దు
- సీఎం ఆదేశాలతో వక్ఫ్‌బోర్డు వెనక్కి
- బోర్డు సీఈవోపై వేటు?

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): భూములను వాణిజ్య అవసరాలకు లీజుకు ఇవ్వాలన్న ప్రతిపాదనపై వక్ఫ్‌బోర్డు వెనక్కి తగ్గింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో ఈనెల 3వ తేదీన ఇచ్చిన లీజుదారుల ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) నోటీసు రద్దయింది. ఈ మేరకు వక్ఫ్‌బోర్డు సీఈవో బుధవారమే ప్రత్యేకంగా నోటీసు జారీ చేశారు. వక్ఫ్‌బోర్డుకు 90వేల ఎకరాలు ఉన్నాయి. అందులో 30వేల ఎకరాలపైనే భూమి అన్యాక్రాంతమైంది. మిగిలిన భూమిని వాణిజ్య అవసరాలకు లీజుకు ఇవ్వాలని వక్ఫ్‌బోర్డు ఆలోచించింది. ఈ విషయంలో ప్రభుత్వ ఆలోచన ఏమిటి? ఆ భూముల విషయంలో ప్రభుత్వ వైఖరి ఏమిటో తెలుసుకోకుండానే వక్ఫ్‌బోర్డు సీఈవో నిర్ణయాలు తీసుకున్నారు. వక్ఫ్‌బోర్డులోని కొందరు పెద్దల సిఫారసుతో ఆ భూములను వాణిజ్య అవసరాలకు లీజులకు ఇచ్చేందుకు గాను ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటీసు జారీ చేశారు. కానీ, అంతకు నాలుగు నెలల ముందే, ఆ భూములను ఎలాంటి వాణిజ్య అవసరాలకూ వాడొద్దని, కేవలం ముస్లిం వర్గాల సంక్షేమం, అభివృద్ధికే వినియోగించాలని ముఖ్యమంత్రి మైనారిటీ సంక్షేమశాఖను ఆదేశించారు. అయితే, ప్రభుత్వ అనుమతి లేకుండానే వక్ఫ్‌బోర్డు సీఈవో ఆ నోటీసు జారీ చేశారు. ఈ నోటీసుపై ముస్లిం వర్గాల నుంచే తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. ముస్లిం సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన భూములను వాణిజ్య అవసరాలకు ఎలా వాడతారంటూ పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ఈనెల 9వ తేదీన 'వక్ఫ్‌భూములకు ఎసరు' శీర్షికన 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాలను ప్రచురించింది. ఆ వార్తలోని అంశాలపై ముఖ్యమంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆమోదం, అనుమతి లేకుండా ఆ నోటీసు ఎలా ఇచ్చారని అధికారులను మందలించారు. తక్షణమే నోటీసును రద్దుచేయాలని మైనారిటీ సంక్షేమశాఖను ఆదేశించారు. దీంతో నోటీసును వెనక్కి తీసుకోవాలని మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శి చిత్తూరు శ్రీధర్ వక్ఫ్‌బోర్డుకు ఆదేశాలు జారీచేశారు. ఇదిలా ఉండగా, ఈ మొత్తం వ్యవహారంపై ముఖ్యమంత్రి నివేదిక కోరారని తెలిసింది. ప్రభుత్వానికి తెలియకుండా నోటీసు ఇప్పించడంలో ఎవరి పాత్ర ఏమిటి? ఎవరి ప్రోద్బలం దీనివెనుక ఉందనేది ఆ నివేదికలో తెలపాలని మైనారిటీ సంక్షేమశాఖ కార్యదర్శిని ఆదేశించినట్లు తెలిసింది. ఇదిలాఉంటే, ఈ పరిణామాల ప్రభావం వక్ఫ్‌బోర్డు సీఈవోపై పడనుంది. ఇప్పుడున్న అధికారి అదనపు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. ఆయనను తప్పించి వక్ఫ్‌బోర్డుకు రెగ్యులర్ సీఈవోగా ఐఏఎస్ అధికారిని నియమించాలని ప్రభుత్వం యోచిస్తోంది. జాయింట్ సెక్రటరీ కేడర్‌లో ఉన్న ఐఏఎస్ కోసం అన్వేషిస్తున్నారు.

ఎంబీబీఎస్‌లో కాపీయింగ్‌పై చర్యలు

- సిద్ధార్థ కాలేజీ సిబ్బంది సహకారంతోనే అంతా!

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): సిద్ధార్థ మెడికల్ కాలేజీలో కాపీయింగ్ వ్యవహారాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ కాలేజీలో బుధవారం జరిగిన ఎంబీబీఎస్ చివరి, రెండో సంవత్సర విద్యార్థులు పరీక్షల్లో కాపీ కొడుతూ దొరికిపోయారు. కాపీయింగ్ వ్యవహారాన్ని వర్సిటీ రిజిస్ట్రార్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినర్ వెలుగులోకి తెచ్చారు. పదుల సంఖ్యలో విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడగా.. ముగ్గురు మాత్రమే దొరికారు. మిగిలిన విద్యార్థులంతా తప్పించుకున్నారు. ఈ వ్యవహారంపై వర్సిటీ రిజిస్ట్రార్ గురువారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ)కు నివేదిక ఇచ్చారు. కాలేజీ సిబ్బంది సహకారంతోనే విద్యార్థులు కాపీయింగ్ పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ నివేదిక ఆధారంగా కాలేజీ ప్రిన్సిపల్, కొంతమంది ప్రొఫెసర్లు, కీలకంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకునేందుకు డీఎంఈ సిద్ధమయ్యారు. మరోవైపు సిద్ధార్థ మెడికల్ కాలేజీలో చాలా ఏళ్ల నుంచి కాపీయింగ్ వ్యవహారం నడుస్తోందని, ఇదంతా కార్యాలయ సిబ్బంది సహకారంతోనే జరుగుతోందని నిర్ధారణకు వచ్చారు. శుక్రవారం ఎంతమందిపై వేటు పడుతుందో చూడాలి.

నర్సింగ్‌కూ 'సెట్'..!

- ఏపీలో తొలిసారిగా అమలు
- జూన్‌లో పరీక్ష.. జూలైకి అడ్మిషన్లు: సత్యకుమార్


నర్సింగ్ కాలేజీల ప్రతినిధులతో భేటీలో మాట్లాడుతున్న సత్యకుమార్

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేకంగా కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (సెట్) నిర్వహించాలని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీలో గురువారం ఉదయం నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమైన మంత్రి పలు అంశాలపై చర్చించారు. ఇప్పటివరకూ నర్సింగ్ కాలేజీల్లో ప్రవేశాలకు కేంద్ర ప్రభుత్వం నిర్వహించే నీట్, రాష్ట్రాల స్థాయిలో జరిగే ఎంట్రన్స్‌ల ద్వారా ప్రవేశాలు చేపడుతున్నారు. ఇకపై నీట్, ఏపీఈఏపీసెట్‌లతో సంబంధం లేకుండా జీఎన్ఎం, బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో చేరే వారికోసం ప్రత్యేకంగా సెట్ నిర్వహించాలని నిర్ణయించారు. దేశంలోనే తొలిసారి ఏపీలో 2025-26 విద్యా సంవత్సరం లోనే నర్సింగ్ కోర్సులకు సెట్ నిర్వహించాలని మంత్రి సూచించారు. ఇకపై ఏప్రిల్‌లో దరఖాస్తుల ప్రక్రియ మొదలు పెట్టి, జూన్‌లో ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించాలని, జూలై నాటికి అడ్మిషన్లు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కాగా, మూడేళ్ల వ్యవధితో కూడిన జీఎన్ఎం కోర్సులకు వార్షిక బోధనా రుసుం రూ.15000, నాలుగేళ్ల బీఎస్సీ (నర్సింగ్) కోర్సులకు రూ.19,000గా నిర్ధారించడం వల్ల నాణ్యమైన నర్సింగ్ విద్యను అందించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. దీంతో బోధనా రుసుమును నిర్ధారించడానికి ప్రస్తుతం అనుసరిస్తున్న విధివిధానాల్ని పునఃసమీక్షించాలని మంత్రి సూచించారు. నర్సింగ్ కాలేజీల ఏర్పాటు, వాటి నిర్వహణకు సంబంధించి పరస్పర వైరుధ్యాలతో కూడిన పలు జీవోల వల్ల గందరగోళం నెలకొందని, వీటన్నింటినీ పరిశీలించి ఒకే సమగ్ర జీవోను రూపొందించాలని ప్రతినిధులు కోరారు. ఈ విషయాన్ని పరిశీలించిన మంత్రి మూడు నెలల్లో సమగ్ర జీవోను రూపొందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా, 20 ఏళ్ల తర్వాత నర్సింగ్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశం పెట్టి, పలు సమస్యలకు పరిష్కారాలు చూపినందుకు నర్సింగ్ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. హైపర్ కమిటీ నూతన అధ్యక్షుడు, హైకోర్టు మాజీ జడ్జి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు, వైస్‌చాన్స్‌లర్ నర్సింహం, రిజిస్ట్రార్ రాధికారెడ్డి సమావేశంలో పాల్గొన్నారు.

విశాఖ విమానాశ్రయం వెలవెల!

- ఎడాపెడా సర్వీసులకు మంగళం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ఆర్థిక రాజధాని.. ఐటీ హబ్.. టూరిజం కేపిటల్.. ఫార్మా సెంటర్‌గా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నానికి విమాన సర్వీసులు ఒక్కొక్కటిగా రద్దయిపోతున్నాయి. కొత్త సర్వీస్‌లు రావలసింది పోయి.. ఉన్నవాటినే తీసేయడం ఏమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు..! విశాఖపట్నం నుంచి ఇంతకుముందు ఐదు అంతర్జాతీయ విమాన సర్వీస్‌లు (దుబాయ్, సింగపూర్, మలేసియా, శ్రీలంక, బ్యాంకాక్) నడిచేవి. కరోనా సమయంలో అవన్నీ ఆగిపోయాయి. ఆ తర్వాత సింగపూర్, మలేసియా, బ్యాంకాక్ సర్వీస్‌లను పునరుద్ధరించారు. దుబాయ్ విమానం కూడా తెస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు హామీ ఇచ్చారు. అది నెరవేరక ముందే ప్రస్తుతం ఉన్న మూడు సర్వీసుల్లో రెండింటికి బుకింగ్స్ నిలిపివేశారు. మే ఒకటో తేదీ నుంచి మలేసియా, బ్యాంకాక్ సర్వీసులు నడపడం లేదని ఎయిర్ ఆసియా ప్రకటించింది. అంటే విశాఖకు ఒకే ఒక అంతర్జాతీయ సర్వీస్ (సింగపూర్ విమానం) మిగులుతుందన్నమాట.

విజయవాడ విమానాలూ రద్దు

విశాఖపట్నం నుంచి విజయవాడకు ఇండిగో ఎయిర్‌లైన్స్ రోజూ ఉదయం రెండు సర్వీసులు నడుపుతోంది. వాటిని ఈ నెల ఒకటో తేదీ నుంచి నిలిపివేసింది. కారణాలు వెల్లడించలేదు. ఇప్పుడు విశాఖ నుంచి విజయవాడ వెళ్లాలంటే రైళ్లు లేదా బస్సులే ఆధారం. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వచ్చేసరికి విశాఖ విమానాశ్రయాన్ని పూర్తిగా ఖాళీ చేయాలనే ఉద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు కూడా వినిపిస్తున్నాయి. 'విజయవాడకు విమానాలు రద్దు చేయడం వల్ల రాజకీయ నాయకులతో పాటు అధికారులు, వ్యాపారులు కూడా ఇబ్బంది పడుతున్నారు. వెంటనే విజయవాడ విమాన సర్వీస్‌లు పునరుద్ధరించాలి' అని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కోరారు.

కేంద్ర మంత్రి స్పందించాలి

'విశాఖకు పారిశ్రామిక నగరంగా బ్రాండ్ ఇమేజ్ ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక అది మరింత పెరిగింది. కానీ ఇటు చూస్తే అంతర్జాతీయ విమాన సర్వీసులతో పాటు రాజధాని సర్వీసులు కూడా తీసేశారు. తక్షణమే మంత్రి రామ్మోహన్‌నాయుడు స్పందించి వాటిని పునరుద్ధరించాలి.'

- టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు ఓ.నరేశ్‌కుమార్.

ఆన్‌లైన్ రమ్మీలో 1.4 కోట్లు పోయాయ్

- పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కొత్తపల్లి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ రమ్మీ ఆడి లక్ష కాదు రెండు లక్షలు కాదు ఏకంగా రూ.1.4 కోట్లు పోగొట్టుకున్నాడో వ్యక్తి. వాటిలో పొలం అమ్మిన సొమ్మే రూ.1.3 కోట్లు ఉన్నాయి. దీంతో కుటుంబ సభ్యులు తిడతారనే భయంతో తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు రామన్నపాలేనికి చెందిన ఒక వ్యక్తి ఉప్పాడ సెంటర్లో వాహనాల స్పేర్‌పార్టుల వ్యాపారం చేస్తున్నాడు. తండ్రి పేరిట ఉన్న సుమారు 90 సెంట్ల పొలాన్ని రెండేళ్ల క్రితం రూ.1.36 కోట్లకు విక్రయించాడు. ఆ సొమ్ముతో వేరేచోట పొలం కొందామని తండ్రికి చెప్పి ఆ మొత్తాన్ని తన వద్దే ఉంచుకున్నాడు. అయితే భూమి అమ్మకముందే ఆన్‌లైన్ రమ్మీలో లక్షలు పోగొట్టుకున్న ఆ వ్యక్తి పొలం అమ్మిన సొమ్ముతో పాటు తన బ్యాంకు ఖాతాలో ఉన్న మరో రూ.4 లక్షలు కూడా దఫదఫాలుగా మళ్లీ ఆ గేమ్‌లోనే పెట్టి నష్టపోయాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న అతడు గత మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏమైందని ప్రశ్నించగా పురుగుల మందు తాగానని చెప్పాడు. దీంతో వెంటనే అతన్ని కాకినాడలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రి సిబ్బంది అందించిన సమాచారం మేరకు వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. దీనిపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

బడ్జెట్ ఉన్నంత వరకే పనులు!

- చెల్లింపులపై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బిల్లుల చెల్లింపు, వాటి అప్‌లోడ్‌పై ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు ప్రకటించింది. గత నెల (మార్చి) 31వ తేదీ నాటికి పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ రద్దవుతాయి. 2025-26 బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా ఆ బిల్లులను మళ్లీ సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ విధానంలో ప్రతి డ్రాయింగ్-డిస్‌బర్సింగ్ అధికారి(డీడీవో)కి కొంత బడ్జెట్ కేటాయిస్తారు. దాని ప్రకారం.. రెండు త్రైమాసికాల్లో కలిపి 35 శాతం మించకుండా పనులు చేయాలి. బిల్లులు కూడా అదే ప్రాతిపదికన అప్‌లోడ్ చేయాలి. 100 శాతం నిధులను నాలుగు త్రైమాసికాల్లో ఖర్చు చేయాలి. మొత్తం పనులు.. కేటాయించిన బడ్జెట్‌ను మించకూడదు. గతంలో బడ్జెట్‌తో సంబంధం లేకుండా పనులు చేసేవారు. బిల్లులు కూడా అదే స్థాయిలో అప్‌లోడ్ చేసేవారు. బడ్జెట్‌కు, జరిగిన పనుల విలువకు భారీ వ్యత్యాసం ఉండేది. పెండింగ్ బిల్లులు పేరుకుపోయేవి. ఈ సమస్యకు స్వస్తి పలకడానికి ప్రభుత్వం తాజా విధానం తీసుకొచ్చింది.

పాత బిల్లుల పరిస్థితేంటో..!

పాత బిల్లులపై ఈ మార్గదర్శకాల్లో స్పష్టత లేదు. కొత్త బడ్జెట్‌లో వాటికి కేటాయింపులు ఉంటే తిరిగి వ్యవస్థలోకి వస్తాయి. లేదంటే బడ్జెట్ కేటాయించే వరకు ఎదురుచూడాలి. అలా వ్యవస్థలోకి వచ్చిన బిల్లులు పాతవే అయినా.. కొత్తగా మళ్లీ వ్యవస్థలోకి వస్తున్నందున అవి కొత్త బిల్లులవుతాయి. 'తొలుత వచ్చినవారికే తొలి ప్రాధాన్యం (ఫిఫో)' విధానం ప్రకారం సీనియర్ బిల్లులే అయినప్పటికీ చెల్లింపుల్లో వాటికి తొలి ప్రాధాన్యం లభించదు. పైగా డీడీవోలకు కేటాయించిన బడ్జెట్ పాత బిల్లుల చెల్లింపులకు సరిపోతుందా లేదా అనేది ప్రశ్నార్థకం. దీనిపై సీఎఫ్ఎంఎస్ అధికారులను సంప్రదించగా.. 'పాత బిల్లులను రద్దుచేసేది డీడీవో గనుక.. ఏది సీనియర్ బిల్లో ఆ అధికారికి తెలుస్తుంది. దాని ప్రకారం పాత బిల్లులకు ప్రాధాన్యం లభిస్తుంది' అని వివరణ ఇచ్చారు.

ప్రత్యేకంగా నిధులివ్వాలి: చిన్న కాంట్రాక్టర్లు

ఇకపై జరగబోయే పనులకు ప్రభుత్వ మార్గదర్శకాలు ఉపయోగపడతాయని.. కానీ పాత బిల్లులకు ఈ విధానంలో ప్రాధాన్యం లభించదని చిన్న కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. డీడీవోల వద్ద బడ్జెట్ తక్కువగా ఉన్న సందర్భాల్లో చిన్న బిల్లులకు ప్రాధాన్యం ఇవ్వడం అనుమానమేనని చెప్పారు. గత ప్రభుత్వం నాబార్డు నిధులను మళ్లించగా.. ఈ ప్రభుత్వం చిన్న కాంట్రాక్టర్ల మేలు కోసం బడ్జెట్ కేటాయించిందని గుర్తుచేశారు. అయినా బడ్జెట్ ఉన్నప్పటికీ బిల్లులు పెట్టుకోవడానికి సీఎఫ్ఎంఎస్‌లో అవకాశం కల్పించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

వేసవి తర్వాత వస్తాంలే సార్!

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ కాలేజీల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుందనే ఆలోచనతో ఈ ఏడాది విద్యా సంవత్సరాన్ని ఏప్రిల్ 1 నుంచే ప్రారంభించారు. టెన్త్ ఫలితాలు రాకపోయినా కాలేజీల్లో చేరాలని ప్రభుత్వ కాలేజీలు విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ఫస్టియర్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నాయి. ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ప్రాథమిక బోధన ప్రారంభించారు. అలాగే సెకండియర్ విద్యార్థులకు కూడా ప్రాథమికాంశాలపైనే బోధిస్తున్నారు. సుదీర్ఘకాలంగా జూన్‌లో కాలేజీలు ప్రారంభమయ్యే సంస్కృతికి అలవాటుపడిన విద్యార్థులు, తల్లిదండ్రులు ఇప్పుడే వేసవిలో తరగతుల ప్రారంభంపై ఆసక్తి చూపడం లేదు.

హాజరు చాలా తక్కువ

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గరిష్ఠంగా 30 శాతం మందే కాలేజీలకు హాజరవుతున్నారు. పలు కాలేజీల్లో హాజరు శాతం మరీ దారుణంగా ఉంది. చిత్తూరు జిల్లాలో ఓ కాలేజీలో 300 మంది విద్యార్థులకు గాను గరిష్ఠంగా 50 మంది మాత్రమే వస్తున్నారు. ప్రకాశం జిల్లాలో 350 మంది విద్యార్థులున్న ఓ కాలేజీలో 50 నుంచి 100 మంది మాత్రమే తరగతులకు హాజరవుతున్నారు. ఇక కొన్ని కాలేజీల్లో అయితే 10, 20 మంది మాత్రమే తరగతులకు వస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో హాజరు శాతం మరీ తక్కువగా ఉంది. ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు వెళ్లే వారిలో ఎక్కువ మంది పేద కుటుంబాల విద్యార్థులే ఉంటారు. వారు వేసవి సెలవుల్లో చిన్నాచితకా పొలం పనులకు వెళ్తుంటారు. అలాంటి వారిని ఇప్పుడు కాలేజీలకు తీసుకురావడం లెక్చరర్లకు కష్టంగా మారింది. ఫస్టియర్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ముగిసినందున ఇప్పుడే కాలేజీలకు వచ్చేందుకు ఆసక్తి చూపట్లేదు. ఇక ఫస్టియర్‌లో విద్యార్థులను చేర్పించాలని ఇంటింటికీ తిరుగుతున్న లెక్చరర్లకు వింత అనుభవాలు ఎదురవుతున్నాయి. అసలు ఫలితాలే రాకుండా అప్పుడే కాలేజీ ఏంటని తల్లిదండ్రులు, విద్యార్థులు హేళనగా మాట్లాడుతున్నారని లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగిన సమయంలో రోజంతా కాలేజీలు నిర్వహించడం కూడా హాజరు తగ్గడానికి ఓ కారణంగా కనిపిస్తోంది. ప్రస్తుతం పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. ఏటా మార్చిలోనే పరీక్షలు అయిపోతాయి కాబట్టి ఇంటర్ కాలేజీలకు ఒంటిపూట బడుల అవసరం ఉండదు. కానీ ఇప్పుడు ఎండలు మండుతున్న సమయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. వేసవిలో అంతసేపు కాలేజీలో ఉండాలా? అనే భావనతోనూ విద్యార్థులు హాజరు కావట్లేదు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

కాలేజీలు తెరిచిన రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలను ఇంటర్ బోర్డు పంపిణీ చేసింది. కాలేజీలు ప్రారంభమైన రోజు నుంచే అన్నీ అందుబాటులో ఉండాలని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. అందుకు అనుగుణంగా పుస్తకాలు పంపిణీ చేసి, ప్రాథమిక అంశాలపై బోధన ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా కొనసాగిస్తున్నారు. ఈ నెల 23 వరకు తరగతులు నిర్వహించి అప్పటి నుంచి మే నెలాఖరు వరకు వేసవి సెలవులు ఇస్తారు. అప్పటి వరకూ బోధించిన అంశాలను వేసవిలో విద్యార్థులు చదువుకునే వెసులుబాటు ఉంటుందని ఇంటర్ బోర్డు అధికారులు అంటున్నారు. కానీ విద్యార్థులు మాత్రం ఈ బ్రిడ్జి కోర్సు, ప్రాథమిక అంశాల తరగతులు వినేందుకు ముందుకు రావట్లేదు.

గ్రూపుపై అస్పష్టతతో ఎలా?

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చేరే విద్యార్థులు సైన్సేతర గ్రూపులు తీసుకుంటూ ఉంటారు. సీఈసీ, హెచ్ఈసీ సబ్జెక్టులు చదువుతూ ఉంటారు. ప్రస్తుతం ప్రభుత్వ కాలేజీల్లో ఇంగ్లిష్, గణితం, సైన్స్ సబ్జెక్టులపై ఫస్టియర్ విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అవి ఉపయోగపడతాయి. సీఈసీ, హెచ్ఈసీ విద్యార్థులకు ఇంగ్లిష్ ఒక్కటే ఉపయోగపడుతుంది. పైగా ఈ ఏడాది నుంచి కొత్తగా సబ్జెక్టుల విలీనం చేశారు. ఎంబైపీసీ ప్రవేశపెడుతున్నారు. ఈ క్రమంలో టెన్త్ పరీక్షలు రాసిన విద్యార్థులు ఏ గ్రూపు తీసుకోవాలనే దానిపై స్పష్టతతో లేరు. దీంతో కాలేజీకి వచ్చినా పెద్దగా ప్రయోజనం లేదనే అభిప్రాయం విద్యార్థుల్లో కనిపిస్తోంది.

కాకాణి.. కనిపిస్తే అరెస్టే!



- మాజీ మంత్రి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు
- లుకవుట్ నోటీసులు జారీ
- విదేశాలకు చెక్కేయకుండా కట్టడి
- ఆచూకీ కోసం 7 పోలీసు బృందాలు
- వివిధ ప్రాంతాల్లో ముమ్మర గాలింపు

నెల్లూరు, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): క్వార్ట్జ్ అక్రమ తవ్వకం, దోపిడీ వ్యవహారంలో విచారణకు రాకుండా తప్పించుకుని తిరుగుతున్న మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి చుట్టూ పోలీసులు ఉచ్చు బిగిస్తున్నారు. ఆయనపై గురువారం లుకవుట్ నోటీసులు జారీచేశారు. దీంతో ఆయన విదేశాలకు పారిపోకుండా విమానాశ్రయాల్లోనే అడ్డుకుంటారన్న మాట. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో కాకాణిపై కేసు నమోదు కావడం, విచారణకు రావాలని ఎన్నిసార్లు నోటీసులిచ్చినా లెక్కచేయకపోవడం.. వాటిని తీసుకునేందుకు ఇళ్లలోనే ఉండకపోవడం.. ముందస్తు బెయిల్ ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించడం.. తదితర పరిణామాల క్రమంలో గత కొద్ది రోజులుగా కాకాణి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముఖ్యంగా హైకోర్టు బుధవారం ఆయన బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయడంతో.. అరెస్టు చేయడానికి పోలీసులు వివిధ ప్రాంతాల్లో ఉధృతంగా గాలిస్తున్నారు. ఏడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. రాష్ట్రంతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై నగరాల్లో సైతం వేటాడుతున్నట్లు సమాచారం. కాకాణి కనిపించడమే తరువాయి.. అరెస్టు చేయడం ఖాయమని పోలీసు వర్గాలు అంటున్నాయి.

మీ జైలర్ మహిళను వేధించాడు

- న్యూడ్ కాల్ చెయ్యమని ఒత్తిడి చేశాడు
- జైళ్లశాఖ డీజీకి విశాఖ సీపీ లేఖ
- ఆచూకీ తెలపాలని విజ్ఞప్తి



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'బాత్ రూమ్‌కు వెళ్లు.. న్యూడ్ కాల్ చెయ్యి.. 20 వేలిస్తా.. 30 వేలిస్తా..' అంటూ విశాఖపట్నంలోని ఓ గృహిణికి అసభ్య సందేశాలు పంపిన అనంతపురం జైలర్ సుబ్బారెడ్డి ఆచూకీ తెలపాలంటూ జైళ్ల శాఖ డీజీకి విశాఖ నగర పోలీసు కమిషనర్ లేఖ రాశారు. వైజాగ్‌లో కేసు నమోదైనట్లు తెలియగానే పరారైన జైలర్ సీవీఎస్ సుబ్బారెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ వ్యవహారం జైళ్లశాఖలో చర్చనీయాంశమైంది. ఆరేళ్ల క్రితం ఒక ఫేస్‌బుక్ ఖాతాకు జైలర్ సుబ్బారెడ్డి ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపారు. పదేపదే ఫ్రెండ్ రిక్వెస్ట్ పంపుతుండటంతో ఆమె భర్త సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. దీంతో తాను విశాఖపట్నంలో జైలర్‌నని, కేవలం స్నేహం కోసమే రిక్వెస్ట్ పంపానంటూ సారీ చెప్పి రిక్వెస్ట్‌లు పంపడం ఆపేశాడు. గత నెల 25న మళ్లీ ఆ గృహిణికి ఫోన్ చేసి న్యూడ్ కాల్ చెయ్యాలంటూ ఒత్తిడి చేశాడు. విశాఖపట్నం సైబర్ పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు ఆరా తీయగా సుబ్బారెడ్డి అనంతపురంలో జైలర్‌గా పని చేస్తున్నట్లు తెలిసింది. విచారణకు హాజరుకావాలంటూ ఫోన్ చెయ్యడంతో ఆయన ఫోన్ స్విచ్చాఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దీంతో విశాఖ సీపీ జైళ్ల శాఖ ఇన్‌చార్జి డీజీకి లేఖ రాయడం చర్చనీయాంశమైంది.

చిటికిన వేలితో లేపేసే సామర్థ్యం మాకుంది

- కారుమూరికి కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ హెచ్చరిక



తణుకు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'నిన్ను చిటికిన వేలితో లేపేసే సామర్థ్యం మాకు ఉంది.. గుర్తుపెట్టుకో కారుమూరీ' అని కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ హెచ్చరించారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మేం కనుక నీ భాష ఉపయోగిస్తే.. సాయంత్రానికి నువ్వుండవు గుర్తుపెట్టుకో. తణుకులో టీడీఆర్ కుంభకోణం గురించి అందరికీ తెలుసు. ఎప్పుడో అధికారంలోకి వస్తానని పగటి కలలు కంటున్నావు. ఈలోగా నువ్వు బొక్కలోకిపోతావు. మీ నాయకుడు అసెంబ్లీకి రాడు. నువ్వు ప్రజల్లోకి రావు. కార్యకర్తల సమావేశాల్లో మాత్రం రెచ్చిపోతారు. చప్పట్లు కొడతారని రెచ్చిపోతే నిన్ను చిటికిన వేలితో లేపేసే సామర్థ్యం మాకుందనే విషయం గుర్తుపెట్టుకో' అని వార్నింగ్ ఇచ్చారు.

మేం చిటికేస్తే రోడ్డుపై తిరగలేరు!

- వైసీపీ నాయకులకు మంత్రి కొల్లు హెచ్చరిక



అనంతపురం, హిందూపురం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ నాయకుల తలలు తీస్తామని మాజీ మంత్రి కారుమూరి అంటున్నారు. మేము ఒక చిటికె వేస్తే రాష్ట్రంలో ఒక్క వైసీపీ నాయకుడూ రోడ్డుపై తిరగలేడు. మా సీఎం ప్రజాస్వామ్యబద్ధంగా వెళుతున్నారు. అందుకే ఊరుకున్నాం' అని ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం పాలసముద్రంలో మద్యం డిపోను మంత్రి సవితతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతపురం శివారులోని సోములదొడ్డి వద్ద ఐఎంఎఫ్ఎల్ గోడౌన్‌ను ప్రారంభించారు. ఈ రెండు చోట్లా మంత్రి మీడియాతో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లి పర్యటనలో పోలీసులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. 'పోలీసులను బట్టలూడదీసి కొడతానంటున్నావ్. ఈరోజు నువ్వు బట్టలు వేసుకుని తిరుగుతున్నావంటే అందుకు పోలీసులే కారణమని మరచిపోవద్దు. పోలీసుల్లో మహిళలు కూడా ఉన్నారు. వారిని కూడా అవమానించిన జగన్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలి' అని అన్నారు. పరామర్శకు సైతం జనాలకు డబ్బులిచ్చి పిలిపించి, అరాచకానికి పాల్పడ్డారని విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం స్కాంను బయటకు తీస్తున్నామని, ఇటీవలే సిట్ దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు.

జగన్ భద్రతపై కేంద్రానికి లేఖ రాశాం: బొత్స



విశాఖపట్నం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. గురువారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రామగిరిలో హత్యకు గురైన వైసీపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వెళితే ప్రభుత్వం కనీస భద్రతా ఏర్పాట్లు చేయలేదన్నారు. జగన్ భద్రతపై తమకు ఆందోళనగా ఉందని, ఈ విషయమై కేంద్రానికి లేఖ రాశామని, స్వయంగా ప్రధానిని కలిసి వివరిస్తామన్నారు. రాజకీయ నేతలపై మాట్లాడడం పోలీసులకు ఫ్యాషన్ అయిపోయిందన్నారు.

జగన్ నుంచే ప్రజలకు భద్రత కావాలి: నిమ్మల

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): 'నేర స్వభావం ఉన్న వ్యక్తి రాజకీయాల్లో ఉంటే ఎవరికి భద్రత కావాలి? భద్రత కావాల్సింది జగన్‌కు కాదు. జగన్ నుంచి రాష్ట్రానికి.. ప్రజలకు భద్రత కావాలి' అని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యానించారు. జగన్ భద్రతపై బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై ఆయన గురువారం సచివాయలంలో పైవిధంగా స్పందించారు. సీఎం చంద్రబాబు జెడ్ ప్లస్ కేటగిరీలో ఉన్నా నామమాత్రపు భద్రతతో పర్యటనలకు వెళ్తున్నారని, జగన్‌కు 1100 మంది పోలీసులతో భద్రత కల్పించినా సరిపోలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ వచ్చిన హెలికాప్టర్ వద్దే 250 మంది పోలీసులు ఉన్నారని, అయినా భద్రత లేదనడం ఏమిటన్నారు.

బట్టలు ఊడదీసి ఏం చూస్తావ్: నారాయణ

తిరుపతి ఆటోనగర్, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోలీసులపై జగన్ చేసిన వ్యాఖ్యలపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ స్పందిస్తూ.. 'పోలీసుల దుస్తులు ఊడదీస్తాననడం సబబు కాదు. వారి దుస్తులు ఊడదీసి ఏమి చూస్తావ్ జగన్' అంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన పాలనలో జగన్ పోలీసులను ఇష్టానుసారంగా వాడుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

పోలీసులకు జగన్ క్షమాపణ చెప్పాలి: పురందేశ్వరి



అమరావతి, మేడికొండూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): పోలీసులపై మాజీ సీఎం జగన్ హేయమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఆక్షేపించారు. పోలీసు శాఖలో పని చేసే వేలాది మంది మహిళల మనోభావాల్ని కించపరచడమేనని, పోలీసు శాఖకు ఆయన తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం పాలడుగులో గురువారం 'పల్లెకు పోదాం చలో' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలతో కలసి ఆరోగ్యకేంద్రం, సచివాలయాలు, ఆలయాలను పురందేశ్వరి సందర్శించారు. అనంతరం గ్రామస్తులతో రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ విద్వేషం, విధ్వంసం మినహా రాష్ట్ర అభివృద్ధికి జగన్ చేసిందేమీ లేదని విమర్శించారు. ప్రస్తుతం డబుల్ ఇంజన్ సర్కారుతో అభివృద్ధి పరుగులు పెడుతోందని చెప్పారు. తాజాగా కేంద్రం అమరావతికి రూ.4,285 కోట్లు ఇవ్వడంతోపాటు తిరుపతి-కాట్పాడి రైల్వేలైన్ అభివృద్ధికి 1331 కోట్లు మంజూరు చేసిందన్నారు. రొయ్యలు, చేపల ఎగుమతులకు సంబంధించి అమెరికాతో ప్రధాని మోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సంప్రదింపులు జరపడంతో సుంకాల పెంపు 90రోజులు వాయిదా పడిందన్నారు.

కారుమూరిపై ఏలూరులో కేసు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై గురువారం కేసు నమోదైంది. ఏలూరులో ఈ నెల 8న వైసీపీ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'వైసీపీ నాయకులను వేధించిన వాళ్లను గుర్తుపెట్టుకుంటాం. గుంటూరు ఇవతల ఉన్న వాళ్లను ఇంట్లో నుంచి లాగి కొడతారు. గుంటూరు అవతల ఉన్న వారిని నరికి పారేస్తారు' అని రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ వట్లూరు టీడీపీ గ్రామాధ్యక్షుడు నూతులపాటి నవీన్‌రాజు త్రీటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కారుమూరిపై బీఎన్ఎస్ 192, 196 (1), 351(2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ఎంత తేడా!

(మొదటి పేజీ తరువాయి)

వారి కుటుంబ సభ్యులు, మహిళలు, ఆడబిడ్డలు, చిన్నారులపై సోషల్ మీడియాలో నీచమైన వ్యాఖ్యలు చేసే సంస్కృతికి కూటమి ప్రభుత్వం తొలి నుంచీ వ్యతిరేకంగా ఉంది. దీనికోసం 2024 నవంబరులో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసింది. వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులతోపాటు టీడీపీ, జనసేన కేడర్ పెట్టే పోస్టింగ్‌లపైనా ఈ బృందాలు నిఘా పెట్టాయి. కేసులు పెట్టారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ చంద్రబాబు, పవన్ కల్యాణ్ 'సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లు'ను తీసుకురావాలని యోచిస్తున్నారు. గత నవంబరులో అసెంబ్లీలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ బిల్లు విషయం ప్రస్తావించారు. దీనిపై ప్రభుత్వం సీరియస్‌గా కసరత్తు చేస్తోంది.

అధికారం ఉన్నా...పోయినా అదే తీరు..

ప్రత్యర్థి పార్టీ నేతలపై దాడులకు తెగబడినవారికి.. అసభ్యకరమైన రీతిలో దూషణలు చేసిన వారికి పెద్దపీట వేయడం వైసీపీకి తొలి నుంచీ అలవాటే. 2017లో వైసీపీ ప్లీనరీలో అప్పటి నగరి ఎమ్మెల్యే రోజా ప్రసంగించే సమయంలో సీనియర్ వైసీపీ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆమె వద్దకు వచ్చి, అప్పటి సీఎం చంద్రబాబును బాగా తిట్టాలని జగన్ చెప్పారని చెబుతున్న వీడియో ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో తిరుగుతోంది. ప్రత్యర్థులపై అసభ్య పోస్టులు పెట్టేవారికి జీతాలిచ్చి ప్రోత్సహించిన పార్టీ వైసీపీ. 2019లో అధికారంలోకి వచ్చాక విద్వేష రాజకీయాల్లో బాగా దూకుడు పెంచేశారు. చంద్రబాబును అసభ్య పదజాలంతో దూషించిన కొడాలి నాని, అనిల్ యాదవ్‌కు జగన్ మంత్రి పదవులిచ్చారు. వైసీపీ హయాంలో వర్రా రవీంద్ర రెడ్డి, ఇప్పాల రవీంద్ర రెడ్డి, పంచ్ ప్రభాకర్, వంటి వారి ద్వారా టీడీపీ నేతలు, వారి కుటుంబ సభ్యులపై జుగుప్సాకరరీతిలో పోస్టులు పెట్టించేవారు. చివరికి జగన్ సొంత చెల్లెలు షర్మిలను, బాబాయ్ కూతురు సునీతను కూడా వదలకుండా వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలు అసభ్య పోస్టులు పెట్టారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వహననానికి తెర దీసిందే వైసీపీ. ఆ పార్టీ సోషల్ మీడియా సజ్జల భార్గవ్‌రెడ్డి చేతిలోకి వచ్చిన తర్వాత వారికి పట్టపగ్గాల్లేకుండా పోయాయి. చివరికి 2024 ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయినా ఆ పార్టీ నేతలు మాత్రం దూషణల పర్వాన్ని ఆపలేదు.

వారిని వదిలేసి....

చేబ్రోలు కిరణ్ విషయంలో టీడీపీ అధిష్ఠానం స్పందించిన తీరుపై టీడీపీ శ్రేణుల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. తప్పు ఎవరు చేసినా తప్పేనంటూ అధిష్ఠానం చర్యను సమర్థిస్తూ కొందరు టీడీపీ కార్యకర్తలు పోస్టులు పెడుతున్నారు. మరికొందరు మాత్రం.. కిరణ్ కన్నా దారుణంగా పోస్టులు పెట్టే వైసీపీ సోషల్ మీడియా యాక్టివిస్టులు చాలా మంది ఉన్నారని, వారందరినీ ముందు అరెస్టు చేసి ఆ తర్వాత కిరణ్‌ని అరెస్టు చేసి ఉంటే బాగుండేదని అభిప్రాయపడుతున్నారు.

మేయర్‌ను ఆక్షేపించిన హైకోర్టు

రెండు రోజుల క్రితం రాప్తాడు నియోజకవర్గ పర్యటనకు వెళ్లిన జగన్..పోలీసులను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారమే చెలరేగింది. గత ఏడాది వైసీపీకి చెందిన గుంటూరు మేయర్ కావేటి మనోహర్ నాయుడు.. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అసభ్యకర వ్యాఖ్యలు చేయగా, ఆయనపై టీడీపీ నేత కనపర్తి శ్రీనివాసరావు కేసు పెట్టారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం మనోహర్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు సైతం ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టింది. ఇప్పటికీ సామాజిక మాధ్యమాల్లో పాలేటి కృష్ణవేణి, ప్రవీణ్ రెడ్డి వంటి పేర్లతో ఎందరో వైసీపీ వారు.....టీడీపీ, జనసేన నేతలపై అసభ్యకర పోస్టులు పెడుతూనే ఉన్నారు. హోం మంత్రి అనితపై పల్నాడు జిల్లా నకరికల్లుకు చెందిన రాజశేఖర్ అనే వ్యక్తి అసభ్యకర పోస్టులు పెడితే వైసీపీ పెద్దలు ఏకంగా తమ ఇంట్లో అతనికి ఆశ్రయం కల్పించారు. పోలీసులు రాజశేఖర్‌ను మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంట్లో అరెస్టు చేశారు.

పోలీసులపై గోరంట్ల మాధవ్ దౌర్జన్యం

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు ఎస్పీ కార్యాలయం వద్ద మాధవ్ హల్‌చల్ సృష్టించారు. ఎట్టకేలకు మాధవ్ సహా నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. నిజానికి, చేబ్రోలు కిరణ్ సోషల్ మీడియాలో చేసిన అనుచిత వ్యాఖ్యలపై టీడీపీ వెనువెంటనే స్పందించి ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. పోలీసులు వేగంగా రంగంలోకి దిగి కిరణ్‌ను అరెస్టు చేశారు. వాస్తవం ఇది కాగా, కిరణ్‌ను అరెస్టు చేసిన పోలీసుల విధులకు మాజీ ఎంపీ మాధవ్ అడ్డుతగలడమే కాకుండా, వారిపైనా దౌర్జన్యానికి పాల్పడ్డారు. అంతకు ముందు, తన అనుచరులతో కారులో పోలీసుల వాహనాన్ని వెంబడించారు. పోలీసుల అదుపులో ఉన్న కిరణ్‌పై దాడికి ప్రయత్నించారు. ప్రతిఘటించిన పోలీసులపైనా విరుచుకుపడ్డారు. ఈ క్రమంలో పోలీసుల వాహనం ఎస్పీ కార్యాలయంలోకి వెళ్లింది. అయినా, వదలకుండా ఆ వాహనాన్ని మాధవ్ వెంబడించారు. ఎస్పీ కార్యాలయం ప్రాంగణంలోనూ కిరణ్‌పై దాడికి మరోసారి ప్రయత్నించారు. గోరంట్ల మాధవ్‌తో పాటు ఆయన అనుచరులు ముగ్గురిని పోలీసులు ఎట్టకేలకు అదుపులోకి తీసుకొన్నారు. ఎస్పీ కార్యాలయంలోని ఒక గదిలో కొంతసేపు వారిని నిర్బంధించారు. అనంతరం అక్కడ నుంచి నగరంపాలెం పోలీస్‌స్టేషన్‌కు, ఆ తర్వాత నల్లపాడు స్టేషన్‌కు తరలించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం తోపాటు పోలీసుల అదుపులో ఉన్న నిందితుడిపై దాడికి యత్నించడం తదితర సెక్షన్ల కింద నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని పోలీసు అధికారులు తెలిపారు. కాగా, కిరణ్ ను ఇబ్రహీంపట్నం నుంచి గుంటూరు ఎస్పీ కార్యాలయానికి తరలిస్తున్నారనే విషయంగానీ, ఏ వాహనంలో తీసుకొస్తున్నారనేది గానీ మాధవ్‌కు ఎలా తెలిసిందనేది ప్రస్తుతం పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. వైసీపీతో సన్నిహిత సంబంధాలు ఉన్న పోలీస్ అధికారే లీక్ చేసి ఉంటారనే ప్రచారం జరుగుతుంది. గురువారం విజయవాడలో మీడియా సమావేశంలో పాల్గొన్న గోరంట్ల మాధవ్ ఆ తరువాత నేరుగా కిరణ్‌ను తరలిస్తున్న పోలీసు వాహనాన్ని గుర్తించి వెంబడించడం అనుమానాలకు తావిస్తోంది. మాధవ్ హడావుడి అంతా వైసీపీ మైండ్ గేమ్‌లో భాగమని పోలీస్ వర్గాలు అంటున్నాయి. మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను కలవడానికి మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నగరంపాలెం స్టేషన్‌కు వెళ్లారు. అప్పటికే ఆయనను పోలీసులు నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించడంతో కొద్దిసేపు ఎదురు చూసి తిరిగి వెళ్లిపోయారు.

ప్రాసిక్యూషన్‌కు పూర్తి అఫిడవిట్ ప్రతి అందించండి

వంశీ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు సూచన

అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీనేత వల్లభనేని వంశీ బెయిల్ పిటిషన్ గురువారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ స్పందిస్తూ.. తమకు అందించిన ముందస్తు బెయిల్ పిటిషన్ కాపీలలో కొన్ని పేజీలు మిస్ అయ్యాయని తెలిపారు. దీంతో న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు విచారణను ఈనెల 16కు వాయిదా వేశారు. పూర్తి వివరాలున్న అఫిడవిట్ కాపీని ప్రాసిక్యూషన్‌కు అందజేయాలని సూచించారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి వ్యవహారంలో సత్యవర్ధన్ ఫిర్యాదు ఆధారంగా పలువురిని నిందితులుగా చేరుస్తూ 2023 ఫిబ్రవరి 22న గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. వంశీకి బెయిల్ ఇచ్చేందుకు ట్రయల్ కోర్టు నిరాకరించడంతో హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న గొంతెన రాజ్‌కుమార్‌కు ఎస్సీఎస్టీ చట్టం కింద పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు వర్తించవని ఎస్సీఎస్టీ కేసులను విచారించే విజయవాడ ప్రత్యేక కోర్టు న్యాయాధికారి ప్రస్తావించడాన్ని సవాల్ చేస్తూ సీఐడీ వేసిన క్రిమినల్ రివిజన్ పిటిషన్‌ను కూడా వంశీ ముందస్తు బెయిల్ పిటిషన్‌తో జత చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

చంద్రబాబూ.. చర్యకు ప్రతిచర్య తప్పదు

- ఉమ్మడి కర్నూలు జిల్లా వైసీపీ నేతలతో జగన్



అమరావతి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వచ్చాక చంద్రబాబు చేసే చర్యలకు ప్రతి చర్యలు తప్పవని వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హెచ్చరించారు. తాడేపల్లి ప్యాలెస్‌లో గురువారం ఉమ్మడి కర్నూలు జిల్లా నేతలతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తూ భయానక వాతావరణం సృష్టిస్తున్నారని జగన్ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం పోలీసులను వాచ్‌మెన్‌ల కంటే ఘోరంగా వాడుకుంటున్నదని ఆరోపించారు. చంద్రబాబు భయపెట్టే ప్రయత్నాలు చేస్తాడని పార్టీ నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై కేసు

- హెలిప్యాడ్ వద్ద పోలీసులతో దురుసు ప్రవర్తన
- గాయపడిన కానిస్టేబుల్ ఫిర్యాదు

ధర్మవరం/రామగిరి, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డిపై కేసు నమోదైంది. గురువారం శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పోలీసులు ఆయనతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు. ఈ నెల 8న రాప్తాడు (అనంతపురం జిల్లా) నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా తోపులాట జరిగింది. వైసీపీ శ్రేణులు పోలీసులకు ఎదురు తిరిగి, వారిని తోసేసి హెలికాప్టర్ వద్దకు వెళ్లారు. ఆ తోపులాటలో పుట్టపర్తి రూరల్ పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ నరేంద్రకుమార్ గాయపడ్డారు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డితో పాటు మరికొందరిపై రామగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్‌లు 186, 188, 341, 332, 352, 114, 506, 34 కింద కేసు నమోదు చేశామని ఏఎస్ఐ ప్రసాద్ తెలిపారు. హెలిప్యాడ్ వద్ద వైసీపీ కార్యకర్తలు తమ విధులకు ఆటంకం కలిగించారని, దురుసుగా ప్రవర్తించడంతో గాయాలయ్యాయని కానిస్టేబుల్ ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి రెచ్చగొట్టడం వల్లే ఇదంతా జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. జగన్ పర్యటన లో చోటు చేసుకున్న సంఘటనలకు తోపుదుర్తి ప్రకాశ్ రెడ్డే కారణమని పోలీసులు అంటున్నారు. హెలిప్యాడ్ నిర్వహణ బాగా లేదని డీఎస్పీ సహా పలువురు పోలీసులు చెప్పినా ప్రకాశ్ రెడ్డి పట్టించు కోలేదని అంటున్నారు. చిన్న ఊరు కావడంతో కార్యకర్తలను తరలించవద్దని ఎస్పీ రత్న చెప్పినా పెడచెవిన పెట్టారని, పైగా భద్రతా వైఫల్యం అంటూ తమపైనే ఆరోపణలు చేస్తున్నారని పోలీసులు ఆగ్రహంగా ఉన్నారు. ఈ క్రమంలో సమగ్రంగా దర్యాప్తు చేస్తూ చర్యలకు ఉపక్రమించారు.

వైఎస్ భారతిపై అనుచిత వ్యాఖ్యలు...

టీడీపీ కార్యకర్త కిరణ్ అరెస్టు

- మంగళగిరి రూరల్ స్టేషన్‌లో కేసు
- ఇబ్రహీంపట్నం వద్ద అదుపులోకి..
- పార్టీ నుంచి సస్పెండ్ చేసిన టీడీపీ

గుంటూరు, ఏప్రిల్ 10(ఆంధ్రజ్యోతి): యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో వైఎస్ జగన్ సతీమణి భారతిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఆత్మకూరుకు చెందిన వైసీపీ కార్యకర్త బంగు వెంకట కృష్ణారెడ్డి, సంగేవు వెంకట శివరామకృష్ణలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 155/2025గా బీఎన్ఎస్ 19(1), 79, 353(1), 61(2), 111(1), సెక్షన్ 7(ఎ), 37 తదితర సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. చేబ్రోలు కిరణ్‌ను కృష్ణాజిల్లా ఇబ్రహీంపట్నం శివారులో గురువారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకున్నారు అక్కడి నుంచి గుంటూరులోని జిల్లా ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చి.. మీడియా ఎదుట హాజరుపరిచారు. మాజీ సీఎం జగన్ పోలీసులను బట్టలూడదీస్తామని రెండు రోజుల క్రితం హెచ్చరించిన విషయం తెలిసిందే. దీనిపై యూట్యూబ్ చానల్ ఇంటర్వ్యూలో కిరణ్ స్పందిస్తూ, వైఎస్ భారతి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఈ వ్యాఖ్యలను ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించిందని ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. సెల్ టవర్ లొకేషన్ ఆధారంగా ట్రాక్ చేసి హైదరాబాద్ మార్గంలో ఇబ్రహీంపట్నం వద్ద కిరణ్‌ను అరెస్టు చేశామని చెప్పారు. గతంలో మాజీమంత్రి విడదల రజిని పట్ల అనుచితంగా మాట్లాడిన ఘటనపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌పై కేసు నమోదైందన్నారు. నగరంపాలెం, గన్నవరం, తాడేపల్లి, చేబ్రోలు పోలీస్ స్టేషన్‌లోనూ సోషల్ మీడియా పోస్టులపై కేసులు, ముందు జాగ్రత్త చర్యగా అరెస్టు చేసిన కేసులు ఆయనపై ఉన్నాయని చెప్పారు. కాగా, చేబ్రోలు కిరణ్‌పై చర్య తీసుకోవాలంటూ వైసీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శామ్యూల్, పట్టణ పార్టీ అధ్యక్షుడు వట్టెం మనోహర్, ఉపాధ్యక్షుడు దివ్వెల రామారావు, గంగోలు వినోద్ గురువారం జగ్గయ్యపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పవన్ తనయుడిపై వ్యాఖ్యలు.. కేసుల నమోదు

డిప్యూటీ సీఎం పవన్ తనయుడిపై 'ఎక్స్'లో అనుచిత పోస్టులు పెట్టిన వారిపై గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, విజయవాడలో రెండు కేసులు నమోదయినట్టు గుంటూరు ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. వారు ఎవరన్నది తెలుసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని, ఎక్స్ సంస్థకు లేఖ రాశామని తెలిపారు. త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

'ఆడుదాం'లో కొల్లగొట్టు!

(మొదటి పేజీ తరువాయి)

ముద్ర పడింది. ఆ ఇంజనీరింగ్ అధికారి శ్రీసత్యసాయి జిల్లాలో కియా కార్ల పరిశ్రమకు సమీపంలో ఉన్న తన భూమిని ఏకంగా ఆమె పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. అంతేగాక ఆమె బ్యాంకు ఖాతాలకు రూ.12 కోట్ల నగదు బదిలీ చేయించారు. గత ప్రభుత్వంలో గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యవహారం సాగిపోయింది. ఎట్టకేలకు సదరు అధికారి కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలియడంతో 'అసలు కథ' మొదలైంది. వారు ఆమె ఇంటికి వెళ్లి తమ ఆస్తి తిరిగి ఇవ్వాలని అడగటంతో వివాదం రాజుకుంది. ఇది కాస్తా పోలీస్ స్టేషన్‌కు చేరింది. దీంతో ఇంజనీరింగ్ అధికారి ఇంటి 'గుట్టు' రట్టయింది. అవినీతి వ్యవహారం రచ్చకెక్కింది. కొద్దిరోజులుగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ కేంద్రంగా జరుగుతున్న ఈ పంచాయితీ ఇటు పోలీసు, అటు శాప్ వర్గాల్లో దుమారం రేపుతోంది.

ఇదీ అవినీతి కథ..

కడప జిల్లాకు చెందిన సదరు ఇంజనీరింగ్ అధికారి విజయవాడలోని రహదారులు, భవనాల శాఖలో విధులు నిర్వహించేవారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు శాప్ ఆధ్వర్యంలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకోసం వివిధ పరికరాలు, సామగ్రి కొనుగోలుకు నిర్వహించే టెండర్ల ప్రక్రియను పూర్తి చేయడానికి ఈ అధికారిని డిప్యుటేషన్‌పై శాప్‌కు తీసుకొచ్చారు. నాడు ఆడుదాం ఆంధ్రా ఆరంభం నుంచి ముగింపు వరకు మొత్తం ప్రక్రియను ఈ అధికారి భుజాలపై మోశారని శాప్ వర్గాలు చెబుతున్నాయి. ఆయనకు కొన్నేళ్ల క్రితం ఓ మహిళ విజయవాడలో పరిచయమైంది. ఆమె సొంతూరు ఎన్టీఆర్ జిల్లా నందిగామ. ఈ ఇంజనీరింగ్ అధికారికి శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామంలో కియా కార్ల పరిశ్రమకు సమీపంలో ఉన్న భూమిని ఆమె పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించినట్టు విశ్వసనీయ సమాచారం. ఈ విషయం అధికారి కుటుంబ సభ్యులకు తెలియడంతో కొద్దిరోజుల క్రితం నందిగామలో ఉంటున్న ఆమె ఇంటికి వెళ్లారు. తమ ఆస్తిని తిరిగి తమకు ఇవ్వాలని, తమ పేరిట రాయించాలని డిమాండ్ చేశారు. దీనికి ఆమె ఎదురు తిరిగింది. ఈ నేపథ్యంలో అక్కడ వివాదం జరిగింది. అధికారి కుటుంబ సభ్యులు తన ఇంటికి వచ్చి దాడి చేశారని ఆమె నందిగామ పోలీసులకు కొద్దిరోజుల క్రితం ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సదరు ఇంజనీరింగ్ అధికారిని పోలీసులు విచారణకు పిలిపించారు. భూమిని రిజిస్ట్రేషన్ చేయడమే కాకుండా ఆమె బ్యాంకు అకౌంట్లకు రూ.12 కోట్లు బదిలీ చేసినట్టు ఆయన పోలీసులకు వెల్లడించినట్టు సమాచారం. సదరు మహిళకు చెందిన మూడు అకౌంట్లకు ఈ డబ్బు చేరిందనే ప్రచారం నడుస్తోంది. ఈ డబ్బు తనతో పాటు స్నేహితులు పంపారని ఇంజనీరింగ్ అధికారి చెప్పినట్టు విశ్వసనీయంగా తెలిసింది. నందిగామ కేంద్రంగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడానికి ఈ డబ్బులు ఇచ్చామని పోలీసులకు వెల్లడించారు.

వేర్వేరు ఖాతాల నుంచి బదిలీ

నాడు టెండర్లలో కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి చేకూర్చినందుకు వారు ఇంజనీరింగ్ అధికారికి భారీగా ముడుపులను కానుకలుగా ఇచ్చారు. వాటిని చాలా తెలివిగా వేర్వేరు అకౌంట్ల ద్వారా ఆ మహిళ ఖాతాలకు బదిలీ చేయించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శాప్‌లో ఆ ఇంజనీరింగ్ అధికారి డిప్యుటేషన్ కాలం కొన్నాళ్ల క్రితమే ముగిసింది. కూటమి ప్రభుత్వంలో ఒక మంత్రితో ఉన్న అనుబంధం, మరో మంత్రితో విద్యాభ్యాసం నుంచి ఉన్న బంధం రెండూ కలిసి డిప్యుటేషన్‌ను పొడిగించాయి.

ఆడుదాం పేరిట భారీ దోపిడీ

ఆడుదాం ఆంధ్రా పేరిట అప్పటి క్రీడల మంత్రి ఆర్కే రోజా, అప్పటి శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి భారీ అవినీతి చేశారని కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీనిపై శాప్ అధికారులు ఏసీబీకి ఫిర్యాదు కూడా చేశారు. సీఐడీకీ ఫిర్యాదు ఇచ్చారు. ఆడుదాం ఆంధ్రాలో మొత్తం రూ.119 కోట్లు ఖర్చు చేయగా, అందులో రూ.70 కోట్ల వరకు కాజేశారని ప్రాథమికంగా గుర్తించారు. సీఐడీకి అందిన ఫిర్యాదు విజయవాడ పోలీసు కమిషనర్‌కు రావడంతో ఏసీపీ స్థాయి అధికారితో విచారణ చేయించారు. దీనికి సంబంధించి ఆయన నివేదిక ఇచ్చినట్టు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.